

మే, 2015

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 7 సంచిక: 4 పేజీలు: 68 వెల: రూ. 20/-

## తెలంగాణ త్రాగునీటి పథకానికి జాతీయ అవార్డు




ప్రతి ఇంటికి నల్ల ద్వారా సురక్షిత త్రాగునీరు సరఫరా
తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం






తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు కలెక్టర్ల సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలను సమీక్ష చేస్తున్నారు. ఇతర మంత్రులు అధికారులు పాల్గొన్నారు




నూతనంగా ఎంపికైన పంచాయతీ కార్యదర్శుల రెండు వారాల శిక్షణ కార్యక్రమమును ప్రారంభించి ప్రసంగిస్తున్న టిసిపార్డు కమీషనర్ అనిత రామచంద్రన్ ఐ.ఏ.ఎస్, మరియు ఇతర అధికారులు

టిసిపార్డ్
TSIPARD

# స్థానిక పాలన

సంపుటి: 7 సంచిక: 4

మే, 2015



ఎడిటర్
**అనిత రామచంద్రన్**, ఐ.ఏ.ఎస్.
కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు
కె. యాదయ్య
డా॥ కె. ఆసయ్య
ఎ. నాగేశ్వరరావు



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్, టిసిపార్డ్
కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

ప్రచురణ
టిసిపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
తెలంగాణ, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని, టిసిపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.


# విషయ సూచిక


3/6/15
Telangana State Institute of P... Development
LIBRARY
Date:
Rajendranagar, Hyd-30.



సంపాదకీయం ..... 4
'మిషన్'తో రైతుల కల సాకారం ..... 5
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించండి ..... 6
టిసిపార్డ్ ..... 6
అచ్చ తెలంగాణ సినిమా ..... 7
మొక్కజొన్న లాభాలు మిన్న ..... 8
బొగ్గును అధికంగా ఉత్పత్తి చేస్తున్న జిల్లా ..... 9
స్కూళ్ళల్లో సన్న బియ్యము - పేద పిల్లల పాలిట వరం ..... 11
పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు ..... 12
మార్గనిర్దేశకుడు ..... 13
మట్టినమూనా సేకరించే విధానం, ఆవశ్యకత సాగునీటి నమూనా సేకరణ ..... 15
ఉద్యమంలా చెరువుల మరమ్మత్తులు ..... 18
వాతావరణంలో మార్పులు - తీసుకొనవల్సిన చర్యలు ..... 19
భారతీయుల పారతంత్ర్యం - పునరుజ్జీవనం ..... 23
మాత, శిశు మరణాల రేటులో మనమెక్కడ! ..... 25
షెడ్యూలు కులాల, మైనార్టీల అభివృద్ధి ..... 26
తెలంగాణలో అడవుల అభివృద్ధి - హరితహారం ..... 27
సాంస్కృతిక పునరుజ్జీవనంలో తెలంగాణ జాతరలు ..... 29
ఆర్కిడ్స్ పూల సాగు రైతులకు లాభదాయకం ..... 32
మెరుగైన వైద్య సదుపాయాలు - రోగుల పాలిట వరాలు ..... 34
బాణామతి (చేతబడి) ..... 35
సామాజిక ప్రగతి సూచిక- భారతదేశ స్థానం ..... 36
బాలల విద్యాహక్కులు - నేటి స్థితి ..... 37
జెండర్ సమానత్వం - పంచాయతీరాజ్ ప్రభుత్వాలు ..... 39
ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ..... 41
గ్రామ పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలి ..... 42
కాకతీయులు -శిల్ప కళాసేవ ..... 43
వ్యక్తిత్వం ..... 45
పంచాయతీరాజ్ సంస్థల ఆవిర్భావం ..... 46
ప్రభుత్వ పథకాలు భేష్ ..... 48
పీసా చట్టం అనుసరించి నిర్వహించే గ్రామసభ ..... 49
పర్యావరణ పరిరక్షణ - మన బాధ్యత ..... 52
ఆప్తమిత్రుని ఆర్తి ..... 53
డయాకేర్-బి తో షుగర్‌కి చెక్ ..... 54
ప్రాణాంతక వాయువుల నుండి కాపాడుకుందాం ..... 55
థైరాయిడ్ సమస్యలకు చక్కని చికిత్స ..... 56
జలియన్ వాలాబాగ్ దురంతం ..... 57
పరిశుభ్రతను పాటిద్దాం - స్వచ్ఛభారత్ ..... 59
14వ ఆర్థిక సంఘ నిధులు రూ. 580.34 కోట్లు ..... 61
పిల్లల సంరక్షణ ఎదుగుదల ..... 62
ప్రపంచ రక్తదాతల దినోత్సవం ..... 65

# శ్రామిక ఐక్యత రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు



ఏ దేశంలోనైనా శ్రామిక శక్తి ఐక్యత, ప్రగతికి సూచికలుగా చెబుతుంటారు. మన దేశంలో శ్రామిక శక్తి సెక్టారు పరంగా ఒకటే. కానీ దేశంలో శ్రామికుల్లో చాలా తేడాలున్నాయి. చేసే పనిని బట్టి వారి స్థితి ఆధారపడి ఉంటుంది. భారత్‌లో శ్రామిక శక్తిలో అసంఘిటిత శ్రామికులు ఎక్కువ. శ్రామికులలో ట్రేడ్ యూనియనిజం అభివృద్ధి కాలేదు. కారణం ఇండియా అర్ధ భూస్వామ్యం, అర్ధ పెట్టుబడిదారి విధానంతో నడుస్తున్నది. శ్రామికులకు తమ వేతనాలను గూర్చి బేరసారాలను సాగించే శక్తి లేదు. కారణం శ్రామికుల పనికి అధిక అవకాశాలు తక్కువ.

యజమాని-పనివారి మధ్య అంతగా సంబంధాలుండవు. కార్మికులు-యజమానుల మధ్య పలు మాధ్యమిక సంస్థలున్నాయి. శ్రామిక కాంట్రాక్టర్లు, ఏజెంట్లు, కమీషన్‌దారులు తదితరులు. వీరు శ్రామికులను పనిలో పెట్టించి కమీషన్ పొంది, బేరసారాలు సాగిస్తుంటారు. ఇందువల్ల శ్రామికులకు వేతనాలు తక్కువగా లభిస్తాయి.

నేటి సంస్కరణయుగంలో శ్రామికులు తమ శ్రమకు తగిన వేతనం పొందలేకపోతున్నారు. అందుకు ఏజెన్సీలు పనిచేయడమే. శ్రామిక శక్తిబలం తరచూ తరిగిపోతుంది. అధిక జనాభా వలన శ్రామికుల లభ్యత సులభం. శ్రామికులలో మహిళా కార్మికులు, పురుష కార్మికుల మధ్య వేతన వ్యత్యాసాలున్నాయి. వాటిని సరిచేయడంలో వెనుకబడి ఉన్నాం. జెండర్ బేధం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. దేశంలో శ్రామికులకు వేతనాలు అన్ని రంగాలలో ఒకే రీతిలో లేవు. ఉత్పత్తి, సహజవనరులు, నిర్మాణరంగాలలో వారి మధ్య తేడాలున్నాయి. అందుకే చట్టాలు కూడా తగిన స్పష్టత అందరి శ్రామికులకు రక్షణ కల్పించదు. కల్పించిన ఆ రక్షణలు పాటించే యాజమాన్యం తక్కువ.

అదే విదేశాలలో ముఖ్యంగా ఐరోపా దేశాలలో పారిశ్రామిక విప్లవం వలన ఉత్పత్తిలో అధిక మార్పులు సంభవించాయి. దానితో శ్రామిక శక్తి కొరత వలన వారు బేరసారాలు సాగించి, అధిక వేతన సదుపాయాలు పొందడమే కాక, శ్రామిక జన ఐక్యత వలన వారి కోరికలను సాధించుకున్నారు. అందులో 16 గంటల పని నుండి 8-10 గంటల పనికి నిర్దుష్టత పొందాయి. వారంలో ఒకరోజు సెలవు దినంగా పొందగలిగారు. పనికి తగిన వేతనాన్ని సాధించుకున్నారు. మహిళా కార్మికులకు సమానమైన పనికి సమానమైన వేతనాలు సాధించుకున్నారు. బోనస్‌ను పొందగలిగారు. పనికి తగిన జీతం, లాభాలలో శ్రామికునికి తగిన పారితోషికం పొందగలిగారు.

'శ్రామికులారా ఏకంకండి. పోరాడి హక్కులను సాధించుకోండి' అని మార్క్సు పిలుపునందుకొని కార్మికులు ఎన్నో హక్కులను పొందగలిగారు.

అలాగే భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో శ్రామికుల కోరికలు అందని ద్రాక్షపండులా సుదూరంగానే ఉన్నాయి. మన అభివృద్ధి రంగాలైన వ్యవసాయం, పాడిపరిశ్రమ, చేపల పెంపకం, పారిశ్రామిక రంగ ఉత్పత్తులలో అధిక లాభాలు పొందడంలో వెనుకబడి ఉన్నాం కనుక శ్రామికులకు బేరసారాలు సాగించే స్థితి అంతగా లభించలేదు. అయినా కలిసికట్టుగా పని చేసి కార్మికులు ఐక్యంగా పని చేస్తే ఏదైనా సాధించుకొనవచ్చు. అందుకు వారు ఏకమై ముందుకు రావాలి.

( అనిత రామచంద్రన్ )



**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయతో రైతుల కల సాకారమవుతుందని, చెరువుల పునరుద్ధరణ పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.**

పలు జిల్లాల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పాల్గొని చెరువు పనులను ప్రారంభించారు. వరంగల్ జిల్లా రేగొండ మండలం రేపాకపల్లి, మద్దపల్లి, గూడెపల్లి, భాగిర్తిపేట, నారాయణపురం, సుల్తాన్‌పురం, నిజాంపల్లి చెరువుల పునరుద్ధరణ పనులను శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి ప్రారంభించి మిషన్ కాకతీయలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మద్దూరు, బచ్చన్నపేటలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ప్రారంభించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, కొండాపూర్ చెరువుల పనులను ఎంపీ వినోద్‌కుమార్, పార్లమెంటరీ కార్యదర్శి వొడితెల సతీశ్‌కుమార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చెరువులతోనే గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయన్నారు. సీఎల్పీ ఉపనేత, జగిత్యాల ఎమ్మెల్యే టి.జీవన్‌రెడ్డి చురుకుగా పాల్గొంటున్నారు. రాష్ట్ర శాసనసభ సాక్షిగా ఈ అంశంపై ప్రసంగించిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పథకాన్ని అభినందించారు. జగిత్యాల నియోజకవర్గంలోని పలు చెరువుల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, దుబ్బాక నియోజకవర్గం చెల్లాపూర్, రాజక్కపేటల్లో ప్రభుత్వ అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి, హత్నూర, కౌడిపల్లి మండలాలోల్ల ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రారంభించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలో అక్కలమ్మ చెరువు, నోముల పరిధిలోని గొరెంకలకుంట పనులను ఎమ్మెల్యే వీరేశం ప్రారంభించారు.

# 'మిషన్' తో రైతుల కల సాకారం

మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట మండలంలోని చౌట్‌పల్లి దామర్లచెరువు, నడింపల్లి ఇప్పల చెరువు పనులను మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్‌తో కలిసి ప్రారంభించారు. హన్వాడ మండలం దచ్చక్‌పల్లి చెరువు పనులను పార్లమెంటరీ రెవెన్యూ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు.

ఆదిలాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని దుబ్బగూడ చెరువు, ఉషేగాం చెరువు పనులను ఎంపీ నగేశ్, పార్లమెంటరీ కార్యదర్శి కోవ లక్ష్మి మంచిర్యాల మండలం వేంపల్లి కండివాకుంట, లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్‌లోని చుక్కకుంట చెరువు పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రారంభించారు.



మిషన్ కాకతీయ కార్యక్రమం అద్భుతమని, ఇందులో ఎలాంటి అవినీతి చోటుచేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అభిప్రాయపడ్డారు. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహించిన సీపీఎం కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

# పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించండి



**పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా ఇప్పటివరకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలతో సంతృప్తి చెందకుండా అధికారులు మరింత రెట్టించిన ఉత్సాహం, అంకితభావంతో పనిచేయాలని మంత్రి కె. తారక రామారావు అన్నారు. అంశాలవారీగా ప్రాధాన్యతలు గుర్తించడం, లక్ష్యాలను నిర్దేశించుకోవడం ద్వారా సకాలంలో ప్రజలకు సరైన సేవలందించగలుగుతామన్నారు.**

సచివాలయంలో పిఆర్, ఆర్‌డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి ప్రభుత్వం ఏర్పాటైన నాటినుంచి ఇప్పటివరకు అమలైన పథకాలు, కార్యక్రమాలపై వివరాలు సేకరించారు. వాటర్‌గ్రిడ్, ఆసరా, రహదారులు, ఉపాధిహామీపై నివేదికలు తీసుకున్నారు.

వాటర్‌గ్రిడ్ ఇంటెక్‌వెల్ నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. పూర్తి వివరాలతో నివేదిక తయారుచేస్తే సిఎం కలెక్టర్లకు దిశానిర్దేశం చేసే అవకాశం ఉందన్నారు.

ఇపిపి విధానాన్ని పక్కకు పెట్టి ఎఎంఎఫ్ ఇవ్వని తొలి ప్రభుత్వం తమదేనన్నారు. గ్రామాల్లో పన్నుల చెల్లింపులపై కమీషనర్ శ్రీమతి అనిత రామచంద్రన్ వివరించారు. శాఖలవారీగా నివేదికలు సిద్ధం చేసుకుని కలెక్టర్లకు అందించాలని సూచించారు.

శాఖవరంగా నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తిచేయాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. పిఆర్ రహదారులను సకాలంలో పూర్తిచేసి తనకు నివేదిక ఇవ్వాలన్నారు. మరుగుదొడ్లు, పారిశుద్ధ్యంపై నివేదిక రూపొందించాలన్నారు.

\- టిఎస్‌ఓ

# టిసిపార్డ్

## స్థాపన, వారసత్వం

1954 లో ప్రారంభమైన ఈ సంస్థ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని బీహర్‌లోని రాంచీ, హర్యానాలోని నీలో భారీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాజేంద్రనగర్ మొత్తం 3 ఓరియేంటేషన్ శిక్షణా కేంద్రాలు స్థాపించబడ్డాయి. అయితే అప్పటివరకూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే ఈ సంస్థలు 1967వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చాయి.

73వ రాజ్యాంగ సవరణ నేపథ్యంలో విస్తృతమైన శిక్షణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని అప్పటి మన ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఈ సంస్థను బలోపేతం చేసి తగిన సిబ్బందికి బడ్జెట్‌ను కేటాయిస్తూ, 1996 సంస్థ పేరును ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమిగా పేరు మార్చడం జరిగింది.

అయితే 2002 నుండి ఈ సంస్థను ఎలిమినేటి మాధవరెడ్డి ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమిగా (ఎ.ఎమ్.ఆర్.అపార్డ్)గా పిలువబడుతుంది. ప్రస్తుతం 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం ఈ సంస్థ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండటం చేత ఈ సంస్థ పేరును తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థగా (టిసిపార్డ్) పేరు మార్చడం జరిగింది.

## టి.సి పార్డ్ లక్ష్యాలు

తెలంగాణా రాష్ట్రంలోని పంచాయితీరాజ్ సంస్థలోని ప్రజాప్రతినిధులు మరియు పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని పనిచేస్తున్న అధికార యంత్రాంగానికి, వీరితోపాటు మహిళా శిశు సంక్షేమ, రెవెన్యూ, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం వంటి మరెన్నో ఇతర శాఖల సిబ్బందికి శిక్షణ అందజేయడం జరుగుతుంది.

మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా టివి తదితర పరికరాలు ఏర్పాటు చేసింది. అంతేకాక దూరదర్శన్ ద్వారా కూడా ప్రత్యేక కార్యక్రమాలు ప్రసారం చేసింది. అభివృద్ధి కార్యక్రమాలపై విలువైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచాయితీ స్థాయి వరకు చేర్చి అక్కడ ప్రజాప్రతినిధులకు, అధికారులకు సామర్థ్యాలు పెంచే నిమిత్తం చర్యలు తీసుకుంటున్నారు.

యూట్యూబ్, ఫేస్‌బుక్, వంటి సోషల్ మీడియాను ఉపయోగించుకుని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని తన భాగస్వాములతో ఎప్పటికప్పుడు పంచుకుంటారు. అపార్డ్ దేశంలోనే అగ్రగామి సంస్థగా గత దశాబ్దంలో పేరు పొందింది. ◆

# అచ్చ తెలంగాణ సినిమా

సరిగ్గా పదేళ్ల కిందటి 1938 నాటి తెలంగాణ సమాజాన్ని జీవితాన్ని సంఘర్షణకు, సంస్కృతికి అద్దం పట్టిన సినిమా 'చిల్లర దేవుళ్లు'. ఇంకా చెప్పాలంటే తెలంగాణ ప్రాంతంలో భూస్వామ్య వ్యవస్థ విలయ తాండవం చేస్తున్నప్పుడు అప్పటి సగటు మనిషి దుస్థితికి, అజ్ఞానానికి, అమాయకత్వానికి ప్రతీకగా నిలిచిన 'నీ బాంచన్ నీ కాల్మొక్తా' అనే మాట ప్రాణవాయువైన కాలం నాటి కథ ఈ చిల్లర దేవుళ్లు.

మనిషి పట్ల మనిషే అమానవీయంగా ప్రవర్తించిన సమాజం నాటిది ఈ కథ. ఈ కథను దాశరథి రంగాచార్య 'చిల్లరదేవుళ్లు' నవలగా రాస్తే అదే పేరుతో తెరకెక్కించిన దర్శకుడు తిరునగరి మాధవరావు (1934-1995). వరంగల్లులోనే పుట్టినవాడు ఆదుర్తి వద్ద అసిస్టెంటుగా పనిచేసిన ఆయన 1977లో తన మూడవ సినిమాగా 'చిల్లర దేవుళ్లు' తీయాలనుకున్నారు. (మొదటి రెండు చిత్రాలు 'తాళిబొట్టు', 'కన్నతల్లి'). అప్పటికే తెలంగాణలో గొప్ప నవలగా పేరొందిన నవల హక్కులు తీసుకుని వరంగల్ హన్మకొండ ప్రాంతంలోనే పూర్తిగా చిత్రీకరించి నిర్మించారు. నటించిన తారల్లో అత్యధికులు తెలంగాణవారే. టెక్నిషియన్స్‌లో ఆర్ట్ డైరెక్టర్ మన చంద్ర.




రేఖామాత్రంగా 'చిల్లర దేవుళ్లు' కథ గురించి పాణి సద్గుణవంతుడైన మధుర గాయకుడు. ఒక పల్లెలో సంగీతం పాఠాలు చెప్పుకొని పొట్ట పోసుకోవాలని అతడు ఆ వూరి దొర ప్రాపకం సంపాదిస్తాడు. దొరగారి దేవిడిలోని ఒక పనికత్తె మీద అతడికి సానుభూతి. దొరగారి అమ్మాయికి అతడిపై కన్ను. అతడికి తన కుంటి కూతురిని కట్టబెట్టాలని ఆ వూరి కరణం ఎత్తుగడ.

ఇన్ని శక్తుల మధ్య పడి నలిగిపోతున్న పాణి తన దొర అత్యాచారాలను, వాటిని భరించలేక ఆ పల్లె ప్రజలు పడే మూగవేదనను చూసి వీటిని దర్శకుడు మాధవరావు వాస్తవికంగా సహజమైన వాతావరణంలో ఒక సత్యజిత్ రే, ఒక మృణాల్‌సేన్‌ను తలపించే రీతిలో చిత్రీకరించారు. చిత్రంలోని భాషలో కొంత ప్రాంతీయమైన యాస స్పష్టంగా ఉంది. చక్కని నుడికారాలతో, జాతీయాలతో సంభాషణలలో జీవం ఉట్టి పడుతుంది.

కె.వి. మహదేవన్ సమకూర్చిన బాణీలన్నీ మళ్ళీ మళ్ళీ వినాల నిపిస్తాయి. 'పాడాలనీ ఉన్నది', 'కలువకు చంద్రుడు ఎంతో దూరం', 'ఏటికేతంబట్టి', 'బతుకమ్మ' పాటలు గుర్తుంచుకో దగినవి. నటీనటులలో కొత్త నటుడు వినయ్‌కుమార్ పాణిగా ఒక బెంగాలీ నటుని జ్ఞాపకం చేస్తూ, తనదైన సొంత బాణీలో ఉత్తమ నటనను ప్రదర్శించారు.

దొర కుమార్తెగా కొత్తనటి అయినా, ఉమాభారతి నటన ఉత్తమ స్థాయిలో, సహజంగా ఉంటుంది. దొరగా ప్రభాకర్‌రెడ్డి, అతని భార్యగా సావిత్రి, కరణంగా భానుప్రకాశ్ ఆ పాత్రలు జ్ఞాపకం వుండే రీతిలో ఉత్తమ నటన చూపించారు.

దొర ఇంటిలో పనికత్తెగా కాంచన నటన ఉన్నతస్థాయిలో ఉంటుంది. సినిమా జయాపజయాలు ఎలా ఉన్నా అచ్చ తెలంగాణ సినిమాగా చిల్లరదేవుళ్లు స్థానం చెరిగిపోనిది.



# మొక్కజొన్న లాభాలు మిన్న!

**పైరులో 20 నుంచి 25 రోజులు, 40 నుంచి 45 రోజులు, 60 నుంచి 65 రోజులు దశలో ఎరువులు వేయాలి.**

భాస్వరం ఎరువులను మొదటి దశలో వేయాలి. పై పాటుగా కాంప్లెక్సు ఎరువుల వేయాల్సిన అవసరం లేదు. పొటాష్ 25 రోజుల దశలో 25 కిలోలు, 65 రోజుల దశలో 25 కిలోలు రెండు దఫాలుగా వేయాలి.

జింక్ లోపం లేకుండా చూడాలి. జింక్ లోపం ఉంటే ఆకులు పసుపు పచ్చ రంగులో మారుతాయి. ఇది గమనించి పైరులో 40 రోజుల్లోలోపు రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



### కోత కోసే సమయంలో ఈ జాగ్రత్తలు అవసరం

జొన్నకు కాండం పొడవుగా కట్ చేయాలి. కోసిన తరువాత కళ్లాల్లో ఆరబెట్టాలి. మార్చిన అనంతరం వెంటనే పలుచగా అరబెట్టాలి. తేమ శాతం తక్కువగా ఉండే విధంగా చూడాలి. కోతకు ముందు పైరులో పురుగులు ఆశించడం, కలుపు, తెగుళ్ల వల్ల కొంత మేరకు నష్టం వాటిల్లవచ్చు. కోత అనంతరం గింజలు రాలిపోకుండా చూడాలి. యంత్రంతో నూర్పిడులు చేయడం మంచిది. పంట పూర్తిగా ఎండాక మాత్రమే కోతలు వేయాలి. యంత్రాల ద్వారా గింజలు వలిచేటప్పుడు కొంత నష్టం జరుగుతుంది. ఈ సమస్య నివారణకు గింజలు బాగా ఎండబెట్టాలి.

### గోడౌన్లలో నిల్వ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు

30 డిగ్రీల ఫారన్ హీట్ ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలి. గింజలో 14 శాతం తేమ, వాతావరణంలో 60 శాతం తేమ ఉండాలి. కొత్త గోడౌన్లలో మాత్రమే నిల్వ చేయాలి. చల్లగా, శుభ్రంగా పొడి వాతావరణంలో ఉన్న ప్రదేశంలో నిల్వ చేయాలి.

మలాథియాన్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. గింజలు ఆరబెట్టాక మాత్రమే నిల్వ చేయాలి. బస్తాలు ఒకటి నిలువుగా, ఒకటి అడ్డంగా వేయాలి. ఎలుకలు రాకుండా నివారించాలి. బ్రోమోడయోలిన్ మందు, రోబోన్ కేక్‌లు పెట్టి ఎలుకలను నివారించవచ్చు. గిడ్డంగులలో గింజలకు పురుగులు ఆశించకుండా చూడాలి. గింజలో తేమశాతం కచ్చితంగా ఉంటే ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది.

సింగరేణి బొగ్గు గనిని, పచ్చని అడవిని, పారే జీవనది గోదావరిని కలిగిన ఖమ్మం జిల్లాను పూర్వకాలంలో 'స్తంబాద్రి' అని పిలిచేవారు. చారిత్రక ఆధారాల ప్రకారం ఈ జిల్లాని కమ్మ మెట్టుగా, తరువాత ఖమ్మం మెట్టుగా పిలవబడింది.

### మామిడి సాగు అధికం

* ఈ జిల్లా భౌగోళిక పరంగా 16,02,900 హెక్టార్లను కలిగి ఉంది. ఇందులో 4,55,841హెక్టార్ల భూమి నికరసాగుబడి జరుగుతుంది. ఒకటి కంటే ఎక్కువగా సాగు చేస్తున్న నికరసాగుబడి 54,052 హెక్టార్లు. ఈ జిల్లాలో 2,93,690 హెక్టార్లలో ఆహార పంటలను, 2,16,233 హెక్టార్లలో ఆహారేతర పంటలను ప్రోత్సహిస్తున్నారు.
* కొబ్బరి ఉత్పత్తిలో రాష్ట్రంలో ఖమ్మంలో జిల్లా మొదటిస్థానంలో ఉంది.

### 64.81 శాతం అక్షరాస్యత

* 2011 జనాభా ప్రకారం ఈ జిల్లా మొత్తం జనాభా 27,97,370. అయితే రాష్ట్రంలో అత్యధికంగా జనాభా కలిగిన జిల్లా రంగారెడ్డి (52,96,741), అత్యల్ప జనాభా కలిగినది నిజామాబాద్ జిల్లా (25,51,335). ఈ జిల్లాలో మొత్తం గ్రామాలు 1,223గా నమోదవ్వగా, పట్టణాల సంఖ్య 14గా ఉన్నది. జనసాంద్రత ఈ జిల్లాలో ప్రతి చ.కి.మీ. 175గా ఉంది. అతి తక్కువ జనసాంద్రత కలిగిన జిల్లాలో ఖమ్మం రెండో స్థానంలో ఉన్నది.
* రాష్ట్రంలో ఎస్టీ జనాభా అత్యధికంగా ఉన్న జిల్లాగా ఖమ్మం పేరొందింది. జిల్లాలో మొత్తం ఎస్టీ జనాభా 7,65,565గా నమోదయింది.

### ప్రజారోగ్యం

* ఈ జిల్లాలోని మొత్తం ప్రైమరీ హెల్త్ సెంటర్స్ 69గా నమోదయ్యాయి.

# బొగ్గును అధికంగా ఉత్పత్తి చేస్తున్న జిల్లా

## ఖమ్మం జిల్లా

మొత్తం 433 హెక్టార్లలో కొబ్బరిని సాగుచేస్తూ 7,247 టన్నులు ఉత్పత్తి చేస్తున్నది.

* మిరప పంటలను అత్యధికంగా ప్రోత్సహిస్తున్న జిల్లా ఇది. 38,494 హెక్టార్లలో పంటను పండిస్తూ 1,37,245 టన్నుల మిర్చిని ఉత్పత్తి చేస్తూ రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంది.
* రాష్ట్రంలోనే అత్యధికంగా మామిడిపండ్లను సాగు చేస్తున్న జిల్లా ఖమ్మం. 25,931 హెక్టార్లలో 1,16,404 టన్నుల మామిడిపండ్లను అత్యధికంగా పండిస్తున్న జిల్లాగా పేరుగాంచింది. జిల్లాలో మొత్తం 838 హెక్టార్లలో 28,750 టన్నుల అరటిపండ్లను ఉత్పత్తి చేస్తున్నది.
* తెలంగాణలో అత్యధికంగా పొగాకు పండిస్తున్న జిల్లా ఇది. 1,966 హెక్టార్లలో 6542 టన్నులు ఉత్పత్తి చేస్తుంది. ఇందులో అతి మేలు రకపు వర్జీనియా పొగాకు ప్రసిద్ధి చెందినది.
* కందులు, పెసలు, శనగల ఉత్పత్తిలో ఈ జిల్లా చివరి స్థానంలో ఉంది.
* వ్యవసాయ ఉత్పాదకతల వారీగా చూస్తే ఒక హెక్టార్‌కు 5500 కి.గ్రా. మొక్కజొన్నను ఉత్పత్తి చేస్తున్నది. కాటన్‌ను కూడా ఒక హెక్టార్ 533 కి.గ్రా లు ఉత్పత్తి చేస్తోంది. ఇవి రెండు రాష్ట్రంలో అత్యధిక ఉత్పాదక కలిగినవి.

జననాల రేటు ఈ జిల్లాలో 17.5గా, మాతృమరణాలు (ఎంఎంఆర్) 144గా, శిశుమరణాలు 53గా నమోదయింది. రాష్ట్రంలో అత్యధిక జననాల రేటు కలిగిన జిల్లా ఆదిలాబాద్, అత్యధిక ఐఎంఆర్ నమోదైన జిల్లా మహబూబ్‌నగర్.

### వాతావరణం

* నైరుతి రుతుపవనాల వల్ల ఈ జిల్లాలో 890 మి.మీల వర్షపాతం కురుస్తుంది. అయితే రాష్ట్రంలో అత్యధికంగా నైరుతి రుతుపవనాల వల్ల వర్షం కురుస్తున్న జిల్లా అదిలాబాద్ (984.1 మి.మీ). ఈశాన్య రుతుపవనాల వలన ఈ జిల్లాలో 130.3 మి.మీల వర్షపాతం కురుస్తున్నది.

### పరిశ్రమలు

* **కొత్తగూడెం థర్మల్ పవర్‌స్టేషన్:** దీనిని 1963లో పాల్వంచలో నెలకొల్పారు. ఇందులో మొత్తం 11 యూనిట్లు ఉన్నాయి. ఇది 1720 మె.వా. విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనికి కావలసిన బొగ్గును సింగరేణి కాలరీస్ నుంచి, నీటిని కిన్నెరసాని నది నుంచి తరలిస్తున్నారు.



* హెవీ వాటర్ ప్లాంట్ మణుగూరు: ఇది భారజలం (డ్యుటేరియం ఆక్సైడ్‌ను) ఉత్పత్తి చేస్తుంది. దీనిని న్యూక్లియర్ రియాక్టర్‌లలో మితకారిగా వాడుతారు. ఇది దేశంలో ఉన్న ఏకైక భారజల కేంద్రం.
* ఐటీసీ వారు 1982 జిల్లాలోని సారపాక ప్రాంతంలో భద్రాచలం పేపర్ బోర్డ్ లిమిటెడ్‌ను స్థాపించారు.
* కారెపల్లి మండలంలో డోలమైట్ గనులు ఉన్నాయి.
* దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద స్పాంజి ఐరన్ పరిశ్రమ పాల్వంచలో ఉంది. వీటితో పాటు నవభారత్ ఫెర్రో అల్లోస్ లిమిటెడ్ - పాల్వంచ. టిజి ట్రైబల్ పవర్ కంపెని లిమిటెడ్ - పొల్లూరు వంటి పరిశ్రమలు ఉన్నాయి.

## బొగ్గు

* రాష్ట్రంలో బొగ్గును అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న జిల్లా ఖమ్మం.
* జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు ప్రాంతాలు బొగ్గు గనులకు ప్రసిద్ధి చెందినవి. కొత్తగూడెం మండలంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌ను 1920 లో స్థాపించారు. ఇందులో తెలంగాణ ప్రభుత్వం వాటా 51 శాతం, కేంద్ర ప్రభుత్వం వాటా 49 శాతం.
* దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ఏకైక బొగ్గు గని ఇది.



## ఇరిగేషన్

* జిల్లాలో నికరంగా మొత్తం 1,79,768 హెక్టార్ల భూమి సాగు అవుతున్నది. ఇందులో చెరువుల ద్వారా 44,217 హెక్టార్లు, కాలువల ద్వారా 27,062 హెక్టార్లు, గొట్టపు బావుల ద్వారా 55,468 హెక్టార్లు, దిగుడు బావుల ద్వారా 38,581 హెక్టార్ల భూమి సాగు చేయబడుతుంది. శాతాల వారీగా చూస్తే చెరువుల ద్వారా 24.59 శాతం. కాలువల ద్వారా 15.05 శాతం, దిగుడు బావుల ద్వారా 21,46 శాతం, గొట్టపు బావుల ద్వారా 30.85 శాతం సాగు అవుతున్నది.

## అత్యధిక అడవులు

* జిల్లాలో 8,436.94 కి.మీ. చొప్పున అడవి విస్తరించి ఉంది. దాదాపుగా ఇది 52.64 శాతంతో రాష్ట్రంలో అత్యధిక అడవులను కలిగిన జిల్లాగా నమోదైంది. ఇక్కడ యూకలిప్టస్, అకేషియా వంటి చెట్లు లభిస్తాయి. వీటితోపాటు పేపర్‌కు కావాల్సిన కలపకు ఉపయోగించే వృక్షాలు కూడా ఉన్నాయి.
* ఖమ్మం జిల్లా పాల్వంచలో కిన్నెరసాని వైల్డ్ లైఫ్ సాంచరీఉంది. ఇది జింకలకు ప్రసిద్ధి చెందినది.

## ప్రాజెక్టులు

* దుమ్ముగూడెం ప్రాజెక్ట్ : దీనిని గోదావరి నదిపై దుమ్ముగూడెం గ్రామం వద్ద నిర్మించారు. ఈ ప్రాజెక్టుకు మరొక పేరు 'రాజీవ్ సాగర్ ప్రాజెక్ట్'. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం దీని రూపురేఖలు మార్చాలని భావిస్తోంది.



* కిన్నెరసాని ప్రాజెక్ట్ : ఇది కిన్నెరసానిలో ఉన్నది. ఈ నది గోదావరిలో కలుస్తుంది. పాల్వంచ నుంచి 20 కి.మీ. దూరంలో ఈ ప్రాజెక్టును నిర్మించారు. దీని నుంచి కొత్తగూడెం థర్మల్ పవర్‌ప్లాంట్‌కు నీరు అందిస్తున్నారు.
* వైరా ప్రాజెక్ట్ : ఇది వైరా మండలంలో ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 15,000 ఎకరాలకు సాగు నీరు అందుతోంది.
* లంకసాగర్ ప్రాజెక్టు : ఈ ప్రాజెక్టును కట్టెలేరు నదిపై నిర్మించారు. ఇది పెనుబల్లి మండలం అడవిమల్ల గ్రామంలో ఉన్నది.
* ముకమామిడి ప్రాజెక్టు : ఇది పాములేరు నదిపై, ముక్కమామిడి గ్రామం ముల్కలపల్లి వద్ద ఉన్నది.
* పెదవాగు ప్రాజెక్ట్ : ఇది నీటి రిజర్వాయర్. దీనిని పెదవాగు నదిపై అశ్వరావుపేట మండలంలో నిర్మించారు.

## నదులు

* గోదావరి, కిన్నెరసాని, శబరి, పెద్దవాగు, మున్నేరు, వైరా నదులు.

## దర్శనీయ ప్రదేశాలు

* భద్రాచలంలో సీతారామస్వామి దేవాలయం



* ఖమ్మం జిల్లా: దీనిని కాకతీయుల కాలంలో నిర్మించారు. ఇది స్తంబాంద్రి కొండపై ఉంది.
* కిన్నెరసాని వైల్డ్ లైఫ్ సాంచరీ. ఇది 635.4 చ.కి.మీ విస్తరించింది. ఇది పాల్వంచ నుంచి 20 కి.మీ దూరంలో ఉంది.
* కల్లూరు: ఇక్కడ రెండు దేవాలయాలు ఉన్నాయి. అవి వేణుగోపాల స్వామి ఆలయం, శివాలయం. వీటితోపాటు లకారం సరస్సు, నేల కొండపల్లి వంటి దర్శనీయ ప్రదేశాలు ఉన్నాయి.

– ఐ&పిఆర్



# స్కూళ్లల్లో సన్న బియ్యము - పేద పిల్లల పాలిట వరం

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి, బంగారు తెలంగాణ సాధనే ధ్యేయంగా వడివడిగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాలల, వసతి గృహాల విద్యార్థులకు 2015 జనవరి 1 నుంచి సన్నబియ్యం సరఫరా చేస్తూ అమలు చేస్తోంది. సంపన్నుల పిల్లలకు ధీటుగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమం పట్ల నిబద్ధతకు అద్దం పడుతోంది.**

ప్రాథమిక విద్యావ్యాప్తి ధ్యేయంగా ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం సరఫరా చేయడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతన రాష్ట్రంలో అసాధారణ నిర్ణయాలతో సంక్షేమం పట్ల కనబరుస్తున్న శ్రద్ధకు మునుపటి ప్రభుత్వాల పరిపాలన కంటే విభిన్న రీతిలో ముందుకు వెళుతుండడంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రాథమిక విద్యను విస్తృతం చేయడమే లక్ష్యంగా ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకంలోని లోపాలను అధిగమించి వ్యాపింపచేయడానికి సన్న బియ్యం అమలును ప్రభుత్వం చేపట్టింది. అణగారిన వర్గాల పిల్లలకు సరైన ఆహారం లేక విద్యకు దూరమవుతున్నారని అనడంలో ఎలాంటి సందేహంలేదు. మునుపటి ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణిని విడనాడి తెలంగాణ ప్రభుత్వంలో నూతన ఉత్సాహం ఉరకలెత్తుతోంది.

రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ప్రభుత్వ యాజమాన్యం కింద 4,494 పనిచేస్తుండగా, 6,06,499 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. జిల్లా పరిషత్, మండలపరిషత్ యాజమాన్యాల క్రింద 24,706 పాఠశాలలు పనిచేస్తుండగా 23,65,810 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సుమారుగా 30 వేల పాఠశాలల్లో 30 లక్షల మంది విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్నభోజనాన్ని కల్పిస్తోంది. ఒకటి నుంచి అయిదవ తరగతుల విద్యార్థులకు ఒక్కొంటికి రోజుకు 100 గ్రాములు, ఆరు నుంచి పదో తరగతి వరకు గల విద్యార్థులకు ఒక్కొంటికి 150 గ్రాముల చొప్పున మొత్తం 3,715.39 క్వింటాళ్ళ బియ్యాన్ని రోజుకు ప్రభుత్వం పథకానికి కేటాయిస్తోంది.

మధ్యాహ్నభోజనానికే కాకుండా రాష్ట్రంలోని సుమారు 2 వేల విద్యార్థుల వసతి గృహములకు కూడా సన్నబియాన్ని సరఫరా చేస్తూ, మూడుపూటలా సన్నబియ్యంతో భోజనాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం2015-16 బడ్జెట్‌లో ఆహారభద్రత, ఆహార సబ్సిడీ కోసం 2,200 కోట్లు కేటాయించడం జరిగింది. ఇలా ఆహారభద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నది ప్రభుత్వం.

ప్రభుత్వము చిత్తశుద్ధి, అంకితభావం పట్ల ఎలాంటి సందేహాలు లేవు. కానీ ఆశించిన ఫలితాలు రాబట్టాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ప్రాథమిక విద్యను ఉచిత నిర్బంధ హక్కుగా అందరికీ సమానంగా అందించాలంటే పాఠశాలల్లో ఇలాంటి సామాజిక భద్రతా చర్యలు తీసుకోవడం అవసరం.

సంక్షేమ ఫలాలు అందరికీ చేరాలంటే సన్నబియ్యము సరఫరాతో పాటు పథకం సక్రమ నిర్వహణకు గాను అవసరమయ్యే రక్షిత మంచినీరు, వంటగది లాంటి సౌకర్యాలు కల్పించి ఆహార పంపిణీలో శుచి, శుభ్రత

# పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు

**రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రచించాలని, ప్రపంచ పర్యాటక చిత్రపటంలో తెలంగాణ చారిత్రక ప్రదేశాలకు ప్రత్యేక స్థానం లభించే విధంగా టూరిజం కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్‌రావు అధికారుల ను ఆదేశించారు.**

ప్రతి జిల్లాలోని పర్యాటక ప్రాంత విశిష్టతలను ఆయన అధికారులకు తెలియజేసి వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పర్యాటక రంగాన్ని ఆయన సమీక్షించారు. యాత్రీ నివాస్, హుస్సేన్‌సాగర్‌బోటింగా, నాగార్జునసాగర్ పర్యాటక విశేషాలు, బోటింగ్, గోల్కొండ కోట, కాకతీయ కోటలలో నడుస్తున్న సౌండ్ అండ్ లైట్‌షో, పర్యాటక భవన్, భువనగిరి దుర్గంలో జరుగుతున్న పనులు, శిల్పారామంలో జరుగుతున్న కార్యాచరణ వంటి అనేక అంశాలను ఆయన ప్రస్తావించి అధికారుల నుంచి సమాచారాన్ని రాబట్టారు.

కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలో శిల్పారామం తరహాలో అర్బన్‌హాట్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాల్సిందిగా ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ హయాంలోనే కోరినప్పటికీ సీమాంధ్ర అధికారులు మొత్తం సీమాంధ్ర ప్రాంతంలోనే వీటిని నిర్మించే విధంగా ప్రతిపాదనలు చేశారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఈ క్రమంలోనే వరంగల్, మెదక్ జిల్లాల్లో అర్బన్‌హాట్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినటప్పటికీ అవి ముందుకు కదలలేదని తెలిపారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పేర్వారం రాములు, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ బీపీ ఆచార్య, మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టియానా, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి.కిషన్ రావు, టూరిజం శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. అధికారులు టూరిజం అభివృద్ధికోసం చేస్తున్న కృషిని వివరించారు. పర్యాటక భవన్‌లో దేశంలోని 29 రాష్ట్రాల టూరిజం ప్రదేశాల వివరాలన్నీ లభించేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వరంగల్ కాకతీయ ఫోర్ట్, వేయి స్తంభాల గుడి, రామప్ప, లక్నవరం తదితర చారిత్రక ప్రదేశాల అభివృద్ధిపైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్కియాలజీ ఆఫ్ ఇండియా, కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల సమన్వయంతో పనిచేయాలని, కేంద్ర అధికారులు చెప్పిన పద్ధతుల్లో, మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతిపాదనల ను సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు.

యాదాద్రి, కొలనుపాక, భువనగిరిలతో కలిపి ఒక సర్క్యూట్‌ను ఏర్పరచాలని ఆదేశించారు. ప్రతిజిల్లాలో ఆదాయ వనరులను పెంచే మార్గాల ను అన్వేషించాలని, టూరిజం సర్క్యూట్లను ఏర్పాటు చేయాలని, గైడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. టూరిజం భూములు అన్యాక్రాంతమైనా ఆ వివరాలను ప్రభుత్వానికి వెంటనే తెలియచేయాలన్నారు. ◆

పాటించి సక్రమంగా తగిన పోషకాహారం లభించే విధంగా ప్రభుత్వం తగు కేటాయింపులు చేస్తూ, పర్యవేక్షించాలి.

ప్రాథమిక తరగతి పిల్లలకు 450 కెలోరీలు, 12 గ్రాముల ప్రోటీన్‌లు, అప్పర్ ప్రైమరీ స్థాయి విద్యార్థులకు 700 కెలోరీలు, 20 గ్రాముల మాంసకృత్తులు గల పౌష్టికాహారం అందేలా తగిన ఏర్పాట్లు చేయాలి. సన్నబియ్యానికి మార్కెట్లో ఉన్నటువంటి డిమాండ్ దృష్ట్యా పక్కదారి పట్టే అవకాశం లేకుండా తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఆహారపదార్థాల ను నిల్వ చేయటానికి తగిన సౌకర్యం చేపట్టాలి.

రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో



పథకం చేపట్టడం జరుగుతున్నది. వంటచేసే సిబ్బంది, సహాయకులు తగిన పరిశుభ్రత పాటించేలా తగిన అవగాహన కల్పించాలి. వారికి ప్రభుత్వం చెల్లించాల్సిన నిర్వహణ ఖర్చులను నెలనెలా సత్వరమే అందేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇలా ప్రభుత్వం సన్నబియ్యంతో పాటు సక్రమంగా పథకం అమలు అయ్యేలా తగు చర్యలు చేపడితే తప్పనిసరిగా బడికి రాని పిల్లల సంఖ్య తగ్గుతుంది. బడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్యాహక్కు కల్పించడంతోపాటు ఆహారభద్రత కూడా కల్పించడం జరుగుతుంది.

నూతన తెలంగాణ రాష్ట్రంలో సన్నబియ్యం అమలు ద్వారా విద్యాహక్కు అమలు, ఆహార భద్రత కల్పించడంలో సఫలమవుతుంది. ఆశయానికి, ఆచరణకు మధ్య గల లోపాలను నిరంతరం సమీక్షిస్తూ ముందుకుపోయేలా తగు సూచనలు, సలహాలు ఇస్తూ నియంత్రణ చర్యలు అత్యంత ఆవశ్యకం. లేకపోతే దీపం క్రిందనే వెలుతురు ఉన్నట్లు పథకం ఆశయం మసకబారి పోయే ప్రమాదం పొంచి ఉంటుంది.

సన్నబియ్యం అమలు ద్వారా తెలంగాణ ప్రభుత్వం బంగారు తెలంగాణ ఆవిష్కరణలో భాగమవుతూ బడుగు, బలహీన వర్గాల పిల్లలకు భరోసానిస్తూ విద్యావ్యాప్తికి తోడ్పడుతూ వారి సంక్షేమానికి బాటలు వేస్తూ తెలంగాణ వస్తే ఏమొస్తుంది అని విమర్శించిన వారికి చెప్పకనే చెపుతూ భద్రతకు, భావి జీవితాలకు బంగారుబాటలు వేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

*– ఎ. శ్యామ్ కుమార్, ఫ్రీలాన్సర్, వరంగల్ జిల్లా*

**ఒక వ్యక్తిని, వ్యక్తుల సమూహాన్ని ఒక నిర్దేశిత లక్ష్యం వైపు సమిష్టిగా తీసుకు వెళ్ళగల వాడే నాయకుడు, నాయకురాలు. నిర్దేశిత లక్ష్యంవైపు తీసుకు వెళ్ళాలనే ఆలోచన రావడమే నాయకత్వానికి పునాది.**

నాయకులు పుట్టరు, నాయకులు తయారవుతారు. ఇంకా చెప్పాలంటే సమాజం వారిని తయారు చేస్తుంది. నాయకుడంటే సమాజాన్ని నడిపించేవాడు.

గ్రామంలో సమస్య ఉన్నప్పుడు ప్రజలను సమీకరించి సమస్య లోతుపాతుల గురించి క్షుణ్ణంగా చర్చించి, పరిష్కార మార్గాన్ని వెతకాలి. ఈ పరిష్కార మార్గం అందరికీ ఆమోదయోగ్యమైనదిగా ఉండాలి. ఈ విధంగా మార్గనిర్దేశకత్వం చేసినప్పుడు సమస్య పరిష్కారం కాగలదనే నమ్మకం ప్రజలకు కలుగజేసేవారే నాయకులు. వెంటనే ప్రతిస్పందించక విషయాన్ని గమనించి, అర్థం చేసుకొని, విశ్లేషించి, నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తారో, వారినే నాయకులు అనవచ్చు. ఎందుకనగా వారు కొంత ఆకర్షణీయమైన, అధికారయుతమైన గుణాలను కలిగి ఉంటారు.

ఇతరులు చెప్పే విషయాలను ఓపికగా, శ్రద్ధగా విని పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోయే సామర్థ్యం నాయకుని ఉండాలి.

# మార్గనిర్ధేశకుడు

❋ సమిష్టి లక్ష్యాలను సాధించడానికి తమ తోటి వారిని ప్రభావితం చేయగలిగి ముందుండి నడిపించగల సామర్థ్యాన్ని కలిగి ఉండడమే నాయకత్వం.

❋ నాయకుడు కలలు కనే ప్రపంచంలోనికి ఇతరులను తీసుకొని రాగలగాలి.

❋ శ్రోతగా ఉండాలి.

❋ ఇతరులు చెప్పే విషయాన్ని ఆసక్తిగా వినటం, విన్నదాన్ని ఒక క్రమంలో కూర్చి, ఇతరులకు చెప్పగలగాలి.

❋ గొప్ప లక్ష్యం కోసం వీరి అవసరాలను త్యాగం చేయాలి.

❋ ప్రజలకు దగ్గరగా ఉండి వారికి ఏం కావాలి, ఎందుకు కావాలో తెలుసుకోవాలి.

❋ నిజాయితీగా ఉండి సమాజం కోసం పనిచేయాలి.

❋ తపన, క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధత కలిగి ఉండాలి.

❋ ఇతరులకు సహాయం చేయడం, ధైర్య, సాహసాలు కలిగి ఉండడం, సర్దుబాటు, స్థిరమైన మనస్తత్వం ఉండాలి.

❋ నిరంకుశ వాది తాను అనుకున్నదే చేయాలనుకుంటారు. స్వంతంగా నిర్ణయాలు తీసుకుంటారు. మంచి, చెడులను చూడకుండా పనుల జరగడంపైనే దృష్టి కేంద్రీకరిస్తారు.

❋ ఉదారవాది బాధ్యతలను ఇతరులకు అప్పగించి తాను తప్పుకుంటారు. వారికి స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఇస్తారు. పర్యవేక్షణలో ముందుండి మార్గదర్శకత్వం వహిస్తారు.

❋ ఉద్యోగస్వామ్యవాది నిబంధనలకు లోబడి పని చేస్తానంటారు.

❋ ప్రజాస్వామ్యవాది అందరితో సత్సంబంధాలను కలిగి ఉంటారు. అందరితో కలిసి నిర్ణయాలు తీసుకుంటారు. ప్రజల సంక్షేమం పైనే దృష్టి కేంద్రీకరిస్తారు. బృందాన్ని నడపడంలో సామర్థ్యాన్ని కలిగి ఉంటారు.

❋ పంచాయతీరాజ్ ప్రజా ప్రతినిధులు ప్రజాస్వామ్య వాదులై ఉంటే ఎక్కువ ఫలితాలు సాధిస్తారు.

## నైతిక విలువలు

❋ నైతికతకు, విలువలకు సామీప్యం ఉన్నటు కనిపిస్తున్నా రెండూ వేరు.

❋ మనిషి నడవడికను గురించి, సమాజంలో పాటించాల్సిన పద్ధతుల గురించి తెలియజేసేది నైతికత.

❋ నీతి శాస్త్రం బోధిస్తున్న పద్ధతులను వ్యక్తులు ఆచరించడం నైతిక విలువలుగా పేర్కొనవచ్చు.

❋ పరోపకార భావన.

❋ స్వార్థం లేని త్యాగ లక్షణం.

❋ ఇతరులకు మేలు చేయడం.

❋ ఇతరులను ప్రేమించడం.

వీటిని మన జీవితాలకు అన్వయించుకొని పాటించడమే నైతిక విలువలను కలిగి ఉండడం. నిస్వార్థంగా ఉండడం, తోటి వారి ఈతి బాధలను తనవిగా భావించి సేవ చేయడం నైతిక విలువలకు పునాది వంటివి. మనిషి నీతివంతునిగా, పవిత్రునిగా ఉండడానికి చేసే ప్రతి పని నైతికమే.

ప్రతి వ్యక్తీ అవినీతి, హింస, అనైతికత, చెడు చర్యలను చూసి నిట్టూర్పు విడిచేవారే. మనమూ ఆ పరిధిలోనే ఉన్నాం. అందుకు మన విధి నిర్వహణలో భాగంగా మన పరిధిలో జరిగే అనేక ప్రజా సంక్షేమ, పాలనా కార్యక్రమాలలో నైతిక విలువలను పాటించడం ద్వారా మనం భావితరాలకు అందించేందుకు మంచి వ్యవస్థను రూపొందించవచ్చు. అయితే ఈ వ్యవస్థను మార్చడం, మంచిగా తీర్చిదిద్దడం అనేది నా ఒక్కరి వల్ల ఎలా సాధ్యం అనేది మనలోని చాలా మందికి వచ్చే సత్వర సందేహం. దీనికి ఒకటే సమాధానం. ప్రతి సుదీర్ఘ ప్రయాణం ఒక అడుగుతోనే మొదలవుతుంది. ప్రతి పెద్ద నిర్మాణం ఒక ఇటుకతోనే ప్రారంభం అవుతుంది. ఈ వాస్తవాన్ని గుర్తించి ప్రతివారు తమ విధి నిర్వహణలో నైతిక విలువలను పాటించి, భవిష్యత్ భారతాన్ని నిర్మిద్దాం.

మనిషి వ్యక్తిత్వాన్ని, శీలాన్ని తీర్చిదిద్దేది ఆలోచన. మన ఆలోచనల సారమే మనం. ప్రతి విషయాన్ని (భరించలేని పరిస్థితులను కూడా) సానుకూలంగా తీసుకోవడం అలవాటు చేసుకోండి. ప్రతికూలంగా ఆలోచిస్తే మెదడు బలహీనపడుతుంది. విశ్రాంతి కోల్పోతుంది. అన్నింటికి ఆందోళన చెందుతుంది. ప్రతికూల పరిస్థితులు ఎదురయినప్పుడల్లా, ముందు మనసును ప్రశాతంగా ఉంచుకోవాలి. ఎలాగంటారా ఎవరైనా మిమ్మల్ని కోపంతో దూషించారనుకోండి. వెంటనే అతని మీద ఆగ్రహం పెంచుకోవద్దు. సానుకూలత అలవర్చుకుంటే దాని వల్ల మీకే కాదు, మీ తోటి ప్రజలతోను మీ సంబంధం బాంధ్యవ్యాలను మెరుగు చేసుకోవచ్చు. సంయమనంతో పనులు పూర్తిచేసుకోవడం అలవాటు చేసుకోండి.

ఉదా: మన విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు ఎన్నో విషయాలపై నాయకుల్ని నిలదీసే హక్కు ఉంది. ఆ సందర్భంలో మన ముందుకు వచ్చిన అంశం తాలూకు నిజ నిజాలు గమనించాలి. ఎలా దానిని పరిష్కరించగల

మో యోచించండి. సాధ్యసాధ్యాలు, సాధకబాధకాలు వారితో చర్చించాలి. ప్రజల భాగస్వామ్యంతో సమస్యల నుండి సులభంగా బయటపడవచ్చు.

## సమన్వయం

గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఎంపిపిటిసి సభ్యులతో కూడినది. కాబట్టి గ్రామ పంచాయతీ స్థాయిలో సర్పంచ్, వార్డు సభ్యులు, ఎం.పి.టి.సి. సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఇతర గ్రామస్థాయి ఉద్యోగులతో సఖ్యతగా ఉండి సమన్వయంతో పని చేయాలి. అలాంటప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుంది.

పంచాయతీకి, ప్రభుత్వ శాఖలకు మధ్య విభేదాలు, అపార్థాలు ఉంటే వాటి ప్రభావం ప్రభుత్వ పథకాల అమలుపై ఉంటుంది. ఇరువర్గాల భేషజాలకు పోవడం వలన చివరకు నష్టపోయేది ప్రజానీకమే. ఈ కారణంగా ప్రజలు విసిగిపోయి ఆయా కార్యక్రమాల్లో భాగస్వాములు కారు. ఈ సమన్వయం లోపం వలన ఆశించిన లక్ష్యం నెరవేరదు.

దీని కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు పరస్పర అవగాహనా సమన్వయంతో పని చేయాలి. అందరూ కలసి అభివృద్ధికి ఆలోచించాలి. ఆయా ప్రాంతాల్లోని ప్రజలతో చర్చించి సమస్యలను తెలుసుకొని ప్రధాన్యతా క్రమంలో అందుబాటులో ఉన్న వనరుల మేరకు అనుసంధానం చేయాలి.

- ప్రతి శాఖ, సంస్థలకు కార్యక్రమాలు, వనరుల గురించి పూర్తి అవగాహన ఉండాలి.
- పథకాలు, కార్యక్రమాలు, మార్గదర్శక సూత్రాలను తెలుసుకోవాలి.
- ప్రజల అవసరాలను గుర్తించి వారి భాగస్వామ్యంతో ప్రాధాన్యతా క్రమంలో వాటిని అమలు చేయాలి.
- గ్రామంలోని ఇతర ప్రజా ప్రతినిధుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి.
- ప్రజలలో ఉన్న రాజకీయ, వర్గ వైషమ్యాలకు తావు లేకుండా అందరినీ కలుపుకుపోవాలి.
- ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పని చేయమని అధికారుల మీద ఒత్తిడి చేయకుండా, అలాగే అధికారులు అనవసరపు కొర్రీలతో కాలయాపన చేయకుండా ఇరువు సమన్వయంతో పని చేయాలి.

ఒకరి భావాన్ని లేదా సమాచారాన్ని వేరొకరి ముందు వ్యక్తపరచడాన్ని భావ వ్యక్తీకరణ అంటారు. ఈ భావ వ్యక్తీకరణ అందరికీ అవసరం. ప్రధాన ఉద్దేశాలు ఏమంటే:

- సమాచారాన్ని ఇవ్వడం
- అనుకున్న లక్ష్యాలను సాధించడం
- సమస్యల పరిష్కారానికి కృషిచేయడం
- ప్రజలలో ఆలోచనా స్థాయి, అవగాహన పెంచడం
- ప్రజలను సంఘటితపరచడం

భావ వ్యక్తీకరణ ఎలా ఉండాలంటే, నోటి మాట ద్వారా / వ్రాతపూర్వకంగా / సంజ్ఞల ద్వారా లేదా హావాభావాల ద్వారా, అందరికీ అర్థమయ్యే భాషలో, చెప్పదల్చుకున్న సమాచారాన్ని స్పష్టంగా, సూటిగా ఉదాహరణలతో సహా చెప్పాలి. ప్రజలు చెప్పేది శ్రద్ధగా, ఓపిగ్గా వింటూ, వాదులాటకు, వివాదాలకు తావు ఇవ్వరాదు.

## ప్రజల భాగస్వామ్యం

వ్యక్తుల సముదాయాన్నే సమాజం అంటారు. మనం చేపట్టే పనులో ఈ సమాజంలో నివశించే ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఏ అభివృద్ధి అయినా సాధ్యపడుతుంది. ప్రస్తుతం అభివృద్ధి పథాన విజయవంతంగా నడుస్తున్న స్వయంసహాయక సంఘాల పురోగతి ప్రజా భాగస్వామ్యానికి చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చాలా పథకాలు ప్రవేశపెట్టినా, అవి విజయవంతం కాకపోడానికి ప్రధాన కారణం ఆయా కార్యక్రమాలలో ప్రజలను భాగస్వాములను చేయకపోవడమే. ప్రజలకు మేలు చేయాలని ఎన్ని మంచి పనులు చేసినప్పటికీ ఆ పనుల వల్ల తమకు ఏం ప్రయోజనం అన్న విషయం ప్రజలకు అర్థం కాకపోవడం వలన సహకారం లభించక ఆ పనులు విజయవంతం కావడం లేదు.

అందుకే ఆ కార్యక్రమాలలో వారిని భాగస్వాములను చేయాలి. ఉదాహరణకు గ్రామాలలోని పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో పాటు గ్రామ పెద్దల సహకారం కూడా తీసుకోవాలి. అలాంటప్పుడే ఆ పాఠశాల అభివృద్ధి జరిగిన విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోంది. అలాగే అభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు గ్రామ సభను వేదికగా చేసుకొని ప్రజలందరి అభిప్రాయం మేరకు పనులు చేపడితే గ్రామాభివృద్ధితో పాటు ఆ నాయకుడి ఎడల ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది.

నాయకులు కాదలచిన వారు పనులు చేపట్టడంలో నిర్ణయాధికార సామర్థ్యం కలిగి ఉండాలి. దానికి తెలివితేటలతో పాటు, గుండె ధైర్యం కూడా ఉండాలి. ప్రతి సమస్యను సహేతుకంగా పరిశీలించే శక్తిని కలిగి యుండాలి. దానినే కార్యసాధక వ్యూహం అంటారు. తన అనుభవాలను క్రోడీకరించుకొని సమస్యల పరిష్కారానికి నిర్ణయాలను తీసుకోగలగాలి. తనకున్న ప్రతిభా సామర్థ్యాలతో సహేతుకమైన నిర్ణయాలను తీసుకోగలగాలి.

తాను తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉండాలి. ఏ విధమైన బాహ్య ఒత్తిళ్ళకు లొంగి నిర్ణయాలను మార్చుకోకూడదు. బాధ్యతలను విస్మరించకూడదు గురుతరమైన బాధ్యతలను స్వీకరించటమే కాక, ఎదుటివారి భావాలను ఆదరించగలిగి ఉండాలి. వారి అభిప్రాయాలను వినాలి. మహిళలు ముఖ్యంగా నిర్ణయాధికారాన్ని కలిగి ఉండాలి. తన కుటుంబ సభ్యులు చూసుకుంటారన్న నిర్లిప్త భావనను విడిచి పెట్టి ప్రజలకు మేలు కలుగజేసే పనులు చేపట్టడంలో నిర్ణయం తీసుకోవాలి. కుటుంబసభ్యుల గౌరవాన్ని నిలబెడుతూనే, సమస్యల పరిష్కారంలో సొంత నిర్ణయం తీసుకోగలగాలి. సాటి మహిళల సమస్యలను తనవిగా భావించి పరిష్కారానికి కృషి చేయాలి.

మొదట సత్వరమే పరిష్కరించాల్సిన సమస్యలు, నెమ్మదిగా పరిష్కరించాల్సిన సమస్యలు విడదీయాలి. తక్షణ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాలి. వాటిలో ముందుగా మీరు వ్యక్తిగా చేయగలిగవి, కొంచెం సహాయంతో చేయగలిగేవి ముందు చేయాలి. ప్రజల సాయంతో చేయగలిగే పనులను చర్చకు పెట్టాలి. అందరూ కలిసి జాగ్రత్తగా ఓ నిర్ణయానికి రావాలి. అందుబాటులో ఉన్న నిధుల మేరకు ప్రణాళిక రూపొందించి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. మనం ఆశించిన లక్ష్యాన్ని ఎంత మేరకు చేరుకోగలిగామో అన్న విషయాన్ని సమీక్షించుకోవాలి. అపజయాలకు కృంగిపోకుండా, అందుకు గల కారణాలను విశ్లేషించి, విజయాలను సాధించాలి.

– సిపార్డ్

## 'భూసార పరీక్ష' అవశ్యకతను వివరించండి?

మనిషికి ఆహారం అవసరమైనట్లే మొక్కకు కూడా ఆహారం కావాలి. మొక్కలు ఆహారాన్ని పోషకాలు రూపంలో తీసుకుంటాయి. మొక్క ఆరోగ్యంగా పెరగడానికి ప్రత్యుత్పత్తికి 18 పోషకాలు అవసరం. వీటిలో నత్రజని, భాస్వరం, పోటాష్ ముఖ్యపోషకాలు గాను, కాల్షియం, మెగ్నీషియం, గంధకం ఉప పోషకాలుగాను జింకు, రాగి, ఇనుము, మాంగనీసు, బోరాన్, మాలిబ్డినం సూక్ష్మపోషకాలుగాను మొక్కలకు వాటి అవసరాన్ని బట్టి విభజించారు.

రైతులు నిరంతరం పంటలు పండిస్తున్న కారణంగా క్రమంగా భూమి నుండి పోషకాలు త్వరితంగా ఖాళీ అవుతున్నాయి. వీటిని భర్తీ చేయడానికి మొక్కలకు లభ్యమయ్యే విధంగా పోషకాలను అందించాలి. ఇలా ఎంత మోతాదులో పోషకాలను అందించాలో తెలుసుకోడానికి 'భూసార పరీక్ష' ను చేయించాలి. రైతులు తమ నేలలో ఎంత పరిమాణంలో పోషకాలు ఉన్నాయో తెలుసుకొని వారు వేయదలచిన పైరును బట్టి ఇంకా ఎంత మోతాదులో పోషకాలను అందించాలో తెలుసుకోవచ్చును.

## సమతుల ఎరువుల వాడకం అంటే ఏమిటో తెలియజేయండి?

పైర్లకు కావలసిన ముఖ్యపోషకాలైన నత్రజని, భాస్వరం, పోటాష్‌ల ను ఆహారపు పంటలకు 4:2:1 నిష్పత్తిలో వాడమని సిఫారసు చేస్తుండగా మన రైతులు పోటాష్ సిఫారసు చేసిన దానికన్న తక్కువగాను, నత్రజని పోషకాన్ని సిఫారసు చేసిన దానికి 2 నుండి 2 1/2 రెట్ల అధికంగాను వాడుతున్నారు. దీనివల్ల పోషకాల సమతుల్యత దెబ్బ తింటుంది.

ఏ పూరుకు, ఏ పోషకం ఎంత పరిమాణంలో నేలకు అవసరమో తెలుసుకొని హెచ్చు తక్కువలు కాకుండా అందించడాన్ని పోషకాల సమతుల్యత అంటారు. దీనివల్ల విలువైన ఎరువులను పొదుపుగా వాడవచ్చును. ఖర్చు కూడా తగ్గుతుంది. ఆశించిన ఫలితం, నికరాదాయం తగ్గదు.

పోషకాల సమతుల్యత లోపించడం వల్ల ప్రత్యేకించి నత్రజని అధికంగా వాడడంవల్ల పైరు విపరీతంగా ఎదిగి పడిపోవడం, పూతకు ఆలస్యంగా రావడం, తాలుగింజలు అధికం కావడం, చీడపీడలకు సులభంగా గురి కావడం, దిగుబడి, నాణ్యత తగ్గిపోవడం, చివరికి రైతు నష్టపోవడం జరుగుతుంది.

# మట్టినమూనా సేకరించే విధానం, అవశ్యకత
# సాగునీటి నమూనా సేకరణ, ఫలితాల విశ్లేషణ

రైతులు తమ నేలను పరీక్ష చేయించడం వలన తమ భూమిలో ఉన్న పోషకాలు, పోషకాల లోపం, ఆమ్లల, క్షారస్థితి, చౌడు సమస్యలు ఉన్నట్లు అయితే తెలుస్తాయి. సిఫారసు మేరకు ఎరువులు వాడుట వలన ఎరువుల పై అనవసరపు ఖర్చు తగ్గుతుంది.

ఒకవేళ తమ భూమి సేద్యానికి అనుకూలంగా లేని పక్షంలో భూమిని ఎట్లా బాగు చేసుకోవాలి. అందుకుగాను ప్రత్యామ్నాయంగా ఏమేమి రసాయనాలు ఎంత వాడాలో భూసార పరీక్షల వలన తెల ుసుకోవచ్చును. భూసార పరీక్షల వల్ల మాత్రమే సమతుల ఎరువుల వాడకం సాధ్యపడుతుంది.



## ప్రతి జిల్లాలో పరీక్షలు ఎక్కడ చేస్తారు? రైతులు మట్టి నమూనాలు ఎలా పంపించవలసి ఉంటుంది?

ప్రతిజిల్లాలో 'సింగిల్ విండో డయాగ్నోస్టిక్ ల్యాబ్' ఉంది. ఇక్కడ భూసార పరీక్షలతోపాటు సాగునీరు పరీక్షలు, విత్తన పరీక్షలు, ఎరువుల నాణ్యత పరీక్షలు చేస్తారు. రైతులు వేసవి కాలంలో భూమిలో పంట ఉండదు కాబట్టి మట్టి నమూనా సేకరించడానికి ఇది అనువైన సమయం.

ఆ సమయంలో జరిగే రైతు చైతన్య యాత్రల్లో తమ గ్రామానికి వచ్చిన వ్యవసాయాధికారికి కాని, విస్తరణాధికారికి గాని తమ మట్టి నమూనాలకు అందజేయడం వలన తదుపరి వారు భూసార పరీక్షా కేంద్రానికి పంపి, ఫలితాలను కార్డు ద్వారా అందిస్తారు.

ఈ మధ్య కాలంలో ఫలితాలను అంతర్జాలంలో కూడా పెడుతున్నారు. రైతులు తమ మొబైల్ నెంబరు ఇచ్చినట్లయితే భూసార పరీక్షా ఫలితాల ను మెసెజ్‌ల ద్వారా కూడా అందజేయవచ్చు. ఒక్కోసారి లేటు అవుతుందనుకుంటే రైతులు నేరుగా తామే పరీక్షా కేంద్రానికి వెళ్ళి ప్రత్యేక రుసుం చెల్లించి త్వరితగతిన ఫలితాలను తెలుసుకోవచ్చును.

భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను ఏవిధంగా సేకరించాలి? మట్టి నమూనాలను తీసుకోనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయండి?

భూసార పరీక్షలకు మట్టి నమూనాల సేకరణ మొదటిదే కాకుండా

ముఖ్యమైన అంశం. సరైన నమూనా తీయడం ఈ కార్యక్రమ విజయానికి తొలిమెట్టు తీసిన మట్టి నమూనా పొలంలోని మట్టి లక్షణాలకు ప్రాతినిధ్యంగాను, ప్రతిబింబించేదిగాను ఉండాలి. సరైన పద్ధతిలో తగు జాగ్రత్తలతో తీసిన నమూనా నుండి వచ్చే ఫలితాలు యదార్థంగాను, లాభదాయకంగాను ఉంటాయి. పొలాలు ఖాళీగా ఉన్న సమయంలో ఎప్పుడైనా మట్టి నమూనాలను తీయవచ్చును.

సంవత్సరానికి ఒక పంట పండించే భూముల్లో ఫిబ్రవరి నుండి ఏప్రిల్ మధ్యకాలం, రెండు పంటలు పండించే భూముల్లో మే నెలల్లో నమూనాలు సేకరించడం అనువుగా ఉంటుంది. మట్టి నమూనా సేకరణకు లోహపు గొట్టం ఆకారం లాంటి సాధనాలు లేదా రైతులకు అందుబాటులో ఉండే పార, గడ్డ పలుగు సాయంతో మట్టి నమూనాలను తీయవచ్చును.

నేల రకం, రంగు, సాగునీటి వసతి, మెరక, పల్లం సేద్య పద్ధతులు పంట దిగుబడిలోని వ్యత్యాసం, ఆధారంగా వేర్వేరు నమూనాలను తీసుకోవాలి. పొలమంతా ఒకే రకంగా ఉన్నప్పుడు 2 హెక్టార్ల విస్తీర్ణానికి ఒక్కొక్క నమూనా చొప్పున చూస్తే సరిపోతుంది.

ఒక మట్టి నమూనా తీయదలచిన పొలంలో 10 నుండి 12 చోట్ల మట్టిని సేకరించాలి. నేలపై భాగంలోని చెత్తా చెదారం తీసివేయాలి. పార ఉపయోగించి ఆకారంలో "‌6" అనగా 15 సెం.మీ లోతు గుంత తీయాలి. పై నుండి కింది వరకు ఒకే మందంతో పలుచని పొరవచ్చే విధంగా మట్టి తీయాలి.

ఇలా అన్ని చోట్ల తీసిన మట్టిని గొనె పట్టా (లేదా) పాలిథీన్ షీటు (లేదా) గుడ్డమీదవేసి మట్టిగడ్డలను చిదిమి బాగా కలిపి చతురస్రాకారంలో పరచి, ఉజ్జాయింపుగా నాలుగు భాగాలుగా విభజించాలి. వీటిలో 1,3 భాగాలు ఉంచుకొని 2,4 భాగాలలోని మట్టిని తీసివేయాలి.

సుమారు అరకిలో మట్టి మిగిలే వరకు ఈ విధంగా చేయాలి. దీనిని చతుర్విభజన పద్ధతి ఈ విధంగా చేయాలి. దీనిని (క్వార్టరింగ్ టెక్నిక్) అంటారు. నమూనాను శుభ్రంగా గుడ్డసంచిలోనికి గాని, పాలిథీన్ సంచిలోగాని వేయాలి. ఎరువులను ఉపయోగించిన గోనె సంచులు, పాలిథీన్ సంచులు మట్టి నమూనాలను సేకరణలో వాడకూడదు.

### రైతులకు మట్టి నామూనాలను సేకరించడంలో మెళుకువలు తెలియజేయండి?

పొలంలోని మట్టి లక్షణాలకు పోలిక లేని చోట్ల లేదా ప్రాతినిధ్యం వహించని చోట్ల మట్టి నమూనా తీయకూడదు. పశువుల ఎరువు వహించని చోట్ల మట్టి నమూనా తీయకూడదు. పశువుల ఎరువు కంపోస్టు కుప్పలు, చెట్ల కింద, గట్ల ప్రక్కన, కంచెల దగ్గర, కాలిబాటలో నమూనాలు తీయకూడదు. పశువుల ఎరువు, కంపోస్టు కుప్పలు, నిలవుంచిన చోట్ల నమూనాలు తీయకూడదు.

* చౌడు భూముల్లో నమూనాలు విడిగా తీయాలి. వీటిని సాధారణ భూముల్లోని మట్టితో కలిపి వేయకూడదు.
* రసాయన ఎరువులు వేసిన 45 రోజుల లోపు నమూనాలు తీయకూడదు.
* నమూనాలు తీసేటప్పుడు నేలపైనున్న ఆకు, అలము, చెత్తా చెదారం తీసివేయాలేగాని పై మట్టిని తొలగించకూడదు.
* సాధారణంగా నీరు నిలిచి బురదగా ఉన్న నేల నుండి నమూనా తీయకూడదు. తప్పనిసరిగా తీయవలసినపుడు నీడన ఆరబెట్టి పరీక్షకు పంపవచ్చును.
* మెట్ట, ఆరు తడి సేద్యంలో పైరు పెరుగుతున్న సమయంలో నమూనా తీయవలసిపుడు వరుసల మధ్య నుండి నమూనా సేకరించాలి.
* చౌడు భూముల్లో 0-15సెం.మీ, లోతుల్లో రెండు నమూనాలు తీయాలి.
* తోట పంటలు వేసేటపుడు ఏ విధంగా మట్టి నమూనాలు సేకరించాలి?

పండ్లతోటలు వేయదలచిన పొలంలో ఒక సామాన్య ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని అందులో 6 అడుగుల గొయ్యితీసి ప్రతి అడుగుకు పై నుండి కిందికి ఒక మట్టి నమూనా చొప్పున సేకరించి వివరాలతో పరీక్షా కేంద్రానికి పంపాలి.

### మట్టి నమూనాను రైతులు భూసార పరీక్షా కేంద్రం వరకు పంపేటపుడు తెలియజేయవలసిన వివరాలు ఏమిటి?

మట్టి నమూనాతో పాటు వివరాల పట్టికను సంచిలో ఉంచి పరీక్షా కేంద్రానికి పంపాలి. వివరాల పట్టికలో రైతుపేరు, గ్రామం, మండలం, జిల్లా, ఫోను నెం. సర్వే నెంబరు లేదా పొలం పేరు, నమూనా తీసిన లోతు, గత మూడు సంవత్సరాలలో పండించిన పంటలు, దిగుబడులు, ప్రస్తుతం రైతులు పండించదలచిన పంటలు /రకం/సీజను, వర్షాధారపు పంట లేదా నీటివసతి పంట, రైతు అనుభవంలోని విషయాలు, మట్టి నమూనా సేకరించిన తేదీ, సేకరించిన వారి సంతకం మొదలగు వివరాలు ఉండాలి.

### భూసార పరీక్షా కేంద్రంలో ఏఏ పరీక్షలు చేస్తారు?

భూసార పరీక్షా కేంద్రంలో నేలను గురించి సరైన అవగాహన కోసం వివిధ పరీక్షలు జరుపుతారు. అది నేలరంగు, స్వభావం వంటి భౌతిక లక్షణాలే గాక, ఉదజని సూచిక, లవణ సాంద్రత, సేంద్రియ కర్బన శాతం, లభ్య భాస్వరం, లభ్యపొటాష్‌లను నిర్ధారిస్తారు. సమస్యాత్మక నేలలకు వేయాల్సిన జిప్సం/ సున్నం పరిమాణాన్ని నిర్ణయిస్తారు. రైతు కోరిన నమూనాలకు సూక్ష్మపోషకాల విశ్లేషణ జరుపుతారు.

### భూసార పరీక్షతోపాటు, సాగు నీటిని కూడా పరీక్ష చేస్తారా? రైతాంగానికి సాగు నీటి పరీక్ష ఏ విధంగా ఉపయోగపడుతుంది?

రాష్ట్రంలోని భూసార పరీక్షా కేంద్రాలన్నింటిలోను మట్టి పరీక్షలతోపాటు, సాగునీటి నాణ్యత కూడా ఉచితంగా పరీక్షించి తగిన సలహానిస్తారు. నేల, నీరు రెండూ మంచివి కాని పరిస్థితుల్లో పంటలు పండించడం సాధ్యం కాదు.

అట్టి నేలల్లో నాణ్యత లేని సాగునీటిని వాడడం కన్నా వర్షాధారపు పంటలు వేసుకోవడం మేలు. వేసినపంట ఎండిపోకుండా ఉండడానికి, అత్యవసర పరిస్థితులలో నీటి ఎద్దడిని అధిగమించడానికి మాత్రం ఈ నీటిని వాడుకోవచ్చును. దీనివల్ల ఎంతో కొంత పంట చేతికి వస్తుంది. నేలస్థితి గతులు మరింత దిగజారకుండా ఉంటాయి. క్రమేణా లక్షణాలు మెరుగయ్యే అవకాశం కూడ ఉంటుంది.

### నీటి నమూనా ఎలా సేకరించాలి?

* సాగునీటి నాణ్యత కోసం కనీసం అర్ధలీటరు నీటిని సేకరించాలి.
* శుభ్రమైన గాజు లేక ప్లాస్టిక్ సీసా ఉపయోగించాలి. గట్టి మూత కలిగి ఉండాలి.

* శుభ్రపరిచిన సీసాలను పరీక్షకు పంపే నీటితో 2-3 సార్లు కడగాలి.

ట్యూబ్‌వెల్స్, బోర్‌వెల్స్ నుండి నీరు సేకరించాల్సినపుడు సుమారు 10 నిముషాలు వదలిన తర్వాత నమూనా సేకరించాలి. చేదబావి నుండి 4-5 బకెట్లు తోడిన తర్వాత నమూనా సేకరించాలి. చెరువులు, కాలువలు, వాగులు, వంకలు, నదులలో నమూనాలు తీసేటపుడు గట్టుకు దగ్గర కాకుండా కొంచెంలోనికి వెళ్ళితీయాలి. ఇలాంటి వనరుల నుండి నెలవారీగా నమూనాలు సేకరించి పంపాలి.

నమూనా సేకరించిన తర్వాత మూతను గట్టిగా బిగించి, సీలుచేసి, సంబంధిత వివరాలను కాగతంపై వ్రాసి సీసాపై అంటించాలి. వీలయినంత త్వరగా ఒకటి, రెండురోజులలో భూసార పరీక్షాకేంద్రానికి నమూనాను పంపే ఏర్పాట్లు చేయాలి.

## ప్రయోగశాలలో సాగునీటి నాణ్యత తెలుసుకోవడానికి ఏఏ పరీక్షలు చేస్తారు?

ప్రయోగశాలలో ఉదజని సూచిక, లవణ పరిమాణ సూచిక నిర్ధారిస్తారు. కార్బొనేట్స్, బైకార్బోనేట్స్, క్లోరైడ్, బోరాన్, కాల్షియం, మెగ్నీషియం, సోడియం పరిమాణాలను నిర్ధారిస్తారు. ఈ ఫలితాల నుండి లెక్కలు కట్టి నాణ్యత నిర్ధారణకు అవసరమయ్యే మరికొన్ని అంశాలను కూడా తెలుసుకొనవచ్చును. సాధారణంగా ఉదజని సూచిక 6.5 నుండి 8.4 లోపు ఉంటుంది. అయితే సాగునీటి నాణ్యత ఏ ఒక్క అంశం మీదో ఆధారపడి ఉండదు. వివిధ అంశాలను సమన్వయ పరిచి నిర్ధారిస్తారు.

## నీటిలో కరిగే లవణాలను ఏ విధంగా తెలుసుకుంటారు?

లవణ పరిమాణ సూచిక ద్వారా మొత్తం నీటిలో కరిగి ఉండే లవణాల పరిమాణాన్ని తెలుసుకోవచ్చును. దీనిని మిల్లి మోసు/సెం.మీ లలో సూచిస్తారు. ఇది 2.25 కన్నా ఎక్కువైతే సాగుకు ఆ నీరు పనికి రాదు. దీని పరిమాణం 0.25 కన్నా తక్కువగా ఉన్నప్పుడు చాలా మంచి నీరు. దీని ద్వారా నీటిని సి1, సి2, సి3, సి4 తరగతులుగా విభజన చేస్తారు.

## నీటిలో గల క్షార తీవ్రతను ఎలా తెలుసుకుంటారు?

నీటిలో క్షార తీవ్రతను రెండు రకాలుగా ఉంటుంది. సోడియం ధాతువుకు కాల్షియం- మెగ్నీషియం ధాతువులకు మధ్యగల సారూప్య నిష్పత్తి. సోడియం పెరిగే కొద్ది క్షార ప్రభావం పెరుగుతుంది. కాల్షియం, మెగ్నీషియం పెరిగేకొద్ది క్షార ప్రభావం తగ్గుతుంది.

ఈ నిష్పత్తి ఆధారంగా ఎస్-1, ఎస్-2 ఎస్-3, ఎస్-4 తరగతులుగా విభజించవచ్చును. ఈ నిష్పత్తి 10 లోపు ఉన్న చాలా మంచి నీరు, 26 కన్నా ఎక్కువ ఉంటే అత్యధికం క్షారం కనుక సాగుకు అస్సలు పనికిరాదు.

అధికంగా మిగిలి ఉండే సోడియం కార్బోనేట్లు, దీని విలువను మిల్లీ ఈక్విివాలంట్స్/ లీటర్లలో సూచిస్తారు. ఇది 1.25 కన్నా తక్కువ ఉన్నప్పుడు సురక్షితం. అన్ని భూములకు ఈ నీటిని వాడుకోవచ్చును. 2.5 కన్నా అధికంగా ఉన్నప్పుడు సాగుకు అనుకూలం కాదు.

## నీటిలో ఉన్న బోరాను పరిమాణాన్ని ఎలా సూచిస్తారు?

దీనిని పి.పి.ఎంలో సూచిస్తారు. సాధారణ పైర్లు, పత్తి, మొక్కజొన్న, టమోటా, పొద్దుతిరుగుడు లాంటి పంటలు అన్ని ఒక మోస్తారుగా తట్టుకుంటాయి. ఇది 2పి.పి.ఎం కన్నా తక్కువ వుంటే అన్ని పైర్లకు అనుకూలం. నిమ్మ, ద్రాక్ష లాంటి ఫలవృక్షాలు అస్సలు తట్టుకోలేవు. అలాంటి పంటలకు 1 పి.పి.ఎంలోపు ఉండాలి.

## నీటిలో ఉన్న క్లోరైడు మొక్కలకు ఏ విధంగా హాని చేస్తుంది?

క్లోరైడు, సోడియంతో కలిసి ఉన్నప్పుడు మొక్కకు తీవ్రమైన హాని చేస్తుంది. సాధారణంగా 10 మిల్లీ ఈక్విివాలెంట్స్/ లీటరు కన్న తక్కువ పరిమాణంలో ఉన్న నీరు మంచిది. ద్రాక్ష, నిమ్మజాతి ఫల వృక్షాలు, పొగాకు, బంగాళదుంప పైర్లు క్లోరైడ్‌ను తట్టుకోలేవు.

## నీటి నాణ్యత ఆధారంగా పైర్లను ఏవిధంగా ఎంపిక చేసుకోవాలి?

సాధారణ పైర్లు అన్ని కూడా కొద్దిపాటి తేడాలతో లవణాలను, క్షారాన్ని ఒక మోస్తారుగా తట్టుకుంటాయి. పత్తి, రాగి, ఆవాలు, ధనియాలు, పైర్లు లవణాలను తట్టుకోగలవు. పప్పుధాన్యపు పైర్లు, వేరుశనగ, నిమ్మజాతి ఫలవృక్షాలు లవణాలను, క్షారాన్ని తట్టుకోలేవు గాని వరి పైరు క్షారాన్ని తట్టుకుంటుంది.

## సాగునీటి తరగతులు గురించి చెప్పండి?

సాగునీటిని లవణ పరిమాణ సూచిక, సోడియం అడ్సార్ప్షన్ రేషియో బట్టి నాలుగు తరగతులుగా విభజించవచ్చును. ఇందులో మొదటి తరగతి నీరు అన్ని నేలలకు, పైర్లకు అన్ని పరిస్థితులలో పనికి వస్తుంది. నాల్గవ తరగతి నీరు సాగుకు అస్సలు పనికిరాదు.

సాధారణంగా నదులు, కాలువలలోని నీరు సంవత్సరంలో అన్ని కాలాలలో మొదటి, రెండవ తరగతులకు చెందినవిగా ఉంటాయి. చెరువులు, కుంటలలోని నీరు రెండు, మూడవ తరగతికి చెందినవిగా ఉంటాయి. భూగర్భ జలాలలో ఎక్కువ భాగం మూడవ తరగతికి చెందినవి గాను, ఒక్కొక్కప్పుడు నాల్గవ తరగతికి చెందినవిగాను ఉంటాయి.

## తక్కువ నాణ్యత గల నీటి సదుపాయం గల రైతులకు ఏం సూచనలు ఇస్తారు?

* పైర్లకు వేసే నత్రజని, భాస్వరం ఎరువులు 25 శాతం మామూలుగా కన్నా అధికంగా వేయాలి.
* పొలం ఆరగట్టకుండా, మురుగు పోయే సౌకర్యం కల్గించడం ద్వారా అధిక లవణాల వల్ల కలిగే హాని తగ్గించవచ్చు.
* వీలయినంతగా సేంద్రీయ ఎరువులని ఉపయోగించాలి.
* పచ్చిరొట్ట పైర్లు జీలుగ మొదలైనవి వాడవచ్చు.
* లవణాలు ఎక్కువ ఉన్న నీటిని వాడితే పాలచౌడు నేలలుగా మారతాయి. క్షార ప్రభావం ఎక్కువ గలిగిన నీటిని వాడితే కారచౌడు నేలలుగా మారతాయి.
* నీటి నాణ్యత ఆధారంగా పైర్లని ఎంపిక చేసుకొని సాగుచేయాలి.
* వర్షాధార పంటలు వేసుకోవడం ఉత్తమం.

రైతులు సీజను ప్రారంభంలో తేమ, పొలంలోని మట్టిని, అదేవిధంగా నీటివనరుల నుండి నీటి నమూనాలను సేకరించి సంబంధిత వ్యవసాయాధికారి ద్వారా పరీక్షా కేంద్రానికి పంపాలి. ఫలితాలు తెలుసుకున్న తర్వాత సిఫార్సులు సక్రమంగా అవలంభించినపుడు భూమి, నీటిని సంరక్షించుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించగలరు.

*- గన్ను మాధవి, సంతోష్. జి*

*సీనియర్ రీసెర్చ్ ఫెలో, వ్యవసాయ కళాశాల, హైదరాబాద్*

# ఉద్యమంలా చెరువుల మరమ్మత్తులు

**రాష్ట్రంలో మిషన్ కాకతీయ ఉద్యమంలా సాగుతున్నది. వివిధ జిల్లాల్లో ప్రజాప్రతినిధులు ప్రజలు ఉప్పెనలా కదిలి చెరువులు బాగు చేసుకుంటున్నారు. మెదక్‌జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లిలో రూ. 25.70 లక్షలతో చేపట్టిన ఊర చెరువు మరమ్మత్తు పనులను రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రారంభించారు.**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం పచ్చని పొలాలతో కళకళలాడాలన్న సంకల్పంతో మిషన్ కాకతీయ మొదలు పెట్టారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.

మంత్రి హరీశ్ రావుతోపాటు ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే రామలింగారెడ్డి, ఎంపీపీ పద్మాశ్రీరాములు, సర్పంచ్ బాలమణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా నర్మెట మండలంలోని తరిగొప్పుల గ్రామంలోని పెద్దచెరువు పూడికతీత పనుల్లో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పాల్గొన్నారు. చెరువుల పునరుద్ధరణతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు.

అదే జిల్లా శాయంపేట మండలంలోని నేరేడుపల్లి, కాట్రపల్లి, కొప్పుల, పెద్దకోడెపాక, తహార్‌పూర్ గ్రామాల్లో జరిగిన చెరువుల పునరుద్ధరణ పనుల్లో శాసన సభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి పాల్గొన్నారు. అధికారులు చెరువుల పనుల్లో నాణ్యతపై రాజీపడొద్దని స్పష్టం చేశారు. చెరువు పనుల్లో నాణ్యత పరిశీలించేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలు రానున్నాయని, తానుకూడా ప్రతి చెరువు పనులను రెండుసార్లు స్వయంగా తనిఖీ చేస్తానని చెప్పారు. నాణ్యతపై ఫిర్యాదు వస్తే క్వాలిటీ అధికారులతో విచారణ చేయించి చర్యలు తీసుకుంటానని స్పీకర్ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఐబీడీఈ ప్రసాద్, జడ్పీటీసీ రమాదేవి, ఎంపీటీసీలు బగ్గి రమేశ్, తడ్క శ్రీలత, సర్పంచ్‌లు కుమారస్వామి, జనగాని మంజుల సత్యం, ఇమ్మడిశెట్టి రవీందర్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### *నల్లగొండ జిల్లాలో*

నల్లగొండ జిల్లాలో మిషన్ కాకతీయ పనులు ఊపందుకున్నాయి. ఆలేరు నియోజక వర్గం గుండాల మండలంలోని సీతారామపురం ఊర చెరువు మరమ్మత్తు పనులను ప్రభుత్వ విప్ గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి ప్రారంభించగా, మర్రిపడగ గ్రామంలో ఊర చెరువు, పాచిల్ల చెరువు పనులను స్థానిక నేతలు ప్రారంభించారు.

తుంగతుర్తి నియోజకవర్గం నూతన్‌కల్ మండలంలోని తాళ్లసింగారం గ్రామ చెరువు, తుంగతుర్తి మండల కేంద్రంలోని సంగెం చెరువు పునరుద్ధరణ పనులను పార్లమెంటరీ కార్యదర్శి గాదరి కిషోర్ ప్రారంభించారు. పెద్దవూర మండలం తిమ్మాయిపాలెం, చింతలపాలెం చెరువు పనులను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించగా సూర్యాపేట మండలం రామారం, చివ్వెంల మండలంలోని బండమీది చందుపట్ల గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు చెరువు మరమ్మత్తు పనుల్లో పాల్గొన్నారు.

మునుగోడు నియోజక వరగూడెం మండలంలోని నామపురం, భీమనపల్లి, చండూరు మండలంలోని తేరటుపల్లి, దోనిపాముల గ్రామాల్లో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభించారు.

హుజూర్‌నగర్ పట్టణం, పోతినేని కుంట మండల పరిధిలోని అమరవరం, గోపాలపురం, లింగగిరి, ఊర చెరువులను టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాసోజు శంకరమ్మ ప్రారంభించారు. నల్లగొండ నియోజకవర్గం తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెం గ్రామ చెరువును స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించారు.

### *అదే ఉత్సాహం.. అదే స్ఫూర్తి*

మిషన్ కాకతీయ ప్రాజెక్టు పనుల్లో ఒక జిల్లాతో మరో జిల్లా పోటీపడుతోంది. మీరు ఎన్ని చెరువులు చేశారంటే మీరు ఎన్ని చెరువులు అనుకుంటూ ఇంజినీర్లు పోటీ పడుతున్నారు. అలాగే గ్రామస్థాయిలో కూడా ప్రజల నుంచి రెట్టించిన ఉత్సాహంతో గ్రామాన్ని బాగుచేసుకోవాలన్న లక్ష్యంతో తరలివస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 2,116 చెరువుల్లో పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ ఖమ్మం జిల్లానే అగ్రస్థానంలో కొనసాగుతున్నది. తర్వాత స్థానాలకోసం వరంగల్, మెదక్, కరీంనగర్, నల్గొండ పోటీపడుతున్నాయి.

\- ఎస్‌పిఆర్

**చెరువుల పునరుద్ధరణపై ప్రస్తుత పరిస్థితి**

| జిల్లా | మొత్తం చెరువులు | ఈపాటికే మొదలైనవి | ఈరోజు మొదలైనవి | మొత్తం |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 790 | 192 | 18 | 210 |
| కరీంనగర్ | 1188 | 227 | 5 | 232 |
| వరంగల్ | 1173 | 338 | 12 | 3 |
| ఖమ్మం | 903 | 368 | 8 | 376 |
| నిజామాబాద్ | 651 | 156 | 0 | 156 |
| మెదక్ | 1869 | 267 | 0 | 267 |
| రంగారెడ్డి | 574 | 88 | 6 | 94 |
| మహబూబ్‌నగర్ | 1477 | 178 | 18 | 196 |
| నల్గొండ | 952 | 205 | 17 | 222 |
| మొత్తం | 9577 | 225 | 91 | 2116 |



# వాతావరణంలో మార్పులు - తీసుకొనవల్సిన చర్యలు

**వాతావరణంలో మార్పు సంభవిస్తుందనే మాట మనం తరుచుగా వింటూనే ఉన్నాం. పర్యవసానంగా కనీవినీ ఎరుగని వేడిమి, గాలి దుమారాలు, చలితీవ్రత, ఋతుపవనాల దాగుడు మూతలు, అకాల వర్షాలు, తుఫానులు - మరోప్రక్క కరువు వంటి ఫలితాలను చూస్తునే ఉన్నాం.**

**మునుపెన్నడులేని విధంగా రికార్డు స్థాయిలో (2014 సంవత్సరంలో) భూమిపై అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన విషయం మనకు తెలిసిందే.**

**గతంలో 10 వేల సంవత్సరాలుగా ఉష్ణోగ్రతలలో పెద్దగా హెచ్చు తగ్గులూ లేవు.**

కానీ గడచిన 4 దశాబ్దాలలో పారిశ్రామిక విప్లవానికి పూర్వపు రోజులతో పోలిస్తే 0.8 డిగ్రీల సెంటీగ్రేడ్స్ మేరకు ఉష్ణోగ్రత పెరిగింది. ఇలాగే, ఈ ఉష్ణోగ్రతలో పెరుగుదల 2 డిగ్రీల సెల్సియస్‌కు చేరిందంటే ప్రమాద ఘంటికలు మ్రోగినట్లేనని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

మానవాళి తక్షణం మేలుకొని సరైన దిద్దుబాటు చర్యలు చేపట్టకుండా ప్రస్తుత ధోరణిలోనే కార్యకలాపాలు, అలవాట్లు కొనసాగిస్తే 2050 సంవత్సరం నాటికి తీవ్రమైన దుర్భిక్షప్రాంతాలు పెరుగుతాయని, అదే సమయంలో సముద్రపు నీటి మట్టం పెరిగి పల్లపు ప్రాంతాలు మునగటం, తుఫాన్‌లు, వరదల సంఖ్య పెరగడం గంగ బ్రహ్మపుత్ర వంటి జీవనదుల ప్రవాహ ఉధృతి పెరుగుతుందని ఊహిస్తున్నారు.

తరువాత కూడా పరిస్థితి ఇలాగే కొనసాగితే, 2100 నాటికి మానవాళి మరింత భయానక పరిస్థితిని ఎదుర్కొనే అవకాశం ఉందని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. వారి మాటల్లో చెప్పాలంటే ఈ ప్రమాదం నుండి ప్రపంచంలోని ఏ దేశానికి, ఏ వ్యక్తికి మినహాయింపు లేదు వారి అంచనా ప్రకారం 2100 నాటికి పరిస్థితులు ఇలా ఉంటాయట.

- భూగోళ ఉష్ణోగ్రత 4 డిగ్రీల మేరకు పెరుగుతుంది - భరించలేని వేడితో బ్రతుకు దుర్భరమవుతుంది.
- అతి తీవ్రమైన త్రాగునీటి ఎద్దడి సంభవిస్తుంది.
- 40% భూమి కరువు కాటకాల బారిన పడుతుంది.
- భూమండలంలోని సగానికి పైగా జీవరాశులు అంతరిస్తాయి.
- వ్యాధులు తీవ్రతరమై ఎక్కువ మంది వ్యాధుల బారిన పడతారు.
- గ్రీన్‌ల్యాండ్, అంటార్కిటిక్, ఆర్కిటిక్‌లలోని మంచు కరిగి సముద్రమట్టం మరింత పెరిగి మరిన్ని తీర ప్రాంతాలు, చిన్న చిన్న ద్వీపాలు మునుగుతాయి.
- మన భారతదేశం ముఖ్యంగా గంగ-బ్రహ్మపుత్ర మైదాన ప్రాంతం, గోదావరి నది డెల్టా ప్రాంతం, కృష్ణ-మహానది డెల్టా ప్రాంతంలోని కోటానుకోట్ల ప్రజలు నిర్వాసితులు అయ్యే ప్రమాదం ఉంది.

మనకున్నది ఒకే ఒక భూమి. మనుషులతో పాటు జంతువులు,

కీటకాలు, పక్షులు. చెట్లు, ఇతర చరాచర జీవరాశుల మనుగడకు అవకాశం ఉన్న ఏకైక గ్రహం మన భూమి. ప్రస్తుతం భూమి మీద మిగిలి ఉన్న జీవరాశుల సంఖ్య కోటికి పైగా ఉంటుందని శాస్త్రజ్ఞుల అంచనా. ఈ జీవరాశుల మనుగడకు అనువైన ఉష్ణోగ్రత భూమ్మీద ఏర్పడటానికి గ్రీన్‌హౌస్ వాయువులనబడే కార్బన్ డై యాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ మరియు ఇతర వాయువులు కారణభూతమవుతున్నాయి ఎలాగంటే సూర్యుని నుండి వెలువడిన వేడిమిని కొంత భూమి స్వీకరించగా, మిగిలిన వేడిమిని గ్రీన్‌హౌస్ పొర బంధిస్తుంది. అలా ఈ వాయువులు వాతావరణంలో వెచ్చదనాన్ని కాపాడుతున్నాయి. ఒకవేళ ఈ గ్రీన్‌హౌస్ వాయువు పొరే లేకపోతే భూమి అతిశీతలంగా ఉండేది. అదే ఈ పొర మందంగా మారితే భూమిపై వేడిమి పెరుగుతూపోతుంది. ఇదే ప్రస్తుతం మన ముందున్న పెనుసవాలు.

### ఇలా ఎందుకు జరుగుతోంది?

సహజ సిద్ధమైన ప్రకృతి పరంగా వచ్చే మార్పుల వల్లనా, లేక మానవుల చర్యల ఫలితమా? ప్రపంచ వ్యాప్తంగా జరిగిన శాస్త్ర పరిశోధనలతో తేలినదేమిటంటే, ఈ గ్రీన్‌హౌస్ పొర దట్టమవుతూ పోవడానికి సహజసిద్ధ అంశాలకంటే మానవుల చర్యలే ఎక్కువగా కారణభూతమయ్యాయని.

ఈ విషయం మనకు పూర్తిగా అర్థం అవ్వాలంటే, ముందుగా మనం 'కార్బన్ సైకిల్' గురించి తెలుసుకోవాలి.

**కార్బన్ సైకిల్ అంటే వాతావరణం, జీవరాశుల మధ్య కార్బన్ -డై-ఆక్సైడ్ ద్వారా కార్బన్‌గా మారే ప్రక్రియ.**

### ఇది ఎలా జరుగుతుంది?

మనుషులు, జంతువులు తమకు ప్రాణాధారమైన ఆక్సిజన్ వాయువును వాతావరణం నుండి స్వీకరించి తమకు అక్కర్లేని కార్బన్ డై ఆక్సైడ్‌ను వాతావరణంలోకి వదలటం జరుగుతుంది. మొక్కలు, చెట్లు వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకొని, ఆక్సిజన్‌ను వాతావరణంలోకి వదులుతాయి. ఈ విధంగా చెట్లు, మనుషులు, జంతువులు పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడి మనుగడ కొనసాగించడటం ఒక సహజమైన ప్రక్రియ.

ఎటొచ్చీ గ్రీన్‌హౌస్ వాయువుల మోతాదు గత 200 సంవత్సరాలుగా క్రమేపీ పెరుగుతూ వస్తుంది. ఫలితం భూమి వేడెక్కుతోంది పారిశ్రామిక విప్లవంతో పెరిగిన పరిశ్రమల స్థాపన జనాభా పెరుగుదల గ్రీన్‌హౌస్ వాయువుల పెరుగుదలకు ప్రధాన కారణాలు కాగా, ఆధునిక జీవన విధానానికి తోడ్పడే వస్తువులు లేక వసతుల ఉత్పత్తికి కావలసిన శక్తి కోసం పెద్ద మొత్తంలో శిలాజ ఇంధనాలను మండించడం, అడవులను నరికి వేయడం ఇతర కారణాలుగా వున్నాయి.

అంటే మానవుడే అసలైన వినాశకారి అవుతున్నాడన్నమాట. ఒక్కక్షణం వివరాల్లోకి వెళితే ఇంట్లో వంటకు వాడే వంటచెరకు, గ్యాస్, కరెంట్ దగ్గర నుండి, మనం వాడే మిక్సీలు, గ్రైండర్‌లు, ఫ్రిజ్‌లు, కూలర్‌లు, ఏసిలు- ఒకటేమిటి మనం మన సౌలభ్యానికి వాడుకొనే అన్ని ఉపకరణాల నుండి గ్రీన్‌హౌస్ వాయువుల ఉత్పత్తికి అవుతున్నాయి.



మనం స్థానికంగా ఉత్పత్తి అయ్యే ఆహార పదార్థాలతో సరి పెట్టుకుంటున్నామా? లేదుకదా! దూరప్రాంతాల నుండి దిగుమతి చేసుకున్న పండ్లు, కూరగాయలు ఇతర ఆహార పదార్థాలను కూడా వినియోగిస్తున్నాం కదా. వాటి రవాణా కోసం ఎంత ఇంధనం మండి ఉంటుంది. కాదంటారా?

మనం ఇతర ప్రాంతాలకు పనుల నిమిత్తమో, విహార యాత్రలకో బస్సు, రైలు, విమానం, కారు లేదా బైకులలో ప్రయాణాలు చేస్తున్నాం కదా! అంటే మనం కర్బనాలను ఉత్పత్తి చేస్తున్నాం.

గ్రీన్‌హౌస్ వాయువుల్లో ముఖ్యమైన కార్బన్ డైయాక్సైడ్ వాయువు మోతాదు రోజు రోజుకూ ఎలా పెరుగుతుందో చూద్దాం.

- మనం శ్వాస ప్రక్రియ ద్వారా రోజుకు ఒక కిలో కార్బన్ డై ఆక్సైడ్ వదులతాము
- బస్సులోనో, ట్రైన్‌లోనో 7 మైళ్ళ ప్రయాణం చేస్తే ఒక కేజీ కార్బన్ డై ఆక్సైడ్‌ను ఉత్పత్తి చేసినట్లే.
- కారులో వెయ్యి మైళ్ళ దూరం ప్రయాణం చేస్తే 1300 పౌండ్ల కార్బన్‌ను ఉత్పత్తి చేసినట్లు.
- 5 ప్లాస్టిక్ సంచుల్లో లేక 2 ప్లాస్టిక్ బాటిల్స్‌ను గానీ వాడామా ఒక కిలో కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేసినట్లు.

ఇకపోతే మరో గ్రీన్‌హౌస్ గ్యాస్ మీథేన్ వ్యవసాయ రంగంలో, గృహలలో ఉత్పన్నమయ్యే వ్యర్థాలను ఎక్కడంటే అలా వదిలివేయడం లేదా లాండ్ ఫిల్లింగ్‌లలో వాడడం ద్వారా ఏర్పడేది.

వాతావరణ మార్పుల గురించి పట్టించుకోకపోతే భవిష్యత్తులో ముఖ్యంగా మన మనుగడ పైనా, త్రాగునీటి లభ్యత పైనా, ఆరోగ్యం పైనా విపరీత ప్రభావాలు కలుగుతాయి.

## త్రాగునీటి లభ్యత పైన ప్రభావం ఎలా అంటారా?

- వాతావరణం వేడెక్కడం వల్ల భూమిపై ఉన్న నీరు ఎక్కువ మోతాదులో అవిరౌతుంది.
- మంచు పర్వతాలు కరిగి, సముద్ర నీటిమట్టం పెరుగుతుంది, వరదలూ పెరుగుతాయి.
- చెట్లు నరికివేయడం వల్ల భూమికి నీటిని పీల్చుకునే సామర్థ్యం తగ్గిపోతుంది.
- వర్షాభావ పరిస్థితులు ఎదురౌతాయి.
- పారిశ్రామిక, వ్యవసాయ, కుటుంబ అవసరాల కోసం ఇబ్బడి ముబ్బడిగా భూగర్భ జలాలను తోడివేయడం వల్ల త్రాగునీరు లభ్యత ప్రశ్నార్థకంగా మారుతుంది.
- అన్నింటికీ మించి నీరు కలుషితమవ్వడం మరో పెద్ద సవాలుగా మారుతుంది.

## వాతావరణ మార్పులు - మన ఆరోగ్య ప్రభావం

- అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులకు దారితీయడంతో పాటు మన గుండె, ఊపిరితిత్తుల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి.
- అకాల వర్షాలు, అధిక వర్షపాతం, మంచుపాతం వలన కీటకాల వృద్ధి చెంది మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయి.
- సముద్ర ప్రాంతాలలోని భూగర్భనీటితో సహా అన్ని నీటివనరులు కలుషితమై డయేరియా వంటి వ్యాధులు విస్తరిస్తాయి.
- తుఫాన్‌లు, పెనుతుఫానులు, వరదలు పోటెత్తడం వల్ల జనజీవనం స్తంభించడంతో పాటు ఆస్తినష్టం, ప్రాణనష్టమేకాక, మానవులలో మానసిక ఆందోళనలు దీర్ఘకాలికంగా ప్రభావం చూపిస్తాయి.
- కరువు పరిస్థితులు పంట ఉత్పాదకతను తగ్గిస్తాయి. ఆదాయ మార్గాల పై ప్రభావం చూపిస్తాయి ఫలితం సామాజిక జీవనం దెబ్బతింటుంది.
- పౌష్టికాహార లేమి, తక్కువ బరువు గల పిల్లలు, రక్తలేమి వంటి సమస్యలు తలెత్తుతాయి.



- అడవులలో మంటలు చెలరేగడం పెరిగి జీవరాశుల ఉనికికి ముప్పు కలిగిస్తాయి.

దేశాభివృద్ధి జరగాలంటే ఎంతో కొంత శక్తి లభ్యత పెరగాలి, కాని ఈ క్రమంలో సంభవించే గ్రీన్‌హౌస్ వాయువుల పెరుగుదలవల్ల సంభవించే దుష్ఫలితాలను మనం విస్మరించటాన్ని భావితరాలు క్షమించవు.

ఈ చర్యలు మానవాళి భవిష్యత్తుకే ప్రమాదం కనుక అభివృద్ధి లక్ష్యాలను, వాతావరణ మార్పులను ఎదుర్కొనే ఆవశ్యకతను సమతుల్యం చేసుకోవాలి. కనుక మనమందరం ఎటువంటి ఆలస్యం చేయకుండా ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి సిద్ధం కావాలి. అందుకు మన ముందు రెండు ప్రత్యామ్నాయ మార్గాలున్నాయి.

*ఒకటి:* వాతావరణ మార్పును నివారించటం లేదా తగ్గించటం ద్వారా- అంటే వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను తగ్గించటం.

*రెండు:* వాతావరణ మార్పు ప్రభావం ప్రపంచంలోని ప్రతిఒక్కరి

పై పడుతుంది కనుక దీన్ని ఎదుర్కొనే చర్యలు మనలో ప్రతి ఒక్కరం తీసుకోవాలి.

## వాతావరణ మార్పుకు కావలసిన సర్దుబాటు చర్యలు

ఇంతవరకు పెరిగిన భూతాపాన్ని ఎలాగూ తగ్గించలేము. ఎందుకంటే గ్రీన్‌హౌస్ పొరలోకి చేరిన గ్రీన్‌హౌస్ వాయువులను తొలగించలేము కదా! అందుకే ఇప్పడికే ఏర్పడిన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు గాను

- చెరువులకు, జలాశయలకు ఎక్కువ స్థలాన్ని ఇవ్వటం.
- నేలలో ఎక్కువ నీరు ఇంకేలా చూడటం.
- నేల వదులుగా ఉండేట్టు చూడటం.
- పంటల దిగుబడి పై ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని అనువైన పంటలను వేసుకోవటం వంటివి పాటిద్దాం.

*దిద్దుబాటు చర్యల గురించి మాట్లాడే మనకు మనం ఇలా ప్రశ్నించుకోవాలి.*

- మనం రోజు ఏ ఏ పనులు చేస్తున్నాం.
- ఏ ఏ పనులు గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలకు కారణం అవుతున్నాయి?
- ఏ మేరకు మనం వాటిని తగ్గించే అవకాశం వుంది?
- వీటికి సమాధానాలు వెతికి అమలు పరిస్తే మనం మన వంతు బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టినట్లే.

*అందుకే ఈ రోజు నుంచి మనం విధిగా ఈ పనులు చేద్దాం.*

- మన ఇంటి పెరటిలో, వీధులలో మొక్కలు పెంచడం ద్వారా గార్డెనింగ్‌కు తోడ్పడదాం.
- ఆహార పదార్థాలను అవసరమైన మేరకే వినియోగించుకుందాం
- ప్రాంతీయంగా లభ్యమయ్యే ఆహార పదార్థాలకే ప్రాధాన్యతనిద్దాం.
- వ్యవసాయంలో తక్కువ నీటిని వాడుకోని ఎక్కువ దిగుబడి సాధించేందుకు అనువైనా సాంకేతికలను అనుసరిద్దాం, అందుకే సోలార్ పంపుసెట్లు, బిందుసేద్యం, తుంపర సేద్యం, శ్రీవరిసాగు వంటి వాటిని అవలంబిద్ధాం.
- వీలైయినంత వరకు ధూమపానానికి దూరంగా ఉందాం.
- కాల్చిన అగ్గిపుల్లలు, పుల్లలు, నిప్పు విషయంలో జాగ్రత్తగా వుందాం. ముఖ్యంగా వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు, అడవులు మండడం వంటి వాటిని నివారిద్దాం.
- ప్రతి వస్తువు లేదా వనరు లేదా సేవలను వాడుకొనేటప్పుడు లేదా కొనుగోలు చేసేటప్పుడు 'తగ్గించు, పున:వినియోగించు, పున:తయారీ చేయి' సిద్ధాంతాన్ని అనుసరిద్దాం.
- ఉదయం, సాయంత్రం సమయాలలోనే మొక్కలకు, చెట్లకు నీరు పోద్దాం. నీరు ఆవిరయ్యే అవకాశాన్ని తగ్గించుకుందాం.
- వీలయినంత వరకు ఎక్కువ నీరు ఉపయోగించుకునే మాంసాహారాన్ని తగ్గించుకోని తక్కువ నీరు వాడుకొనే శాఖాహారాన్ని భుజిద్దాం.
- నీటి కుళాయి నుండి ఒక్క చుక్కనీటిని కూడా వృథా పోనివ్వకుండా జాగ్రత్తలు తీసుకుందాం.
- వర్షపునీటిని మన ఇల్లు దాటి బయటకు పోనివ్వకుండా ఇంకుడు గుంతలు నిర్మించుకుందాం.
- ఫ్రిజ్‌లు, కార్లు, ఎసి మెషిన్స్ కొనేటప్పుడు వాటి సామర్థ్యంతో పాటు, గ్లోబల్ వార్మింగ్ రేటింగ్‌ను కూడా పరిశీలించి కొనుగోలు చేద్దాం.
- ఎయిర్ కండీషన్లు వాడే గదిని పూర్తిగా మూసి ఉంచుదాం.
- అతి తక్కువ ఉష్ణోగ్రతకు ఎ.సిని సెట్ చేసుకోకుండా, వాంఛనీయ ఉష్ణోగ్రత వద్ద సెట్ చేసుకుందాం. ఉదాహరణకు 18 డిగ్రీసెంటిగ్రేడ్, 22 డిగ్రీ సెంటిగ్రేడ్ వద్ద కాక, 25 డిగ్రీ సెంటిగ్రేడ్ నుండి 28 డిగ్రీ సెంటిగ్రేడ్ వద్ద ఎ.సిని వాడదాం.
- టివి, మొబైల్ ఛార్జర్, కంప్యూటర్ వంటి వాటిని పని పూర్తయిన వెంటనే స్విచ్ ఆఫ్ చేసుకుందాం.
- వాషింగ్‌మిషన్‌ను బట్టలు పూర్తిగా నిండినప్పుడే ఆన్ చేద్దాం.
- వీలయినంత వరకు సోలార్ విద్యుత్, బయోగ్యాస్ వాడడానికి ముందుకు వద్దాం.
- కిటికీలు, తలుపులు తెరచి ఉంచడం ద్వారా పగటి సమయంలో లైట్లు ఫ్యాన్‌ల వాడకం తగ్గించుకుందాం.
- ఎల్.ఇ.డి. బల్బులను వాడి కరెంటును ఆదా చేద్దాం.
- చిన్న చిన్న దూరాలకు నడచి వెళ్దాం లేదా సైక్లింగ్ చేద్దాం.
- కారు / టాక్సీ / ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టును వాడకుండా, వీలయినంత వరకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్ వాడుకుందాం.
- వీలైతే కారు లేదా బైక్ పూలింగ్‌ను అనుసరిద్దాం.
- బజారుకు వెళ్ళేటప్పుడు మనతోపాటు ఓ గుడ్డ సంచిని తీసుకువెళ్దాం.
- ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించుకుందాం.
- సాధ్యమైనంత వరకు తక్కువ ప్యాకేజీ ఉన్న వస్తువులనే కొనుగోలు చేద్దాం.
- ప్రతిసారీ వాటర్ బాటిల్స్ కొనుక్కోకుండా, ఇంటి నుండి మళ్ళీ మళ్ళీ వాడదగు బాటిల్స్‌తో నీటిని తీసుకువెళ్దాం.

*ఈ చర్యల ద్వారా . . .*

- ఆక్సిజన్‌ను పెంచుకుందాం.
- కార్బన్‌డై ఆక్సైడ్‌ను తగ్గించుకుందాం.
- భూగోళాన్ని చల్లపరుచుకుందాం.
- వాతావరణాన్ని కాపాడుకుందాం.

*- ఎ. నాగేశ్వరరావు*
*సీనియర్ రిసోర్స్‌పర్సన్, సి.డబ్ల్యుఎస్*

వదిహేనో శతాబ్దం చివరికాలం, అంటే మొగలాయి చక్రవర్తుల స్వర్ణ యుగారంభంలో ఐరోపా దేశీయులు వ్యాపార నిమిత్తం భరతఖండం చేరారు. 1498 సంవత్సరంలో పోర్చుగీసు నావికుడు వాస్కోడగామా, తన నూట అరవై మంది అనుచరులు, కాలికాట్ తీరప్రాంతంలో నావలు నిలిపి వ్యాపార పురోభివృద్ధికోసం బేహారులుగా స్థిరపడ్డారు. నాటినుండి సుమారు నాలుగువందల యాభై సంవత్సరాల వరకు ఐరోపా ఖండవాసులు, భారతదేశంతో వ్యాపార లావాదేవీలను పెంపొందించుకొంటూ తమ నివాసాన్ని క్రమంగా సు-స్థిరం చేసుకొన్నారు.

డచ్చి, పోర్చుగీసుల తరువాత ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు తమ తమ వాణిజ్య విస్తరణ చేసుకొంటూ, భారతదేశ రాజులతో, నవాబులతో, సర్దారులతో సత్సంబంధాలు పెంచుకొన్నారు. క్రమంగా ఇంగ్లీషువారు తమ ధీశక్తితో, సుశిక్షితమైన సైనిక బలంతో డచ్చి, పోర్చుగీసు, ఫ్రెంచి దేశీయులను తొలగించి తామే భారతదేశాన్ని ఆక్రమించుకోవడం మొదలుపెట్టారు.

స్వాతంత్ర్య సమరయోధుల కూటమికొక, వ్యవస్థీకృత కేంద్ర సారథ్యసంఘం లేదు విప్లవ నాయకులను కూడగట్టుకొని, కట్టుదిట్టంగా ప్రత్యర్థుల నెదిరించడానికి అధినాయకుడు లేకపోవడం వల్ల పంజాబ్‌లో సిక్కులు, ఆయా రాష్ట్రాలలో కొందరు మండలాధీశులు ఇంగ్లీషువారికి అండదండల నిచ్చి నమ్మిన వారిని వెన్నుపోటు పొడవటంవల్ల, అంతిమ విజయం ఇంగ్లీషువారికే దక్కింది. ఇంగ్లీషువారి క్రమ శిక్షణ ఉన్న సైన్యం ఆధునిక సామాగ్రితో పాటు సమీకృతమయిన కేంద్ర ప్రభుత్వ సారధ్యబలం ఉండటంవల్ల భారతీయులు ఓటమి అంగీకరించవలసి వచ్చింది.

తిరుగుబాటు అనంతరం దేశ పరిపాలన బాధ్యతలను ఈస్టిండియాకంపెనీ నుండి బ్రిటిష్ ప్రభుత్వం హస్తగతం చేసుకొని, సువ్యవస్థితమయిన పరిపాలన సంవిధానానికి కట్టుదిట్టమయిన చర్యలు తీసుకొన్నది. ఒకే రీతి రాజకీయ పరిపాలన, ఒకే విధమైన అధికార యంత్రాంగం ఆసేతు హిమాచలం కార్య భారాన్ని చేపట్టడం వల్ల, దేశం యావత్తు ఒకే ఏలుబడి కిందికి రావడంవల్ల భారతీయులంతా ఒకటేనన్న భావ సమైక్యత ఏర్పడింది. దీనికితోడు ఇంగ్లీషువారు విద్యా సంస్కరణలను ప్రవేశపెట్టి, ఇంగ్లీషును విద్యాలయాలలో బోధన భాషగా చేసి భారతీయులలో పరోక్షంగా భావ ప్రచలన సౌలభ్యానికి రాచబాటను రూపొందించారు.

# భారతీయుల పారతంత్ర్యం - పునరుజ్జీవనం

మొగలు సామ్రాజ్య బలహీనత ఇంగ్లీషు వారి బలానికి కారణమైంది. గడిచిన వేయి సంవత్సరాల భారతదేశ చరిత్రలో విదేశీయుల దండయాత్రలు మారణహోమాలు జరిగినా భారతదేశాన్ని పాలించడానికి వచ్చిన పరదేశీయులంతా ఈ దేశంలోనే స్థిరపడి, దేశీయులతో కలిసి మెలిసి జీవించారు. అందువల్ల ఆ దేశీయుల పరిపాలన భారతీయులకంత వెగటు కలిగించలేదు. కాని ఇంగ్లీషువారు వారి వ్యాపారాభివృద్ధినే దృష్టిలో ఉంచుకొని వారు విదేశీయులమన్న భావాన్ని అడుగడుగునా గుర్తు చేస్తూ భారతదేశ సంపదను దోచుకున్నారు.

వారి కుటిల రాజనీతి, కుయుక్తి, చెడుపనులవల్ల భారతీయులకు వారిపట్ల అసహనం కలిగి వైరభావం పెల్లుబికింది. పాలకులకు పాలితుల పట్ల ఉండవలసిన దయ, ఔదార్యం, సానుభూతి ఇంగ్లీషువారిలో లోపించడంవల్ల భారతీయులు వారిపట్ల ద్వేషం పెంచుకొన్నారు. దీనికి తోడు ఇంగ్లీషువారు హిందూ మహమ్మదీయుల మత సంప్రదాయాలను ఖాతరు చేయకుండా గోనూక రాది పశువుల కొవ్వుతో తూటాలు సిద్ధంచేసి, వాటిని ఉపయోగించమని బలవంతం చేశారు. అందుకు సిపాయిలు తిరుగుబాటుచేసి, 1857 సంవత్సరంలో సిపాయి తిరుగుబాటును మొదలు పెట్టారు. ఆ పోరాటాన్నే చరిత్రకారులు మొదటి స్వాతంత్ర్య సమరంగా అభివర్ణించారు.

ఆ తిరుగుబాటులో భారతీయులు తారతమ్యా బేధాలను విస్మరించి ధరాధిపతులతో పాలెగాళ్ళతో స్నేహం పెంపొందించుకొని ఇంగ్లీషు పాలనకు వ్యతిరేకంగా సమరం సాగించారు. స్వాతంత్ర్య సమరం క్రమపంథాలో, సమన్వయ స్వరూపంలో పథకం ప్రకారం జరగలేదు.

భారతీయభాషల స్థానంలో ఇంగ్లీషు, పాఠ్య ప్రధానాంశం కావడంవల్ల, భారతీయులలో ఆధునిక భావాలు, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, పాశ్చాత్య నాగరికత హేతువాద దృక్పథం పెంపొందాలంటే పాశ్చాత్య నాగరికతా వ్యామోహం, పరదేశీ విద్యల పట్ల మోజు పెరగడం భారతీయ యువకు లెందరో ఇంగ్లాండుకు, ఇతర పాశ్చాత్య దేశాలకు ఉన్నత విద్యనభ్యసించడానికి వెళ్లారు.

భారతీయులకు పాశ్చాత్య నాగరికతపట్ల ఆధునిక రాజ్యాంగ తత్వానికి అరవిందుని తోడ్పాటు కలిగినట్లే, పాశ్చాత్యులకు కూడా ఆర్ష సాహిత్యం, నూతన హైందవ నాగరికత, సంస్కృతుల పట్ల ఆసక్తి పెరిగింది. అత్యంత ప్రాచీన నాగరికతగల ఆర్యావర్త దేశంలో ప్రభవించిన ఆర్ష సంప్రదాయాలకు మూలకందమనదగిన వేదాలు, ఉపనిషత్తులు, సంస్కృత సాహిత్యాన్ని ఇంగ్లీషుభాషలోకి అనువదించుకొని, ఐరోపావాసులు హిందువుల సనాతన ధర్మంపట్ల శ్రద్ధాసక్తులు కనబరచారు.

ఇంగ్లీషువారిపాలన ఒక విధంగా భారతీయులలో భావ సమైక్యతకు, సమగ్రతకు, జాతీయ భావాలకు అంకురార్పణ చేసిందనడానికి అవకాశం ఉంది. భారతీయులలో సాంఘిక పునరుజ్జీవనం పాశ్చాత్య నాగరికతా ప్రభావం వల్ల కొత్త పుంతలు తొక్కింది. హిందువులలో కరడు గట్టిన ఛాందసాచారాలను, సంకుచిత నియమనిబంధనలను కూకటివేళ్ళతో పెకలించి, వినూత్న నాగరికతా స్ఫూర్తితో హైందవ ధర్మాన్ని పునర్వికసితం చేయటానికి ఎందరో మహానుభావులు నడుంకట్టి రంగంలో దూకి అహర్నిశలు కృషి చేశారు.

1856-1872 సంవత్సరాల మధ్యకాలంలో భారతదేశంలో 36 గురు

మహాపురుషులు జన్మించారు. వారిలో ప్రఖ్యాత రచయితలు, చరిత్రకారులు, స్వాతంత్ర్య సమరయోధులు, యోగిపుంగవులు, తత్త్వవేత్తలు ఉన్నారు. వారు ఆయా రంగాలలో చేసిన కృషి ఫలితంగా భారతదేశం అనూహ్యమయిన ప్రగతి సోపనాలను అధిరోహించింది.

వారిలో బాలగంగాధర్ తిలక్, సి.వి. రామన్, రవీంద్రనాథ్ ఠాగోర్, లాలాలజపతిరాయ్, జగదీశ్‌చంద్రబోస్, మహాత్మాగాంధీ, వివేకానందుడు అరవిందుడు, జడ్డూనాథ్ సర్కార్ ప్రముఖులు. ఈ ప్రముఖులకు ముందు బహుముఖ ప్రజ్ఞాశాలి, అతులిత మేధా సమన్వితుడు అయిన రాజారామమోహనరాయ్ జన్మించి, నిర్వీర్యమై నిస్తేజంతో పడి ఉన్న భారతీయులను వెన్నుతట్టి లేపారు.

భారతీయుల పునర్వికాసం అత్యధిక సంఖ్యలోగల హిందూ జాతి పునర్వికాసమేనని భావించవచ్చు. ఆదినుండి భారతదేశంలో ఏ ఉద్యమం వ్యాప్తి చెందినా, అది ప్రాథమికంగా ఆధ్యాత్మిక ధోరణిలోనే స్వరూపాన్ని సంతరించుకొన్నదనటం నిర్వివాదాంశం.

మొట్టమొదట బెంగాలు రాష్ట్రంలోనే సాంఘిక పునరుజ్జీవనోద్యమం ప్రారంభమైంది. ఆధునిక భారతాభ్యుదయ పిత రాజారామ్‌మోహన్‌రాయ్ 1772 నుండి 1833 వరకు ఒక్క బెంగాలు రాష్ట్రంలోనేగాక, యావద్భారత దేశంలో సాంఘిక విప్లవాన్ని రగిలించి సఫలీకృతం చేసిన పూర్ణపురుషుడు. తన అసాధారణ మేధాసంపత్తితో, ఆధునిక భావనాపటిమతో, విశాల దృక్పథంతో, పాండిత్యంతో, హిందూమతానికి మచ్చ తెచ్చిన సతీ సహగమన ఛాందసాచారాన్ని చట్టరీత్యా నిర్మూలించి, స్త్రీజాతి సంక్షేమానికి సేవ చేశారు. భారతదేశంలో సంస్కృతానికి బదులు ఇంగ్లీషు బోధనా భాషగా ఉండాలని ఇంగ్లీషు ప్రభుత్వాన్ని మెప్పించి, 1823 ఇంగ్లీషు భాషను యావద్భారత దేశంలో స్థిరపరిచారు.

ఇంగ్లీషు భాష కొంతవరకు శ్వేత జాతి ప్రభుత్వ స్థిరీకరణకు దోహదంచేసినా అది దేశసమైక్యతకు, భావ ప్రకటనా సౌలభ్యానికి చేయూత నిచ్చిందనటంలో అనుమానం లేదు. హిందూ సమాజంలో నెలకొన్న, సంకుచిత మత సంప్రదాయాలను, కులాల కట్టుబాట్లను కూలదోయడానికి 1828 సంవత్సరంలో బ్రహ్మ సమాజాన్ని నెలకొల్పారు. వీరి తరువాత దేవేంద్రనాథ ఠాగోర్, కేశవ చంద్రసేన్ బ్రహ్మ సమాజానికి కొత్త రూపురేఖల నిచ్చి ప్రజల మానసిక వికాసానికి, అభ్యుదయ భావవికాసానికి దోహదం చేశారు.

రాజారామోహనరాయ్ అనంతరం ఉత్తర భారతదేశంలో ముఖ్యంగా పంజాబు, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర ప్రాంతాలలో హిందువుల ను జాగృతం చేసి వారిలో విశాల భావాలను పాదుకొల్పడానికి ఆర్య సమాజ వ్యవస్థాపకులైన స్వామి దయానంద సరస్వతి తన శక్తియుక్తుల ను ధారపోశారు.

1875 సంవత్సరంలో స్వామి దయానంద్ ఆర్య సమాజాన్ని నెలకొల్పి వేదాలను నూతన ఫక్కిలో 'సత్యార్థ ప్రకాశ్' పేర వ్యాఖ్యాన గ్రంథాన్ని రచించి, హిందువులలో జీర్ణించుకుపోయిన మత మౌఢ్యాలను పారద్రోలి, మూర్తి పూజను ఖండించి, కులమతాలను నిరసించి, స్త్రీజాతి వికాసానికి కృషి సల్పిన మహామనిషి, అటు బ్రహ్మ సమాజం, ఇటు ఆర్య సమాజం ప్రభావంవల్ల హిందువులలో జాగృతి వెల్లివిరిసి, సంకుచిత భావాలు చాలావరకు సమసిపోయాయి.

వీరి అనంతరం శ్రీమతి అనీబిసెంట్ భారతదేశం వచ్చి ఇక్కడే స్థిరపడి, దివ్యజ్ఞాన సమాజాన్ని నెలకొల్పి దాని ద్వారా ఆర్యావర్త ఖండంలో అనాది నుంచి నెలకొన్న సనాతన ధర్మ విశిష్టతను, పవిత్రతను, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని ఉగ్గడిస్తూ, మేధావులలో భావసంచలనానికి దోహదం చేయడమేగాక, ఆర్షజాతి నాగరికతా సంస్కృతుల విశిష్టతను ప్రపంచ ఖండాలలో ప్రచలితం చేశారు. శ్రీమతి అనిబిసెంట్ ఆధ్యాత్మిక ప్రబోధంతోపాటు, రాజకీయ రంగంలో కూడా చురుకుగా పాల్గొని 'హోమ్‌రూల్' ఉద్యమానికి సారథ్యం వహించి, తన అసాధారణ వాక్పటిమతో సేవాదీక్షతో దేశవాసులకు నూతన తేజస్సును ప్రసాదించింది.

1836 నుండి 1888 సంవత్సరం వరకు బెంగాలు రాష్ట్రంలో ఆధ్యాత్మిక చైతన్యానికి అంకురార్పణచేసి, ఆ చంద్రార్క పర్యంతం కీర్తి ప్రతిష్టల నార్జించిన మహామనిషి, విభూతి పురుషుడు శ్రీరామకృష్ణ పరమహంస. వీరు అతి సామాన్య కుటుంబంలో జన్మించి, తన ధ్యాన, తపస్సులతో కాళిమాతను ప్రత్యక్షం చేసుకొని, సర్వమత సమన్వయానికి నూతన బాటలు వేసి, యావత్ప్రపంచాన్ని ఉర్రూతలూగించారు.

పరమహంస శిష్యగణంలో అగణితమయిన ఖ్యాతినార్జించిన వివేకానందస్వామి సార్థక నామధేయుడు, చరితార్థుడు. ఈయన పాశ్చాత్య ఫక్కీలో విద్యనభ్యసించిన పట్టభద్రుడు. నాడు బెంగాల్ రాష్ట్రంలో ప్రముఖులందరు పూజ్య శ్రీ పరమహంసగారిని గౌరవించిన వారే. శ్రీరామకృష్ణుని ఖ్యాతిని ఖండాంతరాలకు విస్తరించిన ఘనత వివేకానందస్వామికి చెందుతుంది.

పాశ్చాత్య నాగరికతా స్ఫూర్తిగల వివేకానందుడు శ్రీరామకృష్ణుని చెంత ఆధ్యాత్మిక జ్ఞాన దీప్తిని పొందారు. 1893 సంవత్సరంలో షికాగోనగరంలో జరిగిన సర్వమత మహాసభలో భారతదేశ ప్రతినిధిగా పాల్గొన్నారు. తమ అనిర్వచనీయమయిన వాగ్ధాటితో హిందూ ధర్మ ప్రాశస్త్యాన్ని ఉగ్గడించి, సనాతన ధర్మంలోకల విశిష్టతను విశదీకరించి, సర్వమత సామరస్యంలో గల పరమార్థాన్ని ప్రకటించి పాశ్చాత్యుల గౌరవాదరాలకు పాత్రుడై రాణించారు.

సదృశమయిన ధారణాశక్తి ధీయుక్తులతో పాశ్చాత్య మేధావులే మన్ననల ను పొంది ఐరోపా అమెరికా ఖండాలలో సనాతన ధర్మ ప్రచారం చేస్తూ భారత సంస్కృతిని పాశ్చాత్య దేశాలలో ప్రవేశ పెట్టారు, చాటి చెప్పారు. విదేశాలలో ఎనలేని ఖ్యాతి గడించిన వివేకానందుడు స్వదేశం చేరుకొని శ్రీరామకృష్ణ పాఠాలను దేశం నలువైపులా పాదుకొల్పి ఆధ్యాత్మిక సేవా సంస్కృతుల విద్యా వ్యాప్తికి దోహదం చేసి, మానవసేవయే మాధవసేవయని చాటిచెప్పారు.

ఈ విధంగా పందొమ్మిదో శతాబ్దంలో భారతదేశం సాంఘిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగాలలో పునరుజ్జీవనం పొందడానికి కారణభూతుడైన మహానుభావులలో రాజారామమోహన్‌రాయ్, కేశవచంద్రసేన్, స్వామిదయానంద్, శ్రీమతి అనిబిసెంట్, రామకృష్ణ పరమహంస, వివేకానందస్వామి ప్రథమ గణ్యులు.

1893 సంవత్సరంలో శ్రీ వివేకానందుడు సర్వమత మహాసభలో పాల్గొన్న సంవత్సరంలోనే, శ్రీ అరవిందుడు ఇంగ్లాండు నుండి విద్యాభ్యాసం ముగించుకొని స్వదేశం తిరిగి వచ్చారు. దేశంలో, హిందూమత పునరుజ్జీవనానికి దయానందుడు బోధించిన మతైక జాతీయత, వివేకానందుడ్దుదాటించిన సాంస్కృతిక జాతీయత, శ్రీ అరవిందుడుల్లేఖించిన ఆధ్యాత్మిక జాతీయత భారతీయులను రాజకీయ చైతన్యవంతులను చేసింది. ◆

# మాత, శిశు మరణాల రేటులో మనమెక్కడ!

**ఒక రాష్ట్రంలో వైద్య ప్రమాణాలు ఎలాఉన్నాయో చెప్పేందుకు అక్కడి మరణాల రేటు ప్రామాణికమవుతుంది. అందులోనూ ప్రధానంగా మాతా, శిశు మరణాల రేటు ఆధారంగానే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలు అందే తీరును బేరీజు వేయొచ్చు. ఇటువంటి కీలకమైన ఎంఎంఆర్ ( మాతా మరణాల రేటు), ఐఎంఆర్ (శిశు మరణాల రేటు)లను నియంత్రించడంలో తెలంగాణ చాలా వెనుకబడి ఉన్నది.**

ఉమ్మడి రాష్ట్రంలో వైద్యరంగాన్ని పాలకులు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఈ విషయంలో తెలంగాణ వెనుకబడి ఉన్నట్లుగా రికార్డులు చెప్తున్నాయి. ఈ నేపథ్యంలో మరణాల రేటు తగ్గించాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు కలెక్టర్ల సదస్సులో ఆదేశించడంతో ఆ మేరకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

## సరైన వైద్యసేవలు అందకపోవడంవల్లే ...

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలోని వైద్యరంగం అరకొర నిధులు, మౌలిక వసతులలేమితో కునారిల్లిందనేందుకు మాతా, శిశు మరణాల రేటు ఓ ఉదాహరణ. గర్భిణులకు సరైన పోషకాహారం అందించకపోవడం ఒక కారణమైతే... మారుమూల ప్రాంతాల్లో సరైన వైద్యసేవలు అందకపోవడం వల్ల మాతా, శిశు మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాథమిక, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, వైద్యులు ఇలా అనేక వ్యవస్థలను ఏర్పాటు చేసి, ఈ మరణాల రేటు తగ్గించాల్సి ఉంటుంది. కానీ ఈ మరణాల రేటును పరిశీలిస్తే... పొరుగు రాష్ట్రాల కంటే తెలంగాణ చాలా వెనుకబడి ఉంది.

**మరణాల రేటు తీరు ఇలా...**

*(ప్రతి లక్ష ప్రసవాల్లో మరణాలను బేరీజు వేసుకొని ఈ రేటును నిర్ధారిస్తారు)*

| జిల్లా | మతామరణాల రేటు | శిశు మరణాల రేటు |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 98 | 53 |
| రంగారెడ్డి | 78 | 33 |
| హైదరాబాద్ | 71 | 20 |
| మెదక్ | 90 | 49 |
| నిజామాబాద్ | 79 | 48 |
| ఆదిలాబాద్ | 152 | 48 |
| కరీంనగర్ | 74 | 37 |
| వరంగల్ | 78 | 39 |
| ఖమ్మం | 99 | 45 |
| నల్లగొండ | 90 | 47 |
| రాష్ట్ర సరాసరి | 92 | 39 |
| ఆలిండియా సరాసరి | 167 | 40 |
| కేరళ రాష్ట్ర సరాసరి | 68 | 12 |
| కర్ణాటక సరాసరి | 140 | 32 |
| తమిళనాడు సరాసరి | 90 | 21 |

తెలంగాణ రాష్ట్రంలో మాతా మరణాల రేటు సరాసరి 92 శాతం ఉండగా.. శిశు మరణాల రేటు 39 శాతంగా ఉంది. జిల్లాలవారీగా పోలిస్తే.. ప్రసవ సమయంలో మాతా మరణాలు ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా ఉన్నాయి. శిశు మరణాలు మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. ఇదే విషయాన్ని కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రస్తావించారు. వైద్య ప్రమాణాలు ఎలా ఉన్నాయనేందుకు సూచికగా ఉండే మరణాల రేటును తగ్గించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



ముఖ్యంగా ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. దీంతో ప్రజారోగ్య విభాగం ఈ మేరకు చర్యలకు సన్నద్ధమైంది. ఎలాంటి చర్యలు తీసుకుంటే ఈ మరణాల తగ్గించవచ్చునే దానిపై దృష్టిసారించింది. వీరితోపాటు ఆయా జిల్లాల కలెక్టర్లు కూడా ఈ అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## మెరుగైన స్థానంలో పొరుగు రాష్ట్రాలు..

మాత, శిశు మరణాల రేటులో మన పొరుగు రాష్ట్రాలు మేలు అని లెక్కలు చెప్తున్నాయి. ముఖ్యంగా కేరళలో రెండు అంశాల్లోనూ మరణాల రేటు చాలా తక్కువగా ఉంది. తమిళనాడులోనూ మనకంటే తక్కువగానే మరణాలు నమోదు అవుతున్నాయి. కర్ణాటకలో మతా మరణాల రేటు మనకంటే ఎక్కువగానే ఉన్నా.. శిశు మరణాల రేటు మాత్రం తక్కువగా ఉంది.

ఈ నేపథ్యంలో కేరళ, తమిళనాడు తరహాలో వైద్యరంగం మెరుగు పడాల్సిన అవసరముందని వైద్య నిపుణులు చెప్తున్నారు. అంతేకాదు.. కొన్నిరోజుల కిందట జరిగిన వైద్యారోగ్యశాఖ సమీక్షలోనూ ముఖ్యమంత్రి కేసీఆర్ తమిళనాడులో ప్రభుత్వ వైద్యశాలల పనితీరు బాగా ఉంటుందని అన్నారు. ఈ మేరకు అక్కడి మాదిరిగా ఇక్కడ వైద్య విధానాన్ని రూపొందించాలని కూడా సూచించినట్లు తెలిసింది. ◆

**దళితుల అభివృద్ధి విషయంలో జరిగిన ప్రచారంలో తప్పుందని, వారిలో జీవితాల్లో గుణాత్మక మార్పు రాలేదని ముఖ్యమంత్రి శ్రీ కె.. చంద్రశేఖరరావు అన్నారు. దళితుల కుటుంబాల్లోని దారిద్ర్యాన్ని పారదోలడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను అభివృద్ధి పర్చాలని, దళితులకు భూములు ఇవ్వడమే కాకుండా, వ్యవసాయం చేసుకునే ఏర్పాట్లు కూడా చేయాలని అన్నారు. పేదరికం నుంచి వారు పూర్తిగా బయటపడాలని చెప్పారు.**

కలెక్టర్ల సదస్సులో రెండవరోజు సంక్షేమ శాఖలపై సీఎం సమీక్షించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు దరఖాస్తులను తహసీల్దార్లకే ఇవ్వాలని నిర్ణయించారు. రెండురోజుల్లో పరిశీలన పూర్తిచేసి పెళ్లికి ముందే డబ్బులు ఇవ్వాలని సిఎం చెప్పారు. అనవసర చిక్కులు కలిగించకుండా సరళమైన విధానాలతో పేదలకు సాయం చేయాలన్నారు. రూరల్, సెమీ అర్బన్ దళితులు, ఎస్టీలకు ఇంకా ఏమేం చేయొచ్చో అధ్యయనం చేసి, ప్రభుత్వానికి సూచనలు చేయాలని కోరారు. బంగ్లాదేశ్‌లో యూనస్ అనే అన్నారు. 'జిల్లాల్లో స్టడీసర్కిల్స్ ఏర్పాటు చేయాలి. కలెక్టర్లు, ఎస్పీలు కూడా కొంత సమయం వెచ్చించి, పిల్లలకు బోధన చేస్తే స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. అమ్మాయిలు చదువుకునేందుకు బోధన, వసతి సౌకర్యాలు కల్పించి, ఇంగ్లీష్, హిందీ భాషల్లో కూడా ప్రావీణ్యం సంపాదించేలా విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించాలి' అని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మంత్రులు, అధికారులు త్వరలోనే సమావేశం పెట్టుకుని విద్యార్థులు, యువకులకు ఏమేం చేయాలో సమీక్షచేసి, ప్రతిపాదనలు అందించాలని, కలెక్టర్లు కూడా సూచనలు చేయాలని కోరారు. ఎస్సీ రెసిడెన్షియల్ స్కూళ్లు, జూనియర్ కాలేజీలు మాత్రమే ఉన్నాయని, డిగ్రీ కాలేజీలు లేకపోవడం వల్ల డ్రాప్ అవుట్ అవుతున్నారని చెప్పారు. బాలికల కాలేజీలను ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉందని తెలిపారు.

ఎస్సీలకు బ్యాంకులు లింకేజీ ఇవ్వడం లేదన్న అంశంపై మాట్లాడుతూ దీనిపై కొత్త ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. హాస్టళ్లు, స్టడీ సర్కిళ్లలో సమస్యల పరిష్కారానికి నిర్ణీత సమయం పెట్టుకుని పనిచేయాలని సూచించారు.

# షెడ్యూలు కులాల, మైనార్టీల అభివృద్ధి

ప్రొఫెసర్ చిన్న వర్తకుల జీవన ప్రగతికి చేసిన ప్రయత్నం ప్రపంచవ్యాప్తంగా స్వయం సహాయక బృందాల విప్లవానికి దారితీసిందని తెలిపారు. ఆ విధంగానే కొత్త ఆలోచనలు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ బాధితులకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రతి కలెక్టర్ వద్ద రూ. కోటి నిధి పెడుతున్నామని, దళితుల వ్యవసాయానికి సంబంధించి పెట్టుబడిని విడుదలచేసే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగిస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు 13 వేల కోట్లకుపైగా నిధులు కీలకం అవుతాయని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులు పూర్తిగా ఖర్చు అయ్యేలా చూడాలని ఆదేశించారు.

కలెక్టర్లు, ఇతర అధికారులు దళితవాడలు, గిరిజన తండాల్లో కొంత సమయం గడిపితే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. 'దళిత పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి టీ-ప్రైడ్' అనే కార్యక్రమం తీసుకున్నాం.

ఇంజనీరింగ్ చదివిన ఎస్సీ, ఎస్టీ యువతకు శిక్షణ ఇచ్చి, పెట్టుబడి సమకూర్చి ప్రోత్సహిస్తాం. ఇప్పటికే కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న దళితులకు అనుభవం కూడా ఉంటుంది. వారిని కాంట్రాక్టర్లుగా అభివృద్ధి చేయాలి. ఇండస్ట్రియల్ ఎస్టేట్స్‌లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా నిష్పత్తి ప్రకారం ప్లాంట్లు రిజర్వు చేసి పెట్టాలి' అని సిఎం చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు లోన్లు ఇచ్చే అంశంపై ఆదాయ పరిమితిని, వయస్సు సడలింపుపై వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

పోటీ పరీక్షల కోసం విద్యార్థులను సిద్ధం చేయాలని, తెలంగాణలోనే కాకుండా దేశంలో ఎక్కడైనా, ఉద్యోగాలు పొందేలా శిక్షణ ఇవ్వాలని సీఎం

## ముస్లింలకూ ఉపాధి అవకాశాలు

ముస్లీం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. మైనార్టీల్లో ముఖ్యంగా ముస్లింలలో చాలా పేదరికం ఉందని అన్నారు. ప్రభుత్వ పథకాల్లో ముస్లింలు ఎక్కువ లబ్ధిపొందడం లేదని చెప్పారు. గృహనిర్మాణం, డీఆర్‌డీఏ, ఇతర పథకాల్లో ముస్లింలు చాలా తక్కువగా ఉన్నారని, ఈ పరిస్థితి మారాలని తెలిపారు. ముస్లింల కోసం ఏమేం చేయొచ్చో సమీక్షించి కొత్త పథకాలకు రూపకల్పన చేయాలని కోరారు. మైనార్టీల కోసం ప్రతి జిల్లాలో రెండు రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని, ఇందులో ఒకటి బాలురకు, ఒకటి బాలికల కోసమని అన్నారు. వక్ఫ్ భూముల పరిరక్షణ అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశమని చెప్పారు. భూముల వివరాలు కలెక్టర్లకు పంపుతామని వెల్లడించారు. జీవో 58 కింద వక్ఫ్ భూములు రెగ్యులరైజ్ చేయడానికి వీల్లేదని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను గ్రీన్‌ఛానల్‌లో పెట్టామని తెలిపారు. వక్ఫ్ అంటే దానమని, అలా వచ్చిన భూములను ముస్లింల అభివృద్ధికే వాడాలని చెప్పారు.

సంక్షేమ హాస్టల్లలో అవినీతిని సహించవద్దని, సన్నబియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. పిల్లలకు బ్లాంకెట్లు కొనివ్వాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు వెంటనే కొత్తగ్లాసులు, ప్లేట్లు కొనివ్వాలని ఆదేశించారు. ఎస్పీలు జిల్లాల్లో పర్యటించే సందర్భంలో హాస్టళ్లకు కూడా వెళ్ళి, అక్కడున్న పరిస్థితులను గమనించి సౌకర్యాలు దృష్టి పెంచాలని సూచించారు. నెలలో ఒకరోజు హాస్టల్‌లోనే పెట్టుకుని ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని చెప్పారు. డైట్, కాస్మోటిక్ చార్జీలను అవసరమైన మేరకు పెంచుతామని తెలిపారు.

– ఎన్‌పీఆర్



# తెలంగాణలో అడవుల అభివృద్ధి హరితహారం

**తెలంగాణ రాష్ట్రంలో మొదటి నుంచీ అడవుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శ్రద్ధ కనపరుస్తూ అటవీశాఖ పనితీరు మెరుగుపర్చే దిశగా పలు చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వాతావరణ సమతుల్యాన్ని కాపాడి పర్యావరణాన్ని పరిరక్షించాలంటే అడవుల ప్రగతికి చర్యలు అనివార్యమని గుర్తించి ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం 'హరితహారం' కార్యక్రమానికి రూప కల్పన చేసిన ముఖ్యమంత్రి శ్రీ కెసిఆర్ ఇప్పుడు అటవీశాఖలో ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు.**

తెలంగాణ రాష్ట్ర అటవీశాఖలో దాదాపు అయిదువేల మంది ఉద్యోగ పోస్టులు ఉండగా, వాటిలో వివిధ స్థాయిలో దాదాపు 2700 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉద్యోగుల కొరత, సౌకర్యాల లేమితో కీలక బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేక పోతున్నామని, ఫలితంగా అటవీ సంపదను ఆశించిన స్థాయిలో పరిరక్షించలేకపోతున్నామని రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులు పలు సందర్భాల్లో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.



తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం చాలా తక్కువ విస్తీర్ణంలో ఉన్న అడవుల శాతాన్ని 33కు పెంచాలనే పట్టుదలతో ఉన్న కేసిఆర్ ముందు అటవీశాఖను పటిష్టం చేయాలనే యోచనతో అటవీశాఖ ఉన్నతాధికారులతో పాటు ఆ శాఖ మంత్రి జోగురామన్న సూచనలను పరిగణలోకి తీసుకొని అటవీ శాఖలో ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర అటవీశాఖలో ఖాళీగా ఉన్న 51 ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, 198 మంది ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, 574 మంది బీట్ ఆఫీసర్లు 8, 1184 అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోందని మంత్రి చెప్పారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కొత్త వాహనాలను సమకూర్చడం వల్ల అటవీశాఖ మహర్దశ పట్టడం ఖాయం.

కానీ అడవుల అభివృద్ధికి మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చర్యలు తీసుకోకపోతే మాత్రం సత్ఫలితాలు రావన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పనిభారాన్ని తగ్గించి విధుల ను వికేంద్రీకరించడానికి ఉమ్మడి రాష్ట్రంలో రూపొందించిన 'ఫారెస్ట్ రీ-ఆర్గనైజేషన్' (పునర్వ్యవస్థీకరణ) ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే అది తెలంగాణ రాష్ట్రంలోనైనా అడవుల అభివృద్ధికి దోహదపడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకూ కాగితాలకే పరిమితమైన అడవుల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలకు కేసిఆర్ ప్రభుత్వం బూజు దులిపితే అటవీ సంపదను పరిరక్షించడానికి మంచి అవకాశం లభిస్తుందని అటవీశాఖాధికారులు కూడా భావిస్తున్నారు.

తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఫారెస్టు బీట్, సెక్షన్‌ల పరిధి దేశంలోని మిగిలిన రాష్ట్రాల కన్నా అధికంగా ఉండటం, చాలినంత మంది క్షేత్రస్థాయి సిబ్బంది లేకపోవడం, మారిన పరిస్థితులకు అనుగుణంగా సౌకర్యాలు కలిపించక పోవడం వంటి కారణంగా అడవులు క్షీణదశకు చేరుకుంటున్నాయి. కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో బీట్లు, సెక్షన్లు, రేంజ్‌ల పరిధి ఎక్కువగా ఉంది.

ఒక్కొక్క ఫారెస్ట్ బీట్ పరిధి కర్ణాటకలో 15.81, తమిళనాడులో 5.85, ఛత్తీస్‌ఘడ్‌లో 15.68 చదరపు కిలో మీటర్లుగా ఉండగా మన రాష్ట్రంలో 24.03 చ.కిలో మీటర్లు ఉండటం గమనార్హం. అలాగే ఒక్కొక్క సెక్షన్ పరిధి కర్ణాటకలో 29.33, తమిళనాడులో 10.35, ఛత్తీస్‌ఘడ్‌లో 68.23 చదరపు కిలో మీటర్లు ఉండగా, రాష్ట్రంలో 86.65 చ. కిలో మీటర్లు ఉంది. ఒక్కొక్క రేంజ్ పరిధి కర్ణాటకలో 66.19, తమిళనాడులో 35.91, ఛత్తీస్‌ఘడ్‌లో 213.47 చ.కిలో మీటర్లు ఉండగా, అధికంగా 325.66 చ.కి.మీటర్లుగా ఉంది. పరిధి తక్కువగా ఉన్న పొరుగురాష్ట్రాలలో అడవుల పరిరక్షణ మెరుగ్గా ఉండగా పరిధి ఎక్కువగా ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో రోజురోజుకూ క్షీణిస్తూ అడవుల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నా, క్రమంలో నాటి ఉమ్మడి రాష్ట్రం నేటి రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 2500 బీట్లను 4200లకు 736 సెక్షన్లను 1200లకు, 196 రేంజ్‌లను 330లకు పెంచాలని, సబ్ డివిజన్ల వ్యవస్థను పూర్తిగా తొలగించి చిన్న డివిజన్లుగా మార్చి వికేంద్రీకరించాలన్న ప్రతిపాదనలను ప్రభుత్వం ఆచరణలో పెడితే మంచి ఫలితాలు వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిజానికి జాతీయ అటవీ విధానం ప్రకారం రాష్ట్రం మొత్తం వైశాల్యంలో 33 శాతానికి పైగా విస్తీర్ణంలో అడవుల ఉండాలి. కానీ ప్రభుత్వ గణాంకాల ప్రకారమే తెలంగాణ రాష్ట్రంలో కేవలం 23శాతం మాత్రం అటవీ విస్తీర్ణం ఉంది. ఇందులోనూ ఇప్పటికే చాలా వరకూ అడవులు తగ్గిపోయినట్లు ఫారెస్ట్ శాఖ నివేదికలే వెల్లడిస్తున్నాయి. వాస్తవానికి అత్యంత విలువైన అటవీ సంపద కేవలం 10 శాతం మాత్రమే ఉండటం ఆందోళన కల్గిస్తోంది.

భారతదేశంలో ఒక్క తెలుగు రాష్ట్రాలలోనే అటవీ విస్తీర్ణం అత్యధికంగా తగ్గిపోయినట్లు ఫారెస్ట్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఐఐ) సర్వేలే వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం ఏ మాత్రం ప్రాధాన్యతనివ్వకపోవడం, అటవీశాఖాధికారుల బాధ్యతారాహిత్యం, కలప స్మగ్లర్ల స్వైరవిహారం, పోడు వ్యవసాయం సాకుతో రాజకీయ నాయకుల అండదండలతో అడవులను యధేచ్ఛగా నరికేయడం, జలయజ్ఞం, పలు పారిశ్రామిక ప్రాజెక్టులు, సెజ్‌ల పేరుతో అటవీ భూముల ను లాక్కోవడం, వివిధ రకాల దురాక్రమణలు వంటి చర్యలతో దట్టమైనన కీకారణ్యాలు క్షీణించిపోవడం, దట్టమైన అడవులు పల్చపడటం, అత్యంత విలువైన వన్య ప్రాణులు కనుమరుగుకావడం వంటి పరిణామాలు వేగంగా సంభవిస్తున్నాయి. ఈ ప్రభావం పర్యావరణ సమతుల్యంపై పడి వర్షాభావ పరిస్థితులు చవిచూస్తున్నప్పటికి అడవులను కాపాడుకోవడంలో అధికారులు అలసత్వం చూపుతున్నారు.

ఇలాంటి విషమ స్థితిలో తెలంగాణ రాష్ట్రంలో అడవుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన తక్షణ అవసరం ఉందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ మంత్రి జోగు రామన్నగా అడవుల జిల్లా అయిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వారుకావడంతో ఆయన అడవుల ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారు.



ఇందులో భాగంగానే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే మూడేళ్ల కాలపరిమితిలో దాదాపు 230 కోట్ల మొక్కలు పెంచాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 40 లక్షలు, ప్రతి గ్రామంలో 40 వేల మొక్కలు పెంచే విధంగా ప్రభుత్వం రూపొందించిన ఈ హరిత హారం కార్యక్రమాన్ని వచ్చే జూలై నుంచి ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టింది. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించింది.

ప్రస్తుతం అమలులో ఉన్న అటవీ చట్టాలను కూడా సమూలంగా మార్చే యోచనలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. కర్ణాటక, మహారాష్ట్రాల్లో అమలులో ఉన్న అటవీ చట్టాలను సమీక్షించి వాటి తరహాలో చట్టాలను రూపొందించి అమలు చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోంది. ఇంకా అటవీ సంపదను పరిరక్షించడం కోసం విజిలెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడానికి చర్యలతో పాటు స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు, అక్రమాలను నిరోధించేందుకు ప్రభుత్వం ఇప్పటికే గట్టి చర్యలు చేపట్టింది.

స్మగ్లర్లపై, అక్రమార్కులపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేయాలని, అటవీ సంపదను కాపాడటానికి పెట్రోలింగ్‌ను పెంచి రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించాలని, అటవీశాఖ చెక్‌పోస్టులను మరింత బలోపేతం చేయాలని, అటవీ శాఖలో వైర్‌లెస్, జిపిఎస్ సిస్టంను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది అటవీ ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌ల ను, పర్క్‌లేషన్ ట్యాంకులను ఏర్పాటు చేయడానికి, అడవిలో మంటలను ఆపేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కూడా ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది.

సామాజిక అటవీ విభాగంలో ప్రత్యేకంగా కమిషనరేట్‌ను ఏర్పాటు చేయడం కూడా తక్షణ కర్తవ్యంగా ప్రభుత్వం భావిస్తోంది. కాగా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 23 శాతంగా ఉన్న అటవీ విస్తీర్ణాన్ని 33 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఇన్ని చర్యలతో వేగంగా అడుగులేస్తున్నప్పటికీ రాష్ట్రంలో అడవులు బాగుపడాలంటే అటవీశాఖను కూడా సమూలంగా ప్రక్షాళన చేయడమేకాక పునర్వ్యవస్థీకరణకు పూనుకోవాలన్న అభిప్రాయం వినపడుతోంది.

**- టి.ఎస్.ఓ**



# సాంస్కృతిక పునరుజ్జీవనంలో తెలంగాణ జాతరలు

**జీవ చైతన్యం ఉట్టిపడే సాంస్కృతిక వైవిధ్యం ఉన్నప్రాంతం తెలంగాణ, గ్లోబలైజేషన్ పెనుదాడుల్ని తట్టుకొని నిలబడి వెలుగుతున్న సాంస్కృతిక జీవనం తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకత. తెలంగాణ ప్రాంతమంతటా జరిగే పండుగ బతుకమ్మ, దసరా నాడు పాలపిట్టను దర్శించడానికి వెళ్లే మన సమూహాల్లో కనిపించేది ఒక ఉత్సవ సంరంభం. గ్రామీణ జీవితంలోని జాతరలు, చెట్లకిందికి పోవడం వంటి సందర్భాలు ఈ నేలకే ప్రత్యేకం. చిందు భాగోతం, పేరిణి శివతాండవం వంటి కళా ప్రదర్శనలు సాంస్కృతిక మూలాల ఆవిష్కరణలు.**

హైదరాబాద్ లాంటి రాజధాని నగరంలో జరిగే భోనాలు, పీర్లపండుగ ప్రజల నడుమ ఉన్న సంబంధ బాంధవ్యాలకు ప్రతీకలు. తెలంగాణలోని సమ్మక్క-సారలక్క నాగోబా కేస్లాపూర్ జాతరలు కూడా పచ్చదనానికి, చైతన్య శీతలకీ చిహ్నాలు. జాతరలలో కూడా మత సంబంధమైన సాంస్కృతికత వ్యక్తమైన సందర్భాలు అనేకం ఉన్నాయి. అవి హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని, సంబంధాలను పెంపొందించేలా సాగుతాయి. తెలంగాణ సమాజంలో, సాంస్కృతిక పునరుజ్జీవనంలో జాతరలు సామాజిక జీవితపు సంస్కృతికి ప్రతిబింబాలుగా నిలుస్తాయి.

విశ్వాసానికి, నమ్మకానికి సంబంధించిన జాతరలలో వరంగల్ జిల్లాలలోని మేడారం జాతరే కాక, కొమురవెల్లి మల్లన్న, కురవి వీరన్న, ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరలు, రేగొండ మండలంలోని కోటంచ, గీసుగొండ మండలంలోని కొమ్మాల, మంగపేట మండలంలోని మల్లూరు, పరకాలలోని బుగులోని జాతరలు, హసన్‌పర్తి సమీపంలోని ఎర్రగట్టుగుట్ట జాతరలు ఎంతో ప్రసిద్ధిగాంచినాయి.

అలాగే జిల్లాలో కొత్తగూడ, గూడూరు, మహబూబాబాద్, కేసముద్రం తదితర మండలాల్లో స్థానికంగా ప్రసిద్ధిపొందిన జాతరలు అనేకం ఉన్నాయి. వీటితో పాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని లొద్ది మల్లెల తీర్థం, పిల్లల మర్రి, మన్నెంకొండ జాతరలు, రంగారెడ్డి జిల్లాలోని కీసర గుట్ట, మెదక్ జిల్లాలోని ఏడుపాయాల జాతర, నిజామాబాద్ జిల్లాలోని లింబాద్రి, ఆదిలాబాద్‌లోని కేస్లాపూర్ నాగోబా జాతర, లొద్ది మల్లన్న జాతర, ఖమ్మం జిల్లాలోని తీర్థాల, నల్గొండ జిల్లాలోని లతీఫ్‌షా వలి, జాన్‌పాడు జాతర, మఠంపెల్లి, మేళ్ల చెర్వు, పెద్దగట్టు జాతరలు భక్తికి, ఐక్యమత్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి. దైవ భక్తితో పాటు విశ్వాసానికి, నమ్మకానికి సంబంధించిన జాతరలను గమనిస్తే సాంస్కృతిక పునరుజ్జీవన చైతన్యం కనిపిస్తుంది. ఈ క్రమంలో ముఖ్యంగా తెలంగాణలో సమ్మక్క -సారలమ్మ, నాగోభా జాతరలను ప్రధానంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

## ఆదివాసి గిరిజనుల ఆత్మగౌరవ పతాక మేడారం

ప్రతి రెండేళ్లకోసారి వరంగల్ జిల్లా తాడ్వాయి మండలంలో జరిగే మేడారం జాతర ఆదివాసీ గిరిజనుల ఆత్మగౌరవ పతాకంగా నిలిచింది. మేడారం అనే చిన్న కుగ్రామంలో జరిగే సమ్మక్క -సారలమ్మ జాతరకు ఎంతో విశిష్టత ఉంది. ఆదివాసీ గిరిజనుల శౌర్యానికి, సాంప్రదాయాలకు, కట్టుబాట్లకు నిదర్శనంగా గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా సమ్మక్క - సారలమ్మలు చరిత్రలో నిలిచిపోయారు.

కాకతీయుల కాలంలో 800 ఏళ్ళ క్రితం కరువు కాటకాలతో అల్లాడుతున్న ప్రజల నుండి కప్పం వసూలు చేయడాన్ని వ్యతిరేకించి ప్రజల తరపున ఎలుబడిన సమ్మక్క-సారలమ్మ ఈ ప్రాంతంలో పోరాటతత్త్వం అలవడడానికి కారణమయ్యారు.

కరువు కాటకాల సమయంలో కప్పం ఎందుకు కట్టాలని ఎదురు తిరిగి కాకతీయుల సైన్యంతో పోరాడి నేలకొరిగారు. సమ్మక్క, ఆమె కూతురు సారలమ్మలతో పాటు సమ్మక్క భర్త, కుమారుడు సైతం కాకతీయులతో హోరాహోరీ పోరాడి ప్రజల కోసం ప్రాణాలిచ్చారు. నాటి నుండే ఈ ప్రాంత ప్రజలకు పోరాట వారసత్వం అలవడినట్లు స్పష్టమవుతోంది. నాటి రాచరికపు పెత్తనం నుండి నేటి అప్రజాస్వామిక విధానాలను ఎదురించడం లోనూ ఈ ప్రాంతంలో నిజాం నిరంకుశ పాలనపై, జమిందారుల, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలు, అరాచకాలపై ప్రజలచే సాయుధ పోరాటం జరిగినా, డెబ్బైయవ దశకం నుండి దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా నక్సల్‌బరీ ఉద్యమాలు పుట్టుకొచ్చినా, నేడు రాష్ట్ర ఆవిర్భావం దాకా తెలంగాణలో జరిగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ సమ్మక్క - సారలమ్మల పోరాట స్ఫూర్తే కనిపిస్తుంది.

నాటి నుండి నేటి వరకు వరంగల్ జిల్లాలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నోళ్లలో నిరంతరం సమ్మక్క -సారలమ్మల పేర్లే. వారి పోరాట పటిమ గురించి మాట్లాడని, వాళ్ల త్యాగనిరతిని తలుచుకోని వారే లేరంటే అతిశయోక్తి కాదు. అంతటి స్ఫూర్తివంతమైన మేడారం జాతర నేడు తెలంగాణ ప్రజల జీవితంలో భాగమైంది. గిరిజన సాంప్రదాయాలను క్రమంగా కబలిస్తున్న ప్రస్తుత తరుణంలో సమ్మక్క-సారలమ్మ ఏ మాత్రం భక్తి విశ్వాసాలు సన్నగిల్లలేదు. గిరిపుత్రుల్లో ఉండే పట్టుదల, నమ్మకం, నిజాయితీలకు ఈ జాతరే ప్రత్యక్ష సాక్షి.

నాగరిక ప్రపంచానికి దూరంగా ప్రకృతి అందచందాలతో అలరారే కీకారణ్యం మాఘశుద్ధ పౌర్ణమి వచ్చిందంటే జనారణ్యంగా మారుతుంది. మేడారం ప్రధాన జాతరకు అనుబంధంగా తెలంగాణ జిల్లాలోనూ అనుబంధ జాతరలు జరుగుతాయి. జిల్లాలో దాదాపు నాలుగైదు గ్రామాల కో-జాతరలాగా జరుగుతున్నాయి. సమ్మక్క జాతరకు సంబంధించిన జాతరలు కూడా ఉన్నాయి. బాలకుమారస్వామి జాతర పగిడిద్దా రాజు జాతర, ముసలయ్య జాతర, నూరుగొండయ్య జాతర, నాగులమ్మ జాతర, కార్నేపల్లి జాతర, అన్నారం జాతర, భూపతిపురం జాతర, వేల్పులమ్మ, గుంజెడు ముసలమ్మ జాతర ఈ కోవలోకి వస్తాయి.

## బెల్లమే దేవతలకు నైవేద్యం

సంస్కృతికి ప్రకృతి కలగలిసిన మేడారం జాతరలో గిరిజనుల పూజా విధానం ఆసక్తి కరంగా ఉంటుంది. వారి సాంప్రదాయ పద్ధతుల్లో దేవుళ్లను ప్రతిష్ఠించడమే కాక పూజా విధానంలోనూ వారి ఆచార్య వ్యవహారాలు స్పష్టంగా కనిపిస్తాయి. గుడి నిర్మాణం, పూజార్లు, మొక్కుబడులు, బలులు, మద్యపానం వారి ఆచారం. సంతానంలేని ఆడవాళ్లు జంపన్న వాగులో వరం పడతారు. ఆ వరంచే సంతానం కలిగితే పిల్లలకు దేవత పేరుపెట్టి, మళ్ళీ జాతర సమయంలో పుట్టు వెంట్రుకలు తీయిస్తారు.

మహిళలు తమ మొక్కుబడి ప్రకారం పసుపు, నూనె కలిపిన ఒడిబియ్యంలో తమలపాకులు, ఖర్జుర పండ్లను కొత్త తెల్లటి గుడ్డలో పెట్టి నడుముకు కట్టి జాతరలో అమ్మవార్లకు సమర్పిస్తారు. పురుషులు కోడిపిల్లను దేవతలకు ఎదురుగా వేయడాన్నే ఎదురు కోళ్లు అని పిలుస్తారు. అలాగే కోర్కెలు నెరవేరిన తరువాత సమ్మక్క గద్దెకు పడమరలో కోడెను కట్టడం లాంటి మొక్కులు చెల్లించుకుంటారు.

అన్నిటికంటే ముఖ్యంగా పురుషులు, మహిళలు తమ నిలువెత్తు బంగారం (బెల్లం)ను సమర్పిస్తారు. ప్రతి జాతరకు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యం, తమ ఆరోగ్యం బాగుండాలని, నిలువెత్తు బంగారాన్ని సమర్పించడం, అందులో కొంత అమ్మవార్ల గద్దెలపై వేయడం, మిగిలింది పంచిపెట్టడం చేస్తారు. ఇలా ప్రతీ జాతరలో 150 టన్నుల బెల్లాన్ని



దేవతలకు సమర్పిస్తారు. ఒక్కబెల్లం అమ్మకాలతోనే దాదాపు రెండు నుండి మూడు కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. అలాగే జాతర జరిగిన అన్ని రోజులూ పెద్ద ఎత్తున జంతు బలులతోపాటు మద్యం ఏరులై పారుతుంది.

## గోండుల ఆరాధ్య దైవం నాగోబా

మేడారం తరువాత ప్రముఖమైన జాతర నాగోబా. గోండుల ఆరాధ్య దైవంగా ఆదివాసీలు జరుపుకునే జాతరలలో ప్రముఖమైనదిగా నాగోబాకు గుర్తింపు ఉంది. తెలంగాణలో ఆదివాసీలు జరుపుకునే జాతరలో ప్రముఖమైన నాగోబా.

జాతర చరిత్ర, నిర్వహణ ఆసక్తికరంగా ఉంటుంది. కొండకోనల్లో నివసించే గిరిజనులు తమ జాతి దైవంగా నాగోబాను కొలుస్తారు. దక్కన్ పీఠభూమి గిరిపుత్రులందరికి నాగోబాయే ఆరాధ్యదైవం. ప్రతి సంవత్సరం పుష్యమాసం (జనవరి, ఫిబ్రవరి) అమావాస్య రోజున అత్యంత వైభవంగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలోఈ జాతర జరుగుతుంది.

జాతర సందర్భంగా మేస్రం తెగ గిరిజనులు గోదావరి నది జలాలతో నాగోబాకు అభిషేకం చేసి పూజలు చేస్తారు. ఈ జాతరపై ప్రచారంలో ఉన్న కథ ప్రకారం కొన్ని సంవత్సరాల క్రితం నాగేంద్రుడు మెస్రం కుటుంబానికి చెందిన నాగాయి మోతి, రాణి దంపతులకు కలలో కనిపించి సర్పం రూపంలో జన్మిస్తానని చెప్పాడట. ఆ తరువాత ఈ కల నిజమైందని గిరిపుత్రులు విశ్వసించి కొంతకాలానికి నాగేంద్రుడి తల్లి తన తమ్ముని కూతురు గౌరితో సర్పరూపంలో గల నాగేంద్రుడి వివాహం జరిపిందట. అత్త ఆజ్ఞమేరకు గౌరి భర్త అయిన నాగేంద్రుని బుట్టలోపెట్టుకుని గోదావరి కి పయనం అయినట్లు చెబుతారు.

ప్రయాణం మధ్యలో పాము ఒక చోట ఉడుము రూపంలో కనిపించగా ఆ ప్రాంతం ఉడుంపూర్‌గా, అనంతపురం ధర్మపురి నదిలో గౌరిస్నానం చేస్తుండగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషిగా మారాడట. కాగా నాగేంద్రుడు పేరు ప్రతిష్టలు కావాలో, సాంప్రదాయం కావాలో తేల్చుకోమని కోరగా గౌరి పేరు ప్రతిష్టలు కోరుకుందని దీంతో తిరిగి మనిషి పాముగా మారినట్లు చెప్పుతారు.

గౌరి గోదావరి నదిలో సత్యవతి గుండంలో కలిసిపోయిందని, గౌరి వెంట నాగేంద్రుడు ఎద్దు బండగా మారిందని, తరువాత ప్రతి జంటకు బేటికొరి యాడ్ (నాగోబా సమక్షంలో కొత్త జంటలను కలపడం) తన సన్నిధిలోనే జరగాలని చెప్పి నాగేంద్రుడు కేస్లాపూర్ గుంటలోకి వెళ్లిపోయాడని, కాల క్రమేణా అదే దర్బార్ నిర్వహించడం సాంప్రదాయంగా కొనసాగుతుంది.

అధికారులకు ఈ నాగోబా సందర్భంగా వివిధ తెగలకు చెందిన గిరిజనులు తమ సమస్యలపై విన్నవించుకుంటారు. నాగోబా జాతరలో గొండులు తమ ఆరాధ్యదైవాన్ని దర్శించుకోవడంతోనే కాకుండా తమ సమస్యల పరిష్కారం కోసం కూడా జాతరను వేదికగా చేసుకున్నారు. కాని దశాబ్దాల తరబడి ప్రజా దర్బార్ పేర అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమం వారి సమస్యలను పరిష్కరించలేకపోతున్నది. కాని మీడియా ఆగమనం తర్వాత జాతరకు పకడ్బంది ఏర్పాట్లను చేపట్టడంతో పాటు ప్రచారానికే పరిమితమైన దర్బార్‌ను ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మారేలా చొరవ కన్పించింది.

## పునరుజ్జీవనంలో జాతరల పాత్ర

జానపదుల జీవితాలలో జాతరలు ప్రధాన పాత్ర పోషిస్తాయనడానికి ఇవే నిదర్శనం. మన సమాజంలో పౌరాణిక, రుతు సంబంధమైన పండుగ, గ్రామ దేవతల సంబంధాలతో కూడిన పండుగలతో పాటు వీరవనితలు దేవతల మారిన విశ్వాసాలు, నమ్మకాలు కలిగి ఉండటం మేడారం, కేస్లాపూర్ జాతరల ద్వారా మన ఆచరణలను, సాంప్రదాయాలను తెలియజేస్తాయి. కోయ, గోండు గిరిజనుల ఆచార వ్యవహారాలు, పూజా విధానాలు, దేవతల రూపాలు, పేర్లు మాత్రమే కాక అనేక అంశాలు వారి సంస్కృతికి అద్దం పడుతాయి.

ముఖ్యంగా మేడారం జాతరలో పూనకాలు (శివసత్తులు), ఎదురుకోలు (ఎదురు కోళ్లు), నిలువెత్తు బంగారం (బెల్లం) తూకాలు, కొబ్బరికాయలు, సంతానం కోసం వ్రతం, తొట్టెలు (ఊయలలు), పిట్టలు, కోడెలు కట్టడం, సమ్మక్కకు కంక బియ్యం, జువ్విచెట్టు మహిమ, పవిత్ర బండారి, బలి, మద్యపానం, కుల దేవతా పద్దతి, విత్తనం పండుగ, పొట్ట పండుగ (వెన్ను గట్టి పండుగ), పెద్దల పండుగ (కొత్తల పండుగ), చిక్కుడుకాయ కోత పండుగ, మండ మెలిగే పండుగ, విప్పపువ్వు పండుగ (కోలు కడిగే పండుగ, పచ్చపండుగ లాంటి ఆచారాలు దర్శనమిస్తాయి.



కాగా సాంకేతికత పెరిగి విస్తృత ప్రచారం జరిగిన అనంతరం గడిచిన రెండు దశాబ్దాల కాలంలో మేడారం, కేస్లాపూర్ జాతరలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో గిరిజన ఆచార వ్యవహారాలు దెబ్బతింటాయి. గిరిజనుల కంటే గిరిజనేతరులే అధిక సంఖ్యలో ఈ జాతరలను దర్శించుకుంటున్న నేపథ్యంలో గిరిజనుల మొక్కుబడుల తీరు మారుతున్నది. శాంతిభద్రతల పేరుతో, భారీ జనసంద్రం రాకతో గిరిజనుల వాస్తవ సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతున్నది. మరో వైపు భారీగా తరలివచ్చే జన ప్రవాహం కారణంగా జాతరలు జరిగే గ్రామాలు అస్తవ్యస్తమై అసలైన గిరిజన గ్రామాల రూపురేఖలు మారి పోతున్నాయి.

## ప్రసార మాధ్యమాల ప్రభావం

ప్రచార, ప్రసార సాధనాల సాంకేతిక విప్లవం నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరినీ కలిపి, అన్ని ప్రాంతాల సమాచారాలను, సంఘటనల సమాహారాన్ని పంచుతున్నది.

- టి.ఎస్.ఓ





# ఆర్కిడ్స్ పూల సాగు రైతులకు లాభదాయకం

**సృష్టిలో భగవంతుడు సృష్టించిన అత్యద్భుతమైన పుష్పాలు ఆర్కిడ్స్ కుటుంబంలో దాదాపు 35000 జాతులున్నాయి. మొట్టమొదటిసారిగా వృక్షశాస్త్ర పిత థియెప్రిటన్ ఈ అద్భుతమైన మొక్కలకు 'ఆర్కిడ్స్' అని నామకరణం చేశారు.**

మన భారతదేశంలో దాదాపు 1600 జాతులున్నాయి. వీటిలో 200 జాతులు దక్షిణ భారతదేశంలోను, 800 జాతులు అస్సాంలోను, 1500 జాతులు ఆర్కిడ్ల భూతల స్వర్గంగా కీర్తింపబడే హిమాలయ ప్రాంతంలోని కాలింపాంగ్‌లోను కనిపిస్తాయి.

## ఆర్కిడ్ కట్ ఫ్లవర్ వాణిజ్యం

ప్రస్తుతం ప్రపంచంలో ఆర్కిడ్ కట్ ఫ్లవర్ వాణిజ్యం అనేక మిలియన్ డాలర్లలో సాగుతోంది. అమెరికా, యూరప్‌దేశాల్లో అందమైన సింబిదియం, పాపియోపెడిలియం, కాట్లేయా, ఫలనోప్సిస్ ఆర్కిడ్లకు ఊహించనంత గిరాకి వుంది. సాలీనా అమ్ముడవుతున్నాయి.

## మనదేశంలో లభించే అతిముఖ్యమైన ఆర్కిడ్

జాతులు: ఎరిడెస్ అనే క్టొబిలస్, అరాఖినిస్, అరుండినా, బల్బోఫైలం, కాలంథే, కోయిలోగాని, సింబిడియం, డెండ్రోబియం, పాఫిపెడిలియం, రింబోసైలిస్, వాండా మొదలయినవి. ఇవి మన దేశంలో అస్సాం, మేఘలయ, పశ్చిమ బెంగాల్, కర్నాటక, కేరళ, కాలింపాంగ్, షిల్లాంగ్, త్రివేండ్రం, బెంగుళూరు, యార్కాడ్ ప్రాంతాలు సాగుకు మిక్కిలి అనుకూలమైనవి. మన రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే ఆసక్తి పెరుగుతుంది. డెండ్రోబియం, పెలనోప్సిస్ సాగుకు అవకాశాలున్నాయి.





## ఆర్కిడ్స్‌లో రకాలు

సాధారణంగా ఆర్కిడ్‌లు బహు వార్షికాలు, స్వభావ సిద్ధంగా చెట్ల కొమ్మలపై పెరిగే ఆర్కిడ్లను, ఎపిపైట్‌లని, బండరాళ్ళపై పెరిగే వాటిని లిథోపైటులని, భూమి మీద పెరిగే వాటిని టెర్రస్టియల్ అని పిలుస్తారు. ఫలెనోప్సిస్, వాండా లాంటి మొక్కల్లో కాండం ప్రతి సంవత్సరము పెరుగుతూ, ఆకుల గ్రీవం నుండి పుష్పగుచ్చాలు వచ్చే వాటిని మోనోపడియల్ ఆర్కిడ్‌లు అని కాండం చివర పుష్పగుచ్చంతో పెరుగుదల అంతమైపోయే డెండ్రోబియం సింబిడియా క్లాటియా లాంటి వాటిని సింపోడియల్ ఆర్కిడ్‌లని పిలుస్తారు. ఆర్కిడ్ మొక్కలు తమకాండంలో ఆహారపదార్థాలు, నీరు దాచుకుని ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకుంటాయి.

## ఆర్కిడ్ పూలసాగు

ఆర్కిడ్ మొక్కల్ని తగినంత నీడగల ప్రాంతంలో సాగు చేయాలి. వాణిజ్య పరంగా సాగు చేయాలనుకున్నపుడు ప్రత్యేకించి నిర్మించిన ఆర్కిడ్ దావుస్‌లు లేదా ఆర్కి డేరియాలను నిర్మించాలి. ఈ నిర్మాణాలు ఉత్తర, దక్షిణ దిశలో నిర్మించాలి. పై కప్పుగా చీల్చిన వెదురు బద్దలలో గాని, గ్లాస్, ఫైబర్ గ్లాస్ గాని వాడవచ్చు. ప్రస్తుతం అనేక డిజైన్లలో గ్రీన్ హౌజ్‌లను నిర్మించి, ఆర్కిడ్‌లను సాగుచేయవచ్చు. ఈ గ్రీన్ హౌజ్‌ను ఆర్కిడ్‌నకు తగినంత చెమ్మ, ఉష్ణోగ్రత, వెలుతురు, గాలి వుండేలా నిర్మించాలి.

***గాలి :*** సాధారణంగా సాగేచేసే ఆర్కిడ్‌లు చెట్లపై పెరిగే ఎపిపైట్స్ కాబట్టి వాటి పెరుగుదలకు ఎల్లప్పుడు స్వచ్ఛమైన గాలి వీస్తూ ఉండాలి.

కాబట్టి వీటి సాగుకు నిర్మించాలి షెడ్‌హౌస్ లేదా గ్రీన్‌హౌస్‌లో గాలి వీచే విధంగా నిర్మించాలి. డెండ్రోబియం లాంటి రకాలను కుండీలలో బెంచీలు లేదా మంచాలు మీద పెంచే వీలున్నప్పటికి వాండా ఫలనోప్సిస్, పరిడ్స్‌లాంటి జాతుల్ని వ్రేలాడే వెదురు కుండలలో పెంచటం మంచిది. ఎందుకంటే వాటికి గాలిలో వ్రేలాడే వేర్లుంటాయి. ఆర్కిడేరియా ప్రక్కల రాంబోనెట్‌తో వేస్తే గాలి బాగా ప్రసరిస్తుంది.

*వెలుతురు :* ఆయా ఆర్కిడ్ రకాన్ని బట్టి వెలుతురు ఎంత ఏర్పాటు చేయ్యాల నేది ఆధారపడి వుంటుంది. సాధారణ పరిస్థితుల్లో పాక్షిక నీడలో ఆర్కిడ్‌లు పెరుగుతాయి. కొన్ని రకాలు ముఖ్యంగా ఎక్కువ చల్లని వాతావరణంలో ఆరుబయట కూడా పెరుగుతాయి. వాణిజ్య పరంగా పెంచాలనుకున్నప్పుడు పాక్షిక నీడలో పెంచడం ఉత్తమం.

*ఉష్ణోగ్రత :* కృత్రిమ వాతావరణంలో ఆర్కిడ్‌లను వాణిజ్య పరంగా సాగుచేయాలనుకున్నప్పుడు మంచి పెరుగుదలకు, పూల దిగుబడికి వాటికి కావలసిన ఉష్ణోగ్రత ఏర్పాటు చేయాలి. అకస్మాత్తుగా ఉష్ణోగ్రతలో మార్పులు సంభవిస్తే ఆర్కిడ్‌లు తట్టుకోలేవు. సాధారణంగా ఉష్ణ ప్రాంతాలలో సాగుచేసే ఆర్కిడ్‌లు పగటి, రాత్రి ఉష్ణోగ్రత 10 సెంటిగ్రేడ్ డిగ్రీల తేడా వుంటే బాగా పెరుగుతాయి. 180 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత అనుకూలం.

*ఆర్థత, నీరుపెట్టుట :* వెచ్చని తడి వాతావరణంలో ట్రాపికల్ ఆర్కిడ్‌లు బాగా పెరుగుతాయి. ఆర్కిడ్ హౌజ్‌లలో రాత్రిపూట కనీసం 30 శాతం, పగటిపూట 80 శాతం (తేమ) వుండేలా ఏర్పాటు చేయాలి. ఇందుకోసం నేల మీద 4-6 అంగుళాల ఇసుక పరచి, పైకప్పు నుండి నీటి తుంపర పడేలా మిస్టర్లను ఏర్పాటు చేసిగాని, మధ్యలో నీటి తొట్టిని గాని అమర్చుకోవాలి. మొక్కలకు రోజుకు 2-3 సార్లు వాతావరణం వేడి వున్నప్పుడు నీరు పెట్టాలి. దీని కోసం మంచి ప్రామాణికాలు గల నాజిల్స్ వాడాలి.

కొత్తగా నాటిన మొక్కలకు నీరు కొద్ది మోతాదులో అప్పుడప్పుడు కొత్త వేర్లు ఏర్పడేంత వరకు యివ్వాలి. ఎలాంటి పరిస్థితుల్లో అధికంగా నీరు ఇవ్వకూడదు. వయసు, చలికాలంలో నీటి ఉష్ణోగ్రత 12.8-15.60 సెంటీగ్రేడ్ వుండేలా చూడాలి.

*కుండీలు, కంటెయినర్లు :* ఆర్కిడ్ మొక్కలను చిన్న చిన్న అనేక రంధ్రాలు గల కుండీలలో నాటాలి. చిన్న కుండీలలోనే ఆర్కిడ్‌లు బాగా పూస్తాయని గుర్తుంచుకోవాలి. కుండీలు బాగా గాలి ప్రసరించేవిగా ఉండాలి. ఆర్కిడ్ మొక్కలను ఒక కుండీ నుండి మరో కుండికి ఎక్కువసార్లు మార్చకూడదు. దీనివల్ల నష్టం ఎక్కువగా ఉంటుంది. అవసరమనుకుంటే తప్ప ఆర్కిడ్లను కుండీల నుండి మార్చకూడదు. ఆర్కిడేరియలో నడవడానికి వీలుగా





బెంచీల మధ్య 1-1.2 మీ వెడల్పుదారులు ఉండాలి. బెంచీలను వెదురు, చెక్కపలకలు లేదా కాంక్రీటుతో నిర్మించాలి. ఆర్కిడేరియాలో అంధూరియం, పెరన్ లాంటి ఆకర్షణీయమైన ఆకులు గల మొక్కల్ని పెంచితే ఆర్ద్రత పెరుగుతుంది. లోపల నీటిని పిచికారి చేసే నాజిల్స్ అమర్చుకుంటే మంచిది.

*పై విధంగా ఆర్కిడేరియాలు నిర్మించుకొని క్రింద తెలిపిన ఆర్కిడ్‌లను సాగుచేయవచ్చు.*

1. కాట్టిలియా 2. వాండా 3. డెండ్రోబియం. 4. ఫలినోప్సిస్ 5. రింఖోస్ట్రెలిస్ 6. అనేసిడియం 7. పరిడెస్ 8. అనోక్టోబిలస్ 9. అరక్‌నాన్‌థె 10. సింబిడియం 11. అరుండినా 12. కెలాంథె 13. సక్కోలేబియం 14. ధునియా మొదలైనవి.

*వాణిజ్య పరంగా సాగుకు అనుకూలమైన హైబ్రిడ్ ఆర్కిడ్ రకాలు:*

1. అరాకినిస్ మాగిబహి 2. అరండా-సెల్ఫబౌండ్ 3. డెండ్రోబియం ఫంపాడోర్ - సెల్ఫ్‌బౌండ్ దాల్బర్ - టోమి. సీజర్ 4. వాండా ఎ) మిస్ జాక్విన్ బి) రాల్ బిలుచయా.

***కుండీలను నింపే పద్ధతి :*** ఆర్కిడ్ మొక్కల్ని మట్టి కుండీలలోను కర్రతో చేసిన లేదా వెదురుబుట్టలో పెంచవచ్చు. వాణిజ్యపరంగా కాల్చిన క్లే కుండీలలో పెంచుట మంచిది. బుట్టలలో పెంచడానికి ట్రేపెరన్ కంపోస్ట్ బ్లాకులు శ్రేష్ఠమైనవి. కుండీలకు క్రింద పెద్ద డ్రెయినెజ్ రంధ్రాలుండాలి. అడుగున 1/3 వంతు గ్రావెల్ లేదా ఇటుక ముక్కలు అమర్చాలి. కొందరు పెద్ద బొగ్గు ముక్కలు వాడతారు. నీటిలో తడిపిన ట్రేపెరన్ ఫైబర్‌ను 1.53 అంగుళాల చదరపు ముక్కలు చేసి కుండీలో మిగతా 2/3 భాగం నింపాలి. మొక్క అడుగుభాగం లేదా దుంపటీపెరన్ ఫైబర్‌కు తగలకుండా నాటాలి. 2 సంవత్సరాల తర్వాత కొత్త కుండీలలోకి మార్చాలి. ప్రస్తుతం ట్రీపెరన్ ఫైబర్ స్థానే చెట్టు బెరడు ముక్కల్ని సిఫార్సు చేస్తున్నారు. దాగ్లస్‌పిర్, వైట్ ఫిర్, సిడర్ లేదా పైన్ చెట్ల బెరడు ముక్కల్ని శ్రేష్ఠమైనవి. ఈ ముక్కలను మురిగేనాటి నుంచి వాడాలి.

పోషక పదార్థాలను ద్రవరూపంలో యివ్వడం మంచిది. నత్రజని, భాస్వరం, పోటాషియం 10:12:10 నిష్పత్తిలోను కొద్ది మోతాదులో మాంగనీసు కాల్షియం, మెగ్నీషియం, ఇనుము, బోరాన్, జింక్ యిస్తే పెరుగుదల, దిగుబడి బాగా ఉంటుంది.

*ఎపిఫైటిక్ ఆర్కిడ్స్‌కు సాధారణంగా వాడే రసాయనిక ఎరువుల ద్రవం :*

| | | | |
|---|---|---|---|
| 1 | పోటాషియం నైట్రేట్ | - | 2.63 గ్రా |
| 2. | అమ్మోనియం సల్ఫేట్ | - | 0.44 గ్రా |
| 3. | మెగ్నీషియం సల్ఫేట్ | - | 2.04 గ్రా |
| 4. | మోనోకాల్షియం పాస్ఫేట్ | - | 1.09 గ్రా |

# మెరుగైన వైద్య సదుపాయాలు రోగుల పాలిట వరాలు

**రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దేందుకు కసరత్తు మొదలైంది. ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్‌రావు సమీక్షతో కదిలిన అధికార యంత్రాంగం ఆ దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నది. బోధనాసుపత్రుల్లో పడకల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రతిపాదనలు చేస్తున్నది. ఈ మేరకు అన్ని దవాఖానాల్లో సమగ్రంగా సర్వే చేపట్టి, నివేదిక సమర్పించాల్సిందిగా వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థకు ఆదేశాలు జారీ అయ్యాయి.**

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వంద పడకల వైద్యశాలలకు ప్రణాళికలు తయారవుతున్నాయి. హైదరాబాద్‌లోని బోధనాసుపత్రుల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క వైద్యశాలలోనూ ఇన్‌పేషంట్ల తాకిడికి అనుగుణంగా పడకల సామర్థ్యం లేదు.

తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా సీమాంధ్రతోపాటు కర్ణాటక, మహారాష్ట్రలోని నాందేడ్ తదితర ప్రాంతాల నుంచి కూడా హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు రోగులు వస్తున్నారు. ముఖ్యంగా గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, నిమ్స్‌కు వచ్చే రోగులకు, ఉన్న పడకలకు ఏమాత్రం పొంతనలేదు. ఉదాహరణకు... గాంధీ హాస్పిటల్‌లో పేరుకు 1600 పడకలైనప్పటికీ దాదాపు రెండు వేల మందికిపైగా నిత్యం ఇన్‌పేషంట్లు ఉంటారు. ఉస్మానియాలోనూ రికార్డుల్లో ఉన్న పడకల కంటే ఎక్కువస్థాయిలో రోగులు వస్తుంటారు. మరోవైపు చిన్నారుల దవాఖాన అయిన నిలోఫర్‌లో కూడా ఒక్కో పడకపై ఇద్దరు, ముగ్గురు చిన్నారులను ఉంచిన సందర్భాలు అనేకం.

ఈ క్రమంలో ఎన్నో ఏండ్లుగా పడకల సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరముందని వైద్య నిపుణులు చెబుతున్నా.. ప్రభుత్వాలు పట్టించుకోలేదు. పడకల సంఖ్యకు అనుగుణంగానే మౌలిక వసతులు, మందుల కేటాయింపు ఉంటుంది. సామర్థ్యానికి మించి వచ్చే రోగులకు వైద్యులు సేవలు అందిస్తున్నా.. మందులు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు సరి పోకపోవడంతో ఉన్న వాటితోనే సర్దుబాటు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వైద్యశాలల్లో పడకల సామర్థ్య పెంపునకు ఆదేశించారు.

### ప్రతివైద్యశాలలో సర్వే చేపట్టనున్న హెచ్ఎంఐడీసీ అధికారులు

కేసీఆర్ ఆదేశంతో అధికారులు రంగంలోకి దిగారు. వైద్యవిద్యాశాఖ నుంచి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్, వరంగల్ ఎంజీఎం, నిజామాబాద్, ఆదిలాబాద్‌ల్లోని రిమ్స్ దవాఖానల్లో పడకల సామర్థ్యాన్ని పెంచేందుకు సర్వే చేపట్టాల్సిందిగా సూచించారు.

ప్రస్తుతం ఆస్పత్రి భవనాలు ఎలా ఉన్నాయి, పడకలను పెంచేందుకు స్థలం అందుబాటులో ఉందా, పక్కన ఖాళీ స్థలం అందుబాటులో ఉందా, నూతన భవనాల నిర్మాణాన్ని చేపట్టాల్సిన అవసరముందా.. ఇలా అన్ని కోణాల్లో సర్వే నిర్వహించి, సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా సూచించారు. ఈ మేరకు హెచ్ఎంఐడీసీ అధికారులు త్వరలో అన్ని ఆస్పత్రుల్లో సర్వే ప్రక్రియ చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ◆

---

| | | | |
|---|---|---|---|
| 5. | కాల్షియం సల్ఫేట్ | - | 4.86 గ్రా. |
| 6. | ఫెర్రస్ సల్ఫేట్ | - | 0.50 గ్రా. |
| 7. | మాంగనీసు సల్ఫేట్ | - | 2.5 మి.లీ. |
| 8. | నీరు | - | 4 లీటర్లు |

పై మిశ్రమాన్ని సగం మోతాదులో వాడాలి. ఈ మాధ్యమాలు (మిశ్రమం) కొద్దిగా అమ్లత్వంగాని, తటస్థంగా గాని ఉండాలి.

### ఆర్కిడ్‌లను ఆశించే తెగుళ్ళ నివారణ

**ఆకుపచ్చ :** ఇది కొలెటోట్రైఖమ్ మరియు గ్లొయో స్పోరియం అనే శిలీంధ్రాల వల్ల వస్తుంది.

**ఆకు మాడు తెగులు :** ఇది పిథియన్ అనబడే శిలీంధ్రాల వల్ల వస్తుంది.

**కాలర్ బీచ్:** ఇది పెన్సిలియమ్ థోమి అనే శిలీంధ్రం వల్ల వస్తుంది.

**మొదలు కుళ్ళు తెగులు:** స్క్లీరోషియం అనే శిలీంధ్రం వల్ల ఈ తెగులు వస్తుంది.

**వైరస్ తెగుళ్ళు :** దాదాపు 32 వైరస్ తెగుళ్ళు నమోదు చేయబడ్డాయి. తెగులు సోకిన మొక్కలన్నీ నాశనం చేసి వ్యాప్తిని అరికట్టాలి.

పై తెగుళ్ళను కార్బండిజమ్, కాప్టాన్ మాంకోజెబ్ లాంటి శిలీంధ్ర నాశకాలను ఉపయోగించి నివారించవచ్చును.

**పురుగులు:** ఆర్కిడ్‌లను సాధారణంగా థ్రిప్స్, పేను, స్పైడర్‌మైట్, సాఫ్ట్‌స్కేల్స్, పిండి పురుగులు, ముక్కు పురుగులు, నత్తలు ఎక్కువగా ఆశిస్తాయి. వీటి మూలథియాన్, రోగార్, ఎండోసల్ఫాన్ లాంటి మందుల ను పిచికారి చేసి అరికట్టవచ్చును.

*- ఎం. మొఘులయ్య, ఎం.పి.డి.ఓ. (రిటైర్డ్)*

**మన దేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతున్నా, ఇంకా మనలోనూ, గ్రామీణ ప్రాంతాలలో నివశిస్తున్న ప్రజలలో మూఢనమ్మకాలు అనేవి అలానే వున్నాయి.**

ఈ 21వ శతాబ్దంలో కూడా గ్రామీణ ప్రజలు బాణామతి (చేతబడి)ని నమ్ముతున్నారంటే అతిశయోక్తి కాదేమో?. గ్రామీణ ప్రజలు వీటి గురించి ఎక్కువ భయాందోళనకు గురి అవుతున్నారు. ఎందుకంటే చేతబడి చేసి వారిని ఎక్కడ చంపేస్తారనే భయం ఎక్కువగా వుంది. వీరిలోని భయాన్ని కొంతమంది సొమ్ము చేసుకోవడానికి ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తూ వారిని నమ్మిస్తుంటారు. అసలు ఇలాంటి 'బాణామతి' అనేది ప్రపంచంలో ఎక్కడా జరగవు. బాణామతి అనేది లేనే లేదు. ఇది పచ్చి అబద్ధం. ఉన్నదల్లా వారిలోని శారీరక, మానసిక వ్యాధులే. ఇది ఒక రకమైన మాస్ హిస్టీరియా.

మన రాష్ట్రంలో కొంతమంది అమాయకులను, మతి స్థిమితం లేని వాళ్లను రాళ్లతో కొట్టి, సజీవదహనం చేసి చంపుతున్నారు. ఇట్లాంటి సంఘటనలు గ్రామాలలో సర్వసాధారణమైపోయాయి.



జరుగుతుంది. ఇలాంటి వ్యాధులకు గురైన వారు డాక్టరు దగ్గర కంటే, భూతవైద్యుని దగ్గరకు ఎక్కువగా వెళుతున్నారు.

ఇలా చూస్తూపోతే మన రాష్ట్రంలోని మారుమూల గ్రామాలలో ఎంతో మంది ఈ బాణామతి భయంతో చాలా బాధలు పడుతున్నారు. వైద్య శాస్త్రం అభివృద్ధి చెందిన నేటి కాలంలో కూడా కొంతమంది మోసగాళ్లు

# బాణామతి (చేతబడి)

## ఒక మూర్ఖపు నమ్మకం

గ్రామాలలో ఈ బాణామతి భయం ఎంత తీవ్రంగా వుందో క్రిందటి నెలలో నిజామాబాద్ జిల్లాలో ఒక మతి స్థిమితం లేని మహిళను గ్రామస్థులు చేతబడి చేసే ఆమె అని భావించి అపనమ్మకంతో అతి దారుణంగా రాళ్లతో కొట్టి క్రింద పడవేసి ఆమెపైబడి రాక్షసత్వంతో ఆమె పళ్లను పీకేశారు. చివరకు ఆమె రెండురోజులు మృత్యువుతో పోరాడి మరణించింది. సభ్యసమాజం తలదించుకునే సంఘటన ఇది.

ఎక్కడో మారుమూల గ్రామంలో జరిగిన ఇలాంటి సంఘటనే కాకుండా మన రాజధాని నడిబొడ్డున గల పాతబస్తీలో కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతుండటం వల్ల ప్రజలలో ఈ మూఢనమ్మకాలపై ఎలాంటి భావనవుందో అర్థంచేసుకోవచ్చు.

వీటికి ప్రధాన కారణం గ్రామీణ ప్రజలలో నిరక్షరాస్యత, అవగాహనలేమి, వైద్య సదుపాయాలు సరిగ్గా లేకపోవటం, మూఢనమ్మకంతో, వారికి కలిగే జబ్బులన్నీ బాణామతి కారణంగానే వస్తున్నాయని భావించటం



'బాణామతి' పేరుతో తాయెత్తులును, యంత్రాలను అమ్ముతూ అమాయకపు ప్రజలను మోసం చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు.

క్షుద్ర విద్యలున్నాయని, అతీత శక్తులతో ఇతరులు ఎవరో తమకు కీడు చేస్తున్నారని, అందుకే తాము అలా అయిపోతున్నామనే భయం గ్రామీణ ప్రజలలో తీవ్రంగా వుంది. ఈ బాణామతి తమకు ఆవహించిందని ప్రవర్తించే వారిలో 90% మంది స్త్రీలే. దీనిని బట్టి చూస్తే స్త్రీల పరిస్థితి గ్రామాలలో ఏ విధంగా వుందో ఊహించవచ్చు.

గ్రామాలలో కొంత మంది, క్షుద్రశక్తులను పోగొట్టి, బాణామతి ప్రభావాన్ని అరికడతామని అమాయకపు ప్రజలను మభ్యపెట్టి వేలాది రూపాయలను వసూలు చేస్తున్నారు. అలాగే కొంత మంది కులపెద్దలు/ గ్రామ పెద్దలు సాముదాయక జరిమానాలను అమాయకపు ప్రజలపై విధించి దానిని వారి స్వార్థానికి వాడుకుంటున్నారు. వీరే కాకుండా భూత, ప్రేతాత్మలను ప్రారద్రోలడానికని సాధువులను -సన్యాసులను పిలిపించి క్షుద్రపూజలంటూ గ్రామస్థులను నమ్మిస్తున్నారు. నేటి సమాజంలో ఇలాంటి మోసగాళ్లు ఎక్కువ మంది తయారవుతున్నారు.

ప్రాచీన కాలం నుంచి గ్రామ కక్షలకు, ప్రత్యర్థులపై కక్ష తీర్చుకోవడానికి 'బాణామతి' అనేది ఒక సాధనంగా వాడుకుంటున్నారు. కొంతమంది అమాయకులను చిత్రహింసలకు గురిచేసి చంపివేస్తున్నారు. దీని వల్ల పచ్చని ప్రశాంతమైన గ్రామీణ వాతావరణం పాడవటమే కాకుండా శాంతి భద్రతలు కూడా ఒక సమస్యగా మారింది.

# సామాజిక ప్రగతి సూచిక- భారతదేశ స్థానం

**ఆర్థికాభివృద్ధి అనేది అసలైన అభివృద్ధిగా ప్రచారమవుతున్న ఈ కాలంలో వివిధ దేశాలు సామాజికంగా ఎంత వెనుకబడ్డాయో తాజా సామాజిక ప్రగతి సూచిక (ఎస్పీఐ) బట్టబయలు చేసింది. 21వ శతాబ్దం మనదే అంటూ చెప్పుకుంటున్న భారత్ అసలు స్థానం బంగ్లాదేశ్, నేపాల్ కన్నా కింద -101వ స్థానంలో ఉన్నదని ఈ సూచిక ద్వారా వెల్లడైంది.**

మానవుల కనీస అవసరాలు, సంక్షేమ పునాదులు, అవకాశాలు అనే మూడు అంశాల ప్రాతిపదికగా ఈ సూచికను తయారు చేశారు. ప్రజలకు పోషకాహారం, నీటి పారిశుద్ధ్యం, వ్యక్తిగత భద్రత, ఆవాసం కనీస అవసరాల కింద పరిగణిస్తారు. కనీస పరిజ్ఞానం అందుబాటు, ఆరోగ్యం, సంక్షేమం, సమాచార వసతి, పర్యావరణం - సుస్థిరాభివృద్ధి ప్రాతిపదికలుగా రెండవ అంశమైన సంక్షేమ పునాదులను గుర్తిస్తారు. వ్యక్తిగత స్వాతంత్ర్యం, ఎంపిక స్వేచ్ఛ, హక్కులు, ఉన్నత విద్య అందుబాటు, సహనం, కలుపుగోలుతనం ప్రాతిపదికలుగా మూడవ అంశమైన అవకాశాలను నిర్ధారిస్తారు.

ఈ ప్రాతిపదికల ప్రకారం భారత్ పరిస్థితి దిగువలో ఉన్నది. సామాజిక భిన్నత్వానికి నిలయమైన భారత్ 'కలుపుగోలుతనం' ప్రాతిపదికలో 128వ స్థానంలో ఉండడం ఆలోచించవలసిన విషయం. ఆరోగ్యం, సంక్షేమంలో 120 స్థానంలో ఉన్నది. కనీస పరిజ్ఞానం అందుబాటులో 94వ స్థానంలో ఉన్నది. కొన్ని అంశాలలో చుట్టు ఉన్న చిన్న దేశాల కన్నా, మిగతా బ్రిక్స్ దేశాలతో పోల్చినా భారత్‌స్థానం అడుగున ఉన్నది. ప్రపంచాన్ని ఒక్కసారి కాదు, అనేక సార్లు నాశనం చేయగలిగే అణ్వస్త్రాలు అమెరికా దగ్గర కుప్పలుగా ఉండవచ్చు. ఆర్థిక రంగంలోనూ అగ్రరాజ్యమే. కానీ సామాజిక ప్రగతిలో మాత్రం ఈ దేశం 16వ స్థానంలో ఉన్నది. ఆయుర్దాయంలో 30వ స్థానంలో, పిల్లల ప్రాణాలు కాపాడడంలో 38వ స్థానంలో, బాలింతల మరణాలు నిరోధించడంలో 55వ స్థానంలో ఉన్నది. ఆత్మహత్యల నిరోధంలో 80వ స్థానంలో ఉన్నది. విద్యారంగ సమానత్వంలో 38వ స్థానంలో ఉన్నది.

సామాజిక పురోగతిలో నార్డిక్ దేశాలదే అగ్రస్థానం అనేది మరోసారి ధ్రువపడింది. నార్వే, స్వీడన్, డెన్మార్క్, ఫిన్‌లాండ్ ప్రధాన నార్డిక్ దేశాలు. ఈ సారి సామాజిక ప్రగతి సూచికలో మొదటి స్థానం నార్వే దేశానిది, రెండవ స్థానం స్వీడన్‌ది. ఫిన్‌లాండ్ ఏడవ స్థానంలో నిలిచింది. డెన్మార్క్ ఆ తరువాత స్థానంలో ఉన్నది. నార్డిక్ దేశమే అయిన ఐస్‌లాండ్ నాలుగవ స్థానంలో ఉన్నది.

ఈ నార్డిక్ దేశాలు మొదటి పది స్థానాలలో ఎక్కడైనా ఉండవచ్చు. అయినప్పటికీ ఈ దేశాలలో అమలవుతున్న విధానాలు గమనార్హమైనవి. ఈ దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నప్పటికీ, ఆ పరిధిలోనే సంక్షేమ విధానాలను అద్భుతమైన రీతిలో అమలు పరుస్తున్నాయి. ప్రజాస్వామిక సంస్కృతి వెల్లివిరుస్తున్న దేశాలకు ఉదాహరణగా వీటిని చూపవచ్చు. వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక దొంతరలలో ఇరవయ్యవ శతాబ్దంలో పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయ ప్రయోగాలు పెద్ద ఎత్తున జరిగాయి, విఫలమయ్యాయి.

కానీ పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలోనే సంక్షేమ రాజ్య విధానాలను నార్డిక్ దేశాలలో గమనించవచ్చు. సామాజిక ప్రగతి లోనూ ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచాయి. నార్డిక్ దేశాలన్నింటిలో ఒకే తీరు విధానాలు లేవు. తమ పరిస్థితులకు అనుగుణంగా ఒక్కో దేశం తమ విధానాలను రూపొందించుకున్నది. ఏ సమాజమైనా దేశకాల పరిస్థితులను బట్టి మార్గనిర్దేశనం చేసుకోవలసిందే. ◆

అందుకని ఇలాంటి సంఘటనలు జరగకుండా, బాణామతి గురించి యదార్థం తెలియ చెప్పి, ప్రజలలో చైతన్యం పెంపొందించడానికి ప్రభుత్వం, పోలీస్ శాఖవారు మరియు స్వచ్ఛంద్ధ సంస్థలు ముందుకు రావాలని కోరుకుందాం.

శారీరక, మానసిక రోగులకొరకు వారి రోగాలను నయం చేసేందుకు వైద్య బృందాలను, సైకియాట్రిస్టులను గ్రామాలలోకి పంపి వారి జబ్బులను నయం చేయగలిగితే ఇలాంటి మూఢనమ్మకాలను కొంతమేర అరికట్టవచ్చు.




ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా వుందని అలాంటి దిశగా ప్రభుత్వం మరిన్ని అవగాహనా కార్యక్రమాలను గ్రామాలలో ఏర్పాటు చేసి వాటిని ఖచ్చితంగా అమలు చేసినట్లయితే ఇలాంటి మూఢనమ్మకాల నుంచి ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దినవారవుతారు. అలాగే ఇలాంటి వాటిని రెచ్చగొట్టే వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. విద్యావంతులైన యువత మరియు భారత నిర్మాణ్ వాలంటీర్లు ముందుకు వచ్చి గ్రామాలలో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. అలాంటప్పుడే ఇలాంటి మూఢనమ్మకాలనేవి వ్యాప్తిచెందవు.

బాణామతిని నమ్మకండి, మంత్రగాళ్ల మాయ మాటలకు మోసపోకండి........మంత్రగాళ్లు అనే అనుమానంతో అమాకపు ప్రజలను చిత్రహింసలకు గురిచేయకండి.....వారి ప్రాణాలను తీయకండి......విజ్ఞత, ఇంగిత జ్ఞానంతో పనిచేయండి.


**- డా॥.కె. నాగేశ్వర రావు**

*రీసెర్చ్ అసోసియేట్, సి.డి.యస్ - టి.యస్.ఐ.పి.ఎ.ఆర్.డి.*




# బాలల విద్యాహక్కులు - నేటి స్థితి

**బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం 2010 ఏప్రిల్ 1న అమలులోకి వచ్చింది. 6-14 సంవత్సరాల మధ్య వయస్సులో ఉన్న బాలలందరికీ విద్యను అందించే సంకల్పంతో యూపీఏ ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టం బాలల జీవితాల్లో విప్లవాత్మక మార్పు తీసుకువస్తుందని ఆనాటి మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి అన్నారు. ఆ చట్టంలోని ప్రధానాంశాలను ఆయనిలా సంగ్రహించారు.**

విద్య ఉచితంగా అందించబడుతుంది. చట్టం అమలు తేదీ నుంచి ఎలాంటి క్యాపిటేషన్ ఫీజులు, అదనపు రుసుములు చెల్లించనవసరం లేదు. నిర్బంధ విద్యను అందించడం రాజ్య వ్యవస్థ బాధ్యత. రాజ్యాంగ విలువలతో కూడిన పాఠ్య ప్రణాళిక శిక్షణ పొందిన టీచర్లు మాత్రమే బడులలో కొనసాగుతారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ ఇకపై సకల వసతులు కలిగివుంటాయి. ప్రైవేటు పాఠశాలలో సామాజిక బాధ్యతలలో భాగంగా ఒకటవ తరగతి నుంచి 25 శాతం రిజర్వేషన్లు ఉంటాయి.

పిల్లల సంరక్షణ, పిల్లలు పాఠశాలల్లో చేరే విషయమంలో నియమ నిబంధనలు సడలింపు. పౌరసంఘాల పాత్రకు చట్టబద్ధత, పిల్లలపై పరీక్షల ఒత్తిడి తొలగింపునకు చర్యలు. ఈ చట్టంలోని అంశాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు 6 నెలల నుంచి 5 సంవత్సరాల వరకు



గడువునిచ్చారు. ఈ గడువు 2015 మార్చి 31తో ముగిసింది. చట్టం నిర్దేశించిన ప్రకారం బాలలకు విద్యనందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని చెప్పక తప్పదు. పైన పేర్కొన్న పది అంశాల అమలుతీరును లోతుగా పరిశీలిస్తే ఈ వాస్తవం మనకర్థమవుతుంది.

బాలల విద్యాహక్కు చట్టం చేసి ఐదేళ్ళు గడిచిపోయాయి. 6-14 సంవత్సరాల బాలలందరికీ ప్రాథమిక విద్య పూర్తి చేసే వరకు ఉచిత నిర్బంధ విద్య పొందేహక్కు ఉంటుంది. వయసుకు తగిన తరగతులలో చేర్చుకున్న బాలలకు తోటివారితో సమానంగా ఉండడానికి సిఫారసు చేసిన కాలపరిధిలో ప్రత్యేక శిక్షణ పొందే హక్కు కలిగివుంటారు.

కానీ ఆవాస ప్రాంతాలలో పాఠశాలలు అమలులోకి వచ్చినప్పటికీ ఉపాధ్యాయుల కొరత, వసతుల కొరత మొదలైన మౌలిక సదుపాయాలు లేక వేలాది పాఠశాలలు ఈ చట్టంలో చెప్పినట్లుగా ప్రభుత్వాలు తమపై వేసుకున్న బాధ్యతలను నిర్వర్తించడం లేదు. వయసుకు తగిన తరగతులలో చేర్చుకుని తోటి బాలలతో సమానంగా ప్రత్యేక శిక్షణలు ఇవ్వడమనే ప్రక్రియ ఏ ఒక్క పాఠశాలలో కూడా అమలు కావడం లేదు. కారణాలు అనేకం సూచించవచ్చు. కానీ విద్యాహక్కు అమలు కావడం లేదనేది నిర్వివాదం.

అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలను తమ భావజాలాన్ని పాఠ్యప్రణాళికలలో జొప్పించకుండా నిరోధించడానికి ఈ చట్టంలో రాజ్యాంగ విలువలతో కూడిన పాఠ్య ప్రణాళికలను మాత్రమే రూపొందించాలని నిర్ణయించారు. తదనుగుణంగా మన రాష్ట్రంలో పాఠ్య ప్రణాళికలను మార్చారు. మారిన పాఠ్య ప్రణాళికలను తరగతి గదిలో ఉపయోగించేందుకు ఉపాధ్యాయులను ఒప్పించడానికి చేసిన ప్రయత్నాలు ఆశించిన మేర ఫలించలేదనేది క్షేత్రస్థాయి విద్యా వ్యవస్థను పరిశీలిస్తే అర్థమవుతుంది. ఇక ప్రైవేటు యాజమాన్యాలు అనుసరించే పాఠ్య ప్రణాళికలపై ప్రభుత్వాలకు ఏమాత్రం నియంత్రణ లేదనే విషయం తెలిసిందే.

బాలల విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చిన ఐదు సంవత్సరాలలో దేశమంతా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మాత్రమే ఉండాలి. ఈ అంశంలో కూడా చట్టం ఇచ్చిన ఐదేళ్ళ వెసులుబాటుని నిర్లక్ష్యం చేశారే తప్ప ఈ దిశగా స్పష్టంగా అడుగులు వేయలేదు. ఈ



# వాటర్ గ్రిడ్

**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకానికి కేంద్రప్రభుత్వరంగ సంస్థ హడ్కో 'ఉత్తమ డిజైన్' పురస్కారం అందజేసింది. హడ్కో 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 27.4.2015 ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి శ్రీ వెంకయ్యనాయుడు నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి శ్రీ కె. తారకరామారావు ఈ అవార్డును అందుకున్నారు.**

ఈ సందర్భంగా హడ్కో ఛైర్మన్ రవికాంత్ ప్రసంగిస్తూ, ప్రతి ఇంటికీ నల్లాల ద్వారా రక్షిత తాగునీటిని అందించాలనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన ఆదర్శనీయమని ప్రశంసించారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇలాంటి పథకం తలపెట్టలేదని వ్యాఖ్యానిస్తూ ఈ ప్రాజెక్టు అమలుకు హడ్కో పూర్తిస్థాయిలో సహాయ సహకారాలను అందజేస్తుందని హామీ ఇచ్చారు. ఈ పథకానికి హడ్కో రుణం అందించే అవకాశం ఉందని తెలిపారు.

**2022 నాటికి అందరికీ ఇండ్లు...**

ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ 2022 కల్లా దేశంలోని ప్రతి ఒక్కరికీ గృహవసతి కల్పించాలని కేంద్రం నిర్ణయించిందని చెప్పారు. ఇప్పటికే రెండు కోట్ల ఇండ్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, అదనంగా మరో నాలుగు కోట్ల ఇండ్ల నిర్మాణానికి కూడా తగిన సమయంలో ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. సహకరించామని కోరారు.

భారీగా ఆర్థిక వనరులు అవసరమయ్యే ఈ ప్రాజెక్టుకు ప్రైవేటు సంస్థల పెట్టుబడులతో పాటు విదేశీ ప్రత్యక్షపెట్టుబడులు కూడా అవసరమవుతాయని చెప్పారు. రియల్ ఎస్టేట్ రంగంలో సరళీకరణ జరపడం ద్వారా పేదలకు తక్కువ ఖర్చుతో ఇండ్ల నిర్మాణం అందుబాటులోకి తేగలమని చెప్పారు. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతున్నారని, సామాన్యులు ఇండ్ల నిర్మాణానికి తక్కువ వడ్డీకి రుణాలు కావాలని ఆశిస్తున్నారని చెప్పారు. ◆

విషయమై న్యాయస్థానాలు పలు సందర్భాలలో ప్రభుత్వాలకు సూచించాయి.

విద్యాహక్కు చట్టంలోని అన్ని విషయాల కంటే ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై దేశవ్యాప్తంగా పెద్ద చర్చే జరిగింది. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అన్ని స్థాయి కోర్టులను ఆశ్రయించి చివరకు సుప్రీంకోర్టుకు కూడా వెళ్ళి చట్టంలోని ఈ అంశం తమ హక్కులను ఎలా కాలరాస్తుందో ధర్మాసనానికి విన్నవించుకున్నారు. అటు కేంద్రప్రభుత్వ వాదనలు కూడా విన్న కోర్టు తీర్పును ప్రభుత్వ పక్షాన వెలువరించింది.

చట్టంలో పొందుపరిచిన విధంగా ఒకటవ తరగతిలోని విద్యార్థుల సంఖ్యలో 25 శాతం సీట్లను పరిసర ప్రాంతాలకు చెందిన బలహీన వర్గాలు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న కుటుంబాల పిల్లలకు కేటాయించి ప్రాథమిక విద్యను పూర్తిచేసేంత వరకు ఉచిత నిర్బంధ విద్యను అందచేయాలి. ఈ పిల్లల ఫీజులు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి బాలుడు/ బాలికపై చేస్తున్న సగటు మొత్తాన్ని లేదా పాఠశాల ఫీజు ఇంతకన్నా తక్కువ అయితే ఆ రుసుమును యాజమాన్యానికి చెల్లించాలి. అయితే చాలా రాష్ట్రాలలో ఈ నిబంధన ఇంతవరకు అమలుకు నోచుకోలేదు.



బాలలను శారీరక, మానసిక వేధింపులకు గురిచేయరాదు. ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు తీసుకోవచ్చు. అలాగే భయం, ఆందోళన వంటి వాటి నుంచి బాలలను విముక్తి చేసి వారి భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడంలో ఉపాధ్యాయులు సహాయపడాలి. బాలలను సంరక్షించడానికి చట్టంలో ఈ అంశంతోపాటు పలు ఇతర అంశాలను అమలుపరచడానికి బాలల హక్కుల కమిషన్లను ఏర్పాటు చేయాలి. వీటిని చాలా రాష్ట్రాలలో ఇంకా ఏర్పాటు చేయనేలేదు. కమిషన్లను ఏర్పాటు చేసిన రాష్ట్రాలు కూడా వాటికి సరైన ఆధారాలు ఇవ్వకుండా నామమాత్రంగానే ఏర్పరిచాయి తప్ప పకడ్బందీగా బాలల హక్కులను అమలు చేసే పరిస్థితిలో ఇవి లేవు.

ఎన్నో ఉద్యమాలు, న్యాయ పోరాటాల ఫలితంగా రాజ్యాంగంలోని ఆదేశిక, సూత్రాలలో పొందుపరిచిన బాలల విద్య అంశం, రాజ్యాంగ సవరణ ద్వారా ఉచిత నిర్బంధ విద్యాహక్కు ఒక ప్రాథమిక హక్కుగా రూపొందింది. ఈ చట్టం రూపకల్పనలో వేలాది మేధావులు, కార్యకర్తలు, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయపక్షాలు పాలుపంచుకున్నాయి.

ఇంకా చెప్పాలంటే 2002లో ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో ముసాయిదా బిల్లుగా మొదలై 2009లో యూపీఏ ప్రభుత్వ హయాంలో చట్టంగా రూపొందింది. తూ.చ. తప్పక ఈ చట్టం అమలు చేసినా విద్యా వ్యవస్థలో ఉన్న లొసుగులు తొలిగిపోవు. విభిన్న ఆర్థిక వర్గాలు, సామాజిక వర్గాలకు నెలవైన మన దేశంలో అందరికీ నాణ్యమైన విద్య అందాలంటే బాలలందరూ ఒకే రకమైన పాఠశాలలకు వెళ్ళాలనే కామన్ స్కూల్ సిస్టమే శరణ్యం. అటు వైపు అడుగులు వేయాలంటే చట్ట సభలలో రూపొందిన కనీస విద్యా హక్కు చట్టం అమలుకు ప్రజా ఉద్యమాలు ఎంతైనా అవసరం.

*– ఎన్‌పిఆర్*



# జెండర్ సమానత్వం - పంచాయతీరాజ్ ప్రభుత్వాలు

**ఏ దేశమైనా, సమాజమైనా లేదా రంగమైనా అభివృద్ధి బాటలో ముందుకు సాగాలంటే స్త్రీ పురుషులిద్దరి భాగస్వామ్యం చాలా అవసరం. పురాణాలు, ఇతిహాసాలు, సంప్రదాయాలను బట్టి సమాజంలో స్త్రీకి గౌరవం ఇచ్చినప్పటికీ ఆమె పాత్రను కొన్ని అంశాల వరకే పరిమితం చేయబడింది. మగవారికే అన్ని అంశాలలోనూ అత్యధిక ప్రాధాన్యత కల్పించటం జరిగింది. ఈ కారణం చేత స్త్రీ పురుషుల్దిరి మధ్య అనేక అంశాలలో వ్యత్యాసం  రాను రాను వ్యత్యాసాన్ని భర్తీ చేసుకోవడానికి మరలా ప్రయత్నాలు మొదలు పెట్టవలసి వచ్చింది.**

ప్రాకృతికంగా స్త్రీ పురుష ధర్మాలు వేరు వేరు అయితే సంస్కృతి, సంప్రదాయాలు, సమాజం కూడా స్త్రీ పురుషులకు వేరు వేరు పనులను నిర్దేశించింది. స్త్రీల శారీరక బలహీనత ఆధారంగా ఆమెకు కేటాయించబడిన పనులు సమాజంలో ఆమె స్థానాన్ని తక్కువగా చూపసాగాయి. అందువల్ల రానురాను సాంఘీక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో స్త్రీ స్థాయి చాలా దిగువస్థాయికి చేరిపోయింది. ప్రస్తుతం మన సమాజం పాత, క్రొత్తల కలయిక మధ్య వుండే సంధియుగంలో వుందని చెప్పవచ్చు. ఒక ప్రక్క పురాతన ఆచారాలు, సాంప్రదాయాలు, కట్టుబాట్లు మరో ప్రక్క అభివృద్ధి చెందిన మానవ హక్కులతో ఎటువైపు వెళ్ళాలో తేల్చుకోలేక పాతవాసనలను, ఆధిపత్యాన్ని వదులుకోలేక కొట్టుమిట్టాడుతోంది.

సాంస్కృతికంగా, సాంఘీకంగా, సమాజపరంగా స్త్రీ పురుషులను వేరువేరుగా చూపే వ్యత్యాసాన్నే జెండర్ అంటారు. ఇది సమాజపరంగా ఆపాదించబడిన స్త్రీ, పురుషులు పోషంచాల్సిన పాత్రలను తెలియజేస్తుంది. మామూలుగా అయితే స్త్రీ పురుషులిద్దరి మధ్యా మనకు తెలిసిన బేధం ప్రకృతిపరంగా ఏర్పడిన లింగబేధం మాత్రమే. మరి ఈ జెండర్ అనే బేధం ఏమిటి? జెండర్, సెక్స్ ఒకటి కాదా? అనే ప్రశ్నలు మన మనసులో చోటు చేసుకుంటాయి. కాబట్టి జెండర్‌కు, సెక్స్‌కు గల వ్యత్యాసం తెలుసుకోవడం చాలా అవసరం.

| జెండర్ | సెక్స్ |
|---|---|
| సమాజంచే నిర్ణయించబడినది | ప్రకృతి సహజంగా నిర్ణయించబడినది. |
| ప్రాంతాలను బట్టి మారుతూ ఉంటుంది | అన్ని ప్రాంతాలలో ఒకే విధంగా ఉంటుంది. |
| తాత్కాలికమైనది | శాశ్వతమైనది |
| మార్చుకొనవచ్చును | మార్చుటకు వీలు కానిది |

## ఇంటా, బయట స్త్రీ

పూర్వకాలంలో అయితే స్త్రీలు కేవలం ఇంటి పనుల వరకు (ఇల్లు తీర్చిదిద్దుకోవటం, పిల్లల్ని కనటం పెంచటం, పెద్దవారికి సేవ చేయటం, ఇంటి నులు చేసుకోవటం వంటివి) మాత్రమే పరిమితం చేయబడినది. ఆమెకు నిర్ణయాధికారం కూడా అంతంత మాత్రమే.

ఉదా : ఆ రోజుకు ఏం వండాలి అనే అంశం. ఒకవేళ పెద్ద కుటుంబమైనట్లయితే ఆ విషయం కూడా ఏ అత్తగారో నిర్ణయించడం జరుగుతుంది. కానీ ప్రస్తుత నవీన మహిళ ఇంటి పనులతో పాటు, ఉద్యోగం చేసి ఆర్థికంగా కూడా కుటుంబానికి సహాయపడుతుంది. అయితే ఇక్కడ మనం గమనించవలసిన అంశం ఏమిటంటే ఆర్థికంగా ఆమె కుటుంబానికి సహాయపడుతున్నప్పటికీ ఆమె చేసే పనిరీత్యా అదనపు భారం ఆమెపై పడుతోంది. అయినప్పటికీ ఇంటి పనులను, ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తోంది.

అయితే ఇక్కడ ఆమెకు కుటుంబం సహాయం చాలా అవసరం. కుటుంబాలోని వారు తమ పనులను తాము చేసుకుంటూ ఇంటిపనులలో ఆమెకు సహాయం చేసినట్లయితే ఆమె శారీరక శ్రమను కొంతవరకు తగ్గించిన వారమవుతాం.

ఉద్యోగినులైన స్త్రీల పరిస్థితి విధంగా ఉంటే ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల ద్వారా పంచాయతీరాజ్ సంస్థలకు ఎంపికైన ప్రజాప్రతినిధుల పరిస్థితి మరోరకంగా ఉంది.

రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న కారణంగా రిజర్వేషన్లలో ఫలానా సామాజిక వర్గానికి కేటాయించిబడిన సీటు కారణంగానో కొందరు మహిళలు రాజకీయాలలోకి అడుగుపెడుతుంటే, కొందరు స్వతహాగానే ఆసక్తితో ముందుకు వస్తున్నారు. ఆసక్తి ఉన్నవారిని ప్రక్కన పెడితే, తప్పనిసరి పరిస్థితులలో ప్రజాప్రతినిధులుగా ఎంపికైన మహిళలు, తమ తమ కుటుంబ సభ్యుల చేతిలోనో, లేక గ్రామపెద్దల చేతుల్లోనో కీలుబొమ్మలుగా మారి, పరిపాలనను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితులలోకి నెట్టివేయబడుతున్నారు.

పంచాయతీరాజ్ సంస్థలను స్థానిక స్వపరిపాలన సంస్థలుగా



తీర్చిదిద్దడం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం 'గ్రామ సమస్యలు, స్త్రీల ప్రత్యేక సమస్యలతో సహా అన్నీ గ్రామంలోనే పరిష్కరింపజేయటం' వారి పరిధిలో లేనివి మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించేందుకు నిర్ణయించి 73వ రాజ్యాంగ సవరణను అమలు చేయటం జరిగింది.

స్థానిక సంస్థలుగా పంచాయతీరాజ్ సంస్థలకే మంచినీరు, పారిశుధ్యం, ఆరోగ్య పరిరక్షణ మొదలైన అంశాలలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించే అధికారం గలదు. అంతేకాకుండా ప్రజలతో వారికి ఉండే సాన్నిహిత్యం కారణంగా పై అంశాలే కాకుండా గ్రామంలోని ప్రత్యేక సమస్యలను కూడా గుర్తించి పరిష్కరించే అవకాశం కూడా ఉంటుంది.

మహిళలకు కేటాయించబడిన రిజర్వేషన్ల కారణంగా మహిళలు కూడా పరిపాలనలో భాగస్వాములు అవ్వడం ద్వారా, పైన చెప్పినవన్ని చేయడం ద్వారా మాత్రమే మహిళలు పూర్తి స్వశక్తివంతులై సాధికారతను, సమానత్వాన్ని సాధించగల్గుతారు.

మహిళల సమస్యల పట్ల కూడా ప్రత్యేకంగా కృషి చేయవచ్చు. దేశమంతటా మహిళలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కేటాయించబడినప్పటికీ దేశంలోని కొన్ని ప్రాంతాలలో మాత్రమే స్త్రీలు సాధికారతతో ముందుకు సాగుతూ సమానత్వ సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. అటువంటి రాష్ట్రాలలో కేరళ రాష్ట్రం ఒకటి.

### కేరళలోనే ఎందుకు సాధ్యమైంది? మన రాష్ట్రంలో ఎందుకు కాదు ?

- 50% రిజర్వేషన్లు
- మహిళల సమస్యలను చర్చించటానికి ప్రత్యేక వర్కింగ్ గ్రూప్
- గ్రామసభలో మహిళల భాగస్వామ్యం
- గ్రామంలోని ప్రతీ కమిటీలో సగం స్థానాలు మహిళలకే
- వార్షిక, దీర్ఘకాలిక ప్రణాళికలలో మహిళల గురించి ప్రత్యేక చాప్టరు
- జనరల్ ప్లాన్‌లో మహిళలకు ప్రత్యేక కేటాయింపులు
- మహిళా సంస్థల ఏర్పాటు
- గ్రామ పంచాయతీ స్థాయిలో మహిళల స్థితిగతులపై అధ్యయనం
- మహిళల పట్ల వివక్షత, హింస, దౌర్జన్యం వంటి అంశాలను చర్చింటానికి గ్రామస్థాయిలో ఒక విజిలెన్స్ కమిటీ.
- ప్రతిస్థాయిలోనూ పై అంశాలపై సమీక్ష, పర్యవేక్షణ
- రాజ్యాంగ స్త్రీలకు కల్పించిన అవకాశాలు

### రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా స్త్రీ పురుషులకు సమాచార హక్కు అవకాశాలు.

- స్త్రీ పరులిరువురికీ సమన్యాయం
- లింగ వివక్ష నిషేధం
- స్త్రీలను గౌరవించడం ప్రతి పౌరుడి ప్రాథమిక విధి
- సమాన పనికి సమాన వేతనం
- 50% మహిళా రిజర్వేషన్లు
- స్త్రీ పరిరక్షణకై ప్రత్యేక చట్టాలు

# ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం

**గ్రామ పంచాయతీ పరిపాలనా పరంగా తీసుకున్న నిర్ణయాల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేయవలసి యుంటుంది. గ్రామ పంచాయతీ పరిధిలో తీసుకుంటే ప్రభుత్వ పథకాలను అమలు చేసే యంత్రాంగం విషయంగా సుమారు 21 మందిని మనము చూడవచ్చు. ఆపై మండల స్థాయిలో, డివిజనల్ స్థాయిలో ప్రభుత్వ శాఖాధికారులు ఉంటారు.**

వీరందరితో సత్సంబంధాలు నెలకొల్పుకున్నపుడు మాత్రమే మంచి ఫలితాలను సాధించగలం. గ్రామ పంచాయతీ స్థాయిలో, మండల ప్రజాపరిషత్ స్థాయి మరియు డివిజనల్ స్థాయిలలో ప్రభుత్వ ప్రతినిధులు (అధికారులు) ఎవరెవరు ఉన్నారో తెలుసుకుందాం.

## గ్రామ పంచాయతీ స్థాయి అధికారులు

| అధికారి హోదా | గ్రామ పంచాయతీలో చేసే సేవలు |
|---|---|
| పంచాయతీ కార్యదర్శి | పంచాయతీ పరిపాలన |
| గ్రామ రెవెన్యూ అధికారి | గ్రామ సంబంధ భూ రికార్డులు, శాంతిభద్రతలు |
| అంగన్‌వాడీ కార్యకర్త | మాతా శిశుపోషణ, పౌష్టికాహారం |
| ఉపాధ్యాయులు | విద్య |
| సామాజిక ఆరోగ్య కార్యకర్త | ఆరోగ్య విషయం |
| ఆశా కార్యకర్త | ఆరోగ్య విషయాల ప్రచారం |
| సాక్షర భారత్ కార్యకర్త | వయోజన లేదా అనియత విద్యా |
| విద్యా వాలంటీర్ | విద్యాబోధన |
| ఫీల్డ్ అసిస్టెంట్ | ఉపాధిహామీ కూలీలకు పని కల్పించటం |
| కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ | పొదుపును ప్రోత్సహించటం, మహిళా సాధికారత |
| గోపాల మిత్ర | పశుపోషణ, రక్షణ పాడి ఉత్పత్తి |
| స్వీపర్ | పారిశుధ్యము |
| అంగన్‌వాడీ ఆయా | పిల్లల సంరక్షణ |
| గృహనిర్మాణ వర్క్ ఇన్‌స్పెక్టర్ | గృహనిర్మాణ పర్యవేక్షణ |
| గ్రామ సహాయకులు | రెవెన్యూ సంబంధ నిధులు, శాంతి భద్రతల నివేదిక |
| కమ్యూనిటీ సర్వీస్ ప్రొవైడర్ | సామాజిక పెన్షనులు, కూలీల వేతనాలు |
| చౌకడిపో డీలరు | నిత్యావసర సరుకుల పంపిణీ |
| ఆదర్శ రైతు | రైతులకు, వ్యవసాయ అధికారులకు మధ్య సమన్వయం |
| పంచాయతీ గుమస్తా | పన్నులు, ఫీజుల వసూలు మరియు పాలనాపరమైన సహకారం |
| విద్యుత్ శాఖ హెల్పర్ | విద్యుత్ క్రమబద్ధీకరణ |
| గ్రామీణ డాక్ సేవక్ | ఉత్తరాల బట్వాడా |

## మండల ప్రజాపరిషత్ స్థాయి అధికారులు

| అధికారి హోదా | మండలస్థాయిలో చేసే సేవలు |
|---|---|
| విస్తరణాధికారి (పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి | పంచాయతీల పరిపానలో సలహాలు సూచనలు |
| మండల వ్యవసాయ అధికారి | వ్యవసాయ పర్యవేక్షణ, మెలకువలు తెలపటం |
| మండల పశు వైద్యాధికారి | పశు సంరక్షణ, పాడి అభివృద్ధి |
| మండల వైద్యాధికారి | ఆరోగ్య రక్షణ |
| ఎ.పి.యమ్ (ఐ.కె.పి) | పేదరిక నిర్మూలన, పొదుపు & మహిళా సాధికారత |
| ఎ.పి.ఓ., యం.జి.యన్. ఆర్.ఇ.జి.యస్. | కూలీలకు పనులు కల్పించటం |
| మండల విద్యాధికారి (యమ్.ఇ.ఓ.) | మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేయటం, పాఠశాలలు తనిఖీ చేయటం |
| సహాయ ఇంజనీరు (పి.ఆర్) | అభివృద్ధి పనులకు అంచనాలు వేయటం, పనుల తనిఖీ చెల్లింపు మొత్తాన్ని నిర్ణయించటం |
| సహాయక ఇంజనీరు (నీటి సరఫరా&పారిశుధ్యం) | రక్షిత నీటి సరఫరా మరియు సంపూర్ణ పారిశుధ్యం |
| సహాయ ఇంజనీర్ (విద్యుత్) | మండలంలో విద్యుత్ సంబంధ సేవలు |
| తహసీల్దారు | భూమి రికార్డుల నిర్వహణ, ప్రజాపంపిణీ నిర్వహణ, శాంతిభద్రతల వ్యవహారాలు |
| మండల అభివృద్ధి అధికారి | సామాజికాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి సంక్షేమ పథకాల అమలు పర్యవేక్షణ |
| మహిళా శిశు సంక్షేమాధికారి | మహిళా శిశు సంరక్షణ మరియు పౌష్టికాహారం |



# గ్రామ పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలి

**గ్రామీణుల అవసరాలను తీర్చడానికి గ్రామ కార్యదర్శులు విజ్ఞతతో వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ కమిషనర్ శ్రీమతి అనిత రామచంద్రన్ అన్నారు.**

రాజేంద్రనగర్‌లోని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రామ కార్యదర్శుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ, గ్రామస్థాయిలో ఎన్నుకోబడిన ప్రతినిధుల నుంచి, ప్రజల నుంచి వచ్చే ఒత్తిడులను అధిగమించి గ్రామాలలో నిజమైన అర్హులకు మేలు చేసే విధంగా పని చేయాల్సిన అవసరముందన్నారు.

పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ డి. రామారావు మాట్లాడుతూ, చాలా గ్రామాలు వందశాతం పన్నులు వసూలు చేస్తున్నాయని, మూడు వేల గ్రామ పంచాయతీలలో వందశాతం పన్నులు వసూలు చేసి రికార్డు సృష్టించారని, వారందరికీ అభినందలు తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు కె. యాదయ్య మరియు తదితరులు పాల్గొన్నారు. ◆

| | |
|---|---|
| హెల్త్ విజిటర్ | ఆరోగ్య సంరక్షణ మరియు ఆరోగ్య సలహాలు |
| పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ | శాంతి బాధ్యతల పరిరక్షణ |
| సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎక్సైజ్) | కల్తీసారా నిరోధం |
| బ్యాంక్ మేనేజర్ | ఆర్థిక లావాదేవీలు, ఋణాలు |

## డివిజనల్ స్థాయి అధికారులు

| అధికారి హోదా | డివిజన్ స్థాయిలో చేసే సేవలు |
|---|---|
| ఎ.పి.డి. (డి.డబ్ల్యు.యం.ఎ) | వాటర్‌షెడ్ కార్యక్రమాలు, ఉపాధిహామీ పథకం అమలు పర్యవేక్షణ |
| ఎ.పి.డి. (ఐ.కె.పి) | పొదుపు, మహిళా సాధికారత, పేదరిక నిర్మూలన |
| పారిశ్రామిక ప్రోత్సాహక అధికారి (ఐ.పి.ఓ.) (ఇండస్ట్రియల్) | పరిశ్రమల స్థాపన మరియు అభివృద్ధికి సహాయ సహకారాలు చేయటం |
| డివిజనల్ పంచాయతీ అధికారి | గ్రామ పంచాయతీ పాలనపై పర్యవేక్షణ సలహాలు అందజేయటం, పంచాయతీలకు ఉప ఎన్నికల అధికారిగా ఉంటారు. |
| రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్.డి.ఓ.) | భూమి రికార్డులు, ప్రజా పంపిణీ వ్యవస్థ పర్యవేక్షణ, శాంతి భద్రతలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు, న్యాయాధికారాలు |
| ఉప కార్యనిర్వహాఖ ఇజనీరు (పి.ఆర్) | రూ. 2,00,000 విలువ గల పనులకు సాంకేతిక మంజూరి ఇస్తారు. |
| ఉప కార్య నిర్వహాక ఇంజనీరు (ఆర్‌డబ్ల్యు.యస్) | నీటి సరఫరా పనులను రూ. 2,00,000 లక్షల వరకు సాంకేతిక మంజూరి ఇస్తారు. |
| ఉకార్య నిర్వాహక ఇంజనీరు (పి.ఆర్0 | 2 లక్షల నుండి 10 లక్షల వరకు గల చెక్కులకు సాంకేతిక మంజూరి ఇస్తారు. |
| కార్య నిర్వాహక ఇంజనీరు (ఆర్‌డబ్ల్యు.యస్) | నీటి సరఫరా పనులకు, పారిశుద్ధ్య పనులకు 2 నుండి 10 లక్షల వరకు సాంకేతిక మంజూరి ఇస్తారు. 2 లక్షలు పైబడిన పనులకు చెక్కు మంజూరు చేస్తారు. |

ఏ స్థాయిలో ఏ ఏ అధికారులు ఎంతమంది ఉన్నారు, ఎవరెవరు ఏమి చేస్తారు అనే విషయాలు చూశాం. వీరందరిని గ్రామ పంచాయతీ అవసరాలను తీర్చేందుకు అవసరమైన విధంగా వినియోగించుకోగలగాలి. అందుకు సమన్వయం చాలా అవసరం.

– సిపార్డ్

# కాకతీయులు - శిల్పకళాసేవ

**కాకతీయులు మొదట 'పశ్చిమ చాళుక్యుల' సాంప్రదాయాన్ని అనుసరించినప్పటికీ అందులో నూతన లక్షణాలను ప్రవేశపెట్టి ఒక వినూత్న విలక్షణమైన సాంప్రదాయాన్ని సృష్టించారు. కాకతీయ శిల్పంలో అసామాన్య ధృడత్వం, సూక్ష్మ పరిశీలన, సౌందర్య పిపాస కన్పిస్తుంది. నాటి శిల్పులు బ్రహ్మాండమైన శిలలను పండ్లవలె అతిసునాయాసంగా ఎత్తి స్తంభాలుగా, ద్వారాలుగా తీర్చిదిద్దారు.**

కఠిన వజ్రతుల్యాలైన ఈ శిలలపై 'నగిషీ' పనులను మలిచారు. లోహాతి కఠినములైన ఈ శిలలు శిల్పుల చేతుల్లో 'వెన్న'వలె మెత్తపడినాయి. ఓరుగల్లు కోటలోని 'స్వయం భూ' దేవాలయంలో తలవిరిగి, మెడ నుంచి తొడల వరకు మాత్రమే మిగిలిన దేవుని విగ్రహం 'అపూర్వ సృష్టి' శిల్పాల్లో చూపిన సున్నితమైన పనితనం కాకతీయ శిల్పకళా ఔన్నత్యం చాటుతుంది.

*కాకతీయుల ఆలయాలు రెండు రకాలు అవి....*

1. 'ఏక విమాన' ఆలయాలు లేదా ఏకశిల ఆలయాలు
2. త్రికూట ఆలయాలు అనే రెండు రీతుల్లో నిర్మించారు.

పెద్ద ఆలయాల్లో రాయి, ఇటుకలు రెండూ వాడారు. ఆలయపు దిగువ భాగాలు 'రాతి' తోను, విమానాలు ఇటుకలు, గచ్చుతో కట్టారు.

## త్రికూట ఆలయాలు

* హన్మకొండలోని రుద్రేశ్వరాలయం (వేయిస్తంభాలగుడి) ప్రతాపరుద్రుడు నిర్మించాడు.
* పానగల్లు (నల్లగొండ)లోని 'సూర్య' ఆలయం లేదా 'ఛాయా' సోమేశ్వరాలయం (కాకతీయుల సామంతులు కందూరు చోళులు నిర్మించారు.)

## వేయి స్తంభాల గుడి

కాకతీయుల కాలంలో తెలంగాణ వారి కళా సృష్టికి నిదర్శనం. 'సహస్ర స్తంభ' దేవాలయం 1163వ సంవత్సరంలో రుద్రదేవుడు లేదా ప్రతాపరుద్ర-1 హన్మకొండలో నిర్మించాడు. ఈ ఆలయం 'త్రికూట ఆలయం'. ఇందులో మూడు ఆలయాలు ఉన్నాయి.

అవి...
తూర్పున: ఈశ్వరాలయం (శివుడు)
దక్షిణాన: వైష్ణవాలయం (విష్ణువు)
పశ్చిమాన: సూర్య దేవాలయం (సూర్యుడు)

ఈ మూడు ఆలయాలు ఒకే దేవాలయంగా 'నక్షత్ర' ఆకారంలో ఉన్నాయి. వాటి మధ్యభాగంలో విగ్రహాలు అద్భుతంగా చెక్కబడ్డాయి. లోపల 'గ్రానైట్' రాతితోనూ, ద్వార బంధాలు 'బసాల్టు' రాతితోనూ (ఈ రాయి ఆకుపచ్చ గౌర వర్ణాల' మిశ్రమంతో ఉంది), నల్లరాతిని 'మణి హారాలుగా' మార్చిన నైపుణ్యం వర్ణణాతీతం. ప్రధాన ఆలయంలో విగ్రహాలు లేవు.

## ఏకశిల లేదా ఏకశాల ఆలయాలు

పాలంపేటలోని పెద్ద ఆలయం 'ఏక' విమానం ఉన్న ఆలయం. దీనిని గణపతిదేవుని కాలంలో 'రేచర్ల రుద్రుడు' నిర్మించాడు. ఇతను రేచర్ల వంశస్థుడు. ప్రధాన శిల్పాచార్యుడైన 'రామప్ప' పేరుమీదుగా ఇది రామప్పగుడి అయ్యింది. ఈ దేవాలయంలో అందమైన శిల్పాల అల్లికతో శోభిల్లుతున్న స్తంభాలు, నర్తకీమణులు మృందంగ వాయిద్యాలతో, పుష్పమాలలు ధరించిన సుందరీమణులు, నృత్య భంగిమలతో నిల్చిన వేణుగోపాల మూర్తి, కమలమాలాంకృత పరశుధారి అయిన భైరవమూర్తి, ఢమరుకం, ఘంట, త్రిశూలం ధరించిన అపస్మారక పురుషునిపై తాండవ నృత్యం చేస్తున్న 'నటరాజ మూర్తి' కమలాన్ని ధరించిన సూర్యుడు, మదనికా విగ్రహాలతో ఈ దేవాలయంలోని మండపాలు అలరిస్తున్నాయి.

ఆలయగోడలపై 'పార్వతీకల్యాణ' దృశ్యం, క్షీరసాగర మదనం చెక్కబడ్డాయి. నల్లరాతిపై 12 యక్షిణి విగ్రహాలు సజీవంగా ఉన్నాయి. గుడి పైకప్పులో పద్మాలంకృత త్రికోణ ఆకార శిలాశిల్పాలు ఉన్నాయి. ప్రవేశ ద్వారానికి ఇరువైపులా 'ఏనుగులు' ఘన స్వాగతం పలుకుతున్నాయి.

## నాగిని శిల్పం

రామప్పగుడిలో ఉన్న శిల్ప కళాఖండం అన్నింటికి పతాకం వంటిది 'నాగిని శిల్పం'. సౌందర్యానికి సంకేతం ఈ మూర్తులు. ఈ శిల్పాలకు 'ప్రదనిక' అని పేరు. నాగిని చేతుల్లో సర్పం, కంఠం చుట్టూ మరోసర్పం



## కాకతీయ సామంతులు నిర్మించిన ఆలయాలు

**పిల్లలమర్రి:** రేచర్ల వంశస్థులు 'పిల్లలమర్రి'లో 'ముక్కంటి' ఆలయంగా పిలువబడే నామలింగేశ్వర, కాచేశ్వర, కామేశ్వర' అనే 'త్రికుట' ఆలయం, ఎరుకేశ్వర ఆలయం నిర్మించారు. పిల్లలమర్రి నల్గొండ జిల్లా సూర్యాపేటకు 3 మైళ్లదూరంలో ఉంది.

**కాళేశ్వర ఆలయం:** తెలంగాణలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం, కాళేశ్వరంలోని కాళేశ్వరాలాయం. 'త్రిలింగాల్లో' ఒకటిగా ప్రసిద్ధి చెందింది. త్రిలింగాలు 1. కాళేశ్వరం - కరీంనగర్ (తెలంగాణ)

2. శ్రీశైలం కర్నూలు (రాయలసీమ)
3. ద్రాక్షారామం - రాజమండ్రి (ఆంధ్రా)

ఇది గోదావరి, దాని ఉపనది ప్రాణహిత సంగమించే ప్రదేశాల్లో ఉంది. కరీంనగర్ (యలగందుల) పట్టణానికి 130 కి.మీ దూరంలో ఉంది. 1171 సంవత్సరంలో కాకతీయ రుద్రుడు లేదా మొదటి ప్రతాపరుద్రుని మంత్రి గంగాధరుడు కాళేశ్వరాలయం నిర్మించినట్లు తెలుస్తున్నది.

రెండో ప్రోలరాజు శైవమత గురువైన రామేశ్వర దీక్షితులు ఎక్కడ స్థిరపడి 'ఉపాల మఠం' అనే శైవమతాన్ని స్థాపించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. 1379లో రెండో హరిహరరాయల కుమారుడు దేవరాయులు ద్విగిజయ యాత్ర చేసి 'కాళేశ్వరం' వచ్చి తన విజయాలకు గుర్తుగా ఇక్కడ ఉత్సవం జరిపి, తులాపు రుషదానం చేశాడని తెలుస్తోంది.

ఉన్నాయి. శిరస్సుపై రుద్రఫణి ఉంది. శరీరంపైన అతిపలుచని వస్త్రాలు ఉండీ ఉండనట్లుగా మలచబడిన శిల్పాలు శిల్పి ప్రతిభకు తార్కాణం. కాకతీయ శిల్పులు దేవతారూపాలను కూడా విగ్రహాలుగా నిలబెట్టక 'త్రిభంగ' సూత్రం పాటించారు. త్రిభంగ అంటే రూప సౌందర్యం స్పష్టంగా కన్పించేందుకు కాలుమడతవేసి కానీ, ఎత్తికానీ, తల ఒక వైపునకు, నడుము ఇంకోవైపునకు ఉండి ప్రదర్శించే నాట్యభంగిమ, ఓరుగల్లులోని స్వయంభూ దేవుని విగ్రహం ప్రస్తుతం న్యూఢిల్లీలోని మ్యూజియంలో ఉంది.

### వరంగల్లు కోటలోని దేవాలయాలు

ఓరుగల్లు కోటలో 'వీరభద్ర, మండలమ్మ, రామ, విష్ణు, వేంకటేశ్వర, స్వయంభూ, సేలశంభు, జంగమేశ్వర దేవి' అనే పేర్లతో పిలువబడే 12 ఆలయాలు ఉన్నాయి. ఇంకనూ కటక్‌పూర్ లేదా 'కటాక్షపురం'లో రెండు చిన్న 'త్రికూట' ఆలయాలు ఉన్నాయి.

### సహస్రలింగ దేవాలయం

గణపతిదేవుడు ఓరుగల్లులో నిర్మించిన 'సహస్ర లింగ దేవాలయం' చెప్పుకోదగినది. ఇది శైలిలో పాలంపేట ఆలయానికి దగ్గరగా ఉంది. కొందరు దీన్ని 'ఐవోలు' ఆలయంతో పోల్చారు.

### ఘణపూర్ దేవాలయ సముదాయం

వరంగల్ జిల్లాలోని పాలంపేటకు 6 మైళ్లదూరంలో ఉన్న 'ఘణపూర్' గ్రామం మధ్యలో ఉన్న మట్టికోట లోపల 260 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఒక ప్రాంగణంలో దాదాపు '22' దేవాలయాల సముదాయం ఉంది.

### కాళేశ్వర ఆలయ ప్రత్యేకత

కాళేశ్వరాలయానికి 'ముక్తేశ్వరాలయం' అని పేరు. ఈ ఆలయంలో ఒకే వేదికపై రెండు శివలింగాలు ప్రతిష్ఠించబడినవి. ఒక శివలింగానికి కాళేశ్వరుడు, రెండో లింగానికి 'ముక్తేశ్వరుడు' అని పేర్లు ఉన్నాయి. ఈ ఆలయానికి 'పిరమిడ్' ఆకారంలో శిఖరం నిర్మించబడి ఉంది (అది ప్రస్తుతం లేదు). ఈ ఆలయానికి ఉత్తరంగా మరొక చిన్నగుడి ఉండేది. అందులో అన్నపూర్ణ దేవి ప్రతిమ ఉండేది. ఇప్పటికీ ఈ ఆలయంలో గణపతి, మత్స్యావతారం, చతుర్ముఖలింగం, సూర్య, విష్ణు, నంది మొదలైన విగ్రహాలు ఉన్నాయి. తెలంగాణలో ప్రసిద్ధక్షేత్రంగా అభివృద్ధి చెందిన దేవాలయం ఇది. కాబట్టి విద్యానాథుడు దీన్ని 'త్రిలింగ' దేశానికి ఒక సరిహద్దుగా కీర్తించాడు.

### కాకతీయ కాలంలో జైన ఆలయం

**పద్మాక్షి దేవాలయం:** హన్మకొండపై జైనులు 'పద్మాక్షి' దేవాలయం నిర్మించారు. (తొలి కాకతీయులు జైనమత ఆరాధకులు). ఇందులో ఆమె తన యక్షిణితో నిలబడి ఉంది. (దిగంబర విగ్రహం ప్రతిష్ఠించారు) ఈ దేవాలయం చుట్టూ అనేక సహజ గుహలు, గాడులు ఉన్నాయి. ఇవన్నీ జైనుల 'బసదులు'గా ఉపయోగపడేవి.

ఇక్కడ ఉన్న 'యక్షిణి'ని పద్మాక్షి అని పిలుస్తున్నారు. ఈమె పార్శ్వనాథుని యక్షిణి. ఈ దేవాలయం మూడో గోవిందుడు (రాష్ట్రకూట రాజులలో ప్రసిద్ధుడు) కాలం నాటిదే ఉండవచ్చు. నాడు ఇతని కాలంలో విజయకీర్తి శిష్యుడైన ఆర్యకీర్తి, భోగరాజు మేనల్లుడు అయిన విమలాదిత్యునికి పట్టిన శని దోషాలను వదలగొట్టినందుకు ఒక దానాన్ని పొందినట్లుగా 'రాగి' శాసనంలో పేర్కొనబడింది. కాకతీయుల కాలంలో ఈ యక్షిణిని 'పద్మాక్షి'గా మార్చారు. పార్శ్వనాథుని హన్మకొండలో 'ఇలయ్య లేదా ఐలయ్య' అని పిలుస్తారు.

### భద్రకాళి దేవాలయం

ఇది మరోగొప్ప దేవాలయం ప్రతి సంవత్సరం ఇక్కడ జరిగే బతుకమ్మ పండుగ కనులపండువగా అత్యంత వైభవంగా జరుగుతుంది. అనంతరం పక్కనే ఉన్న చెరువులో బతుకమ్మలు నిమజ్జనం అవుతాయి.

### ఓరుగల్లు కోటపై కొన్ని ముఖ్యాంశాలు

ఓరుగల్లు కోట నిర్మాణంలో కాకతీయుల గొప్పవాస్తు శిల్పకౌశలం ప్రతిఫలిస్తుంది. ఓరుగల్లు కోట 'ఏకశిల' నగరం చుట్టూ నిర్మించబడింది. 'మూడు' ప్రాకారాలతో ఈ కోట శత్రుదుర్భేధ్యమై దాదాపు రెండు వందల సంవత్సరాలపాటు శత్రువుల ధాటికి తట్టుకొని నిల్చింది.

1. మొదటి, రెండు ప్రాకారాలు పుట్టకోట, మట్టితోనూ...
2. మూడో ప్రాకారం కంచుకోట రాతితోను నిర్మించబడినాయి.

ఈ కోటలో కాకతీయుల ఆరాధ్యదైవమైన 'స్వయంభూ' శివుని దేవాలయం ఉండేది. ఈ కోటకు నాలుగువైపులా నాలుగు శిలా నిర్మిత 'కీర్తి తోరణాలు' ఉండేవి. కాకతీయ శిల్పుల అసమాన శిల్పకళా నైపుణ్యానికి ఇవి చక్కని ఉదాహరణలు.

# వ్యక్తిత్వం

**మన నడక, నడత, మాట... చివరికి మౌనం కూడా వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. గుడిగోపురంలా ఉన్నతమైన వ్యక్తిత్వం కలవారికి లోకం చేతులెత్తి నమస్కరిస్తుంది. మురికికూపం లాంటి మనస్తత్వం కలిగినవారిని శక్తికొద్దీ దూరంగా నెట్టేస్తుంది. రాముడితో ఏ పాటి పరిచయం ఉందని ఆలయం నిర్మించి అర్చనలు చేస్తున్నాం? రావణుడు మన కుటుంబానికి ఏ అపకారం చేశాడని దిష్టిబొమ్మలు తగలేస్తున్నాం? చరిత్రలో మనకు ఎవరితోనూ సంబంధం లేకపోయినా, వారి వ్యక్తిత్వాలే మనల్ని ప్రభావితం చేస్తున్నాయి.**

శ్రేష్ఠులైనవారు ఆచరించిన మార్గాన్నే సామాన్యులూ అనుసరిస్తారు. కాబట్టి, వ్యక్తిత్వాన్ని కేవలం వ్యక్తిగతమైనదిగా భావించకూడదు. అది సమాజాన్నే మార్చగలిగేది అధికార, పాలక స్థానాల్లో ఉన్నవారు గొప్ప నాయకత్వ లక్షణాలతోపాటు, తమ ప్రజలు సంస్కారవంతమైన వ్యక్తిత్వాన్ని అలవరుచుకునేందుకు చర్యలు చేపట్టాలి. ఆధ్యాత్మిక భావనలు తప్పనిసరిగా మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. పురాణ ఇతిహాస సంబంధమైన విశేషాలు తెలుసుకోవడంవల్ల, మహనీయుల స్ఫూర్తివంతమైన ఉన్నత వ్యక్తిత్వాన్ని మనం అలవరచుకోవడం సాధ్యపడుతుంది.

ఏ వ్యక్తికైనా శిశుప్రాయం నుంచే వ్యక్తిత్వం అంకురిస్తుంది. చుట్టుపక్కల సమాజం దాని మీద చెరగని ముద్రవేస్తుంది. శివాజీ గొప్ప వీరుడిగా ఎదగడానికి, అక్బర్ పరమత సహనం పాటించి చరిత్రలో నిలిచిపోవడానికి చిన్నతనం నుంచి వారి పెద్దలు రూపుదిద్దిన వ్యక్తిత్వ నిర్మాణమే కారణం. బలం, బలగం, ధనం, బంధుగణం ఎవరైనా మనం సత్‌పాత్రత కలిగి ఉంటేనే మనమార్గంలో పయనిస్తారు. అదే లేనినాడు తెగులు పట్టిన పంట నిలువునా ఎండిపోయినట్లే, చెదలు పట్టిన వ్యక్తిత్వం మనిషిని చరిత్రహీనుణ్ని చేస్తుంది. తమ్ముడైన సుగ్రీవుణ్ని చంపడానికి సిద్ధపడ్డాడు వాలి.

దయాసముద్రుడైనప్పటికీ శ్రీరాముడు అతడిపై ఏ మాత్రం జాలి చూపలేదు. పదిమందిలో ద్రౌపదికి చేసిన అవమానం-దుర్యోధనాదుల ప్రాణాలు తీసింది. చెల్లెలి పిల్లల్ని సంహరించడానికి సిద్ధపడ్డ కంసుడు, పదుహారు వేల కన్యల్ని చెరచడానికి ఉద్యుక్తుడైన నరకుడు-తమ తమ పాపపంకిలమైన వ్యక్తిత్వం కారణంగానే నాశనమయ్యారు. చక్కటి భోజనం తినడంవల్ల కలిగే ఆనందాన్ని పంటి కింద అడ్డు తగిలే చిన్న రాయి దూరం చేసినట్లే... దేవతలకు రాజైన ఇంద్రుడు అహల్యకు చేసిన ద్రోహం, సుగుణాలకు ఆటపట్టయిన కర్ణుడు దుర్యోధనుడితో చేసిన స్నేహం-వారి గొప్ప వ్యక్తిత్వాలను అధఃపాతాళానికి తొక్కివేశాయి.

ముక్కోటి దేవతలకు మక్కువైన నెలవుగా ఒకప్పుడు, వర్ధిల్లిన భారతదేశం గొప్ప వ్యక్తిత్వాన్ని ఆర్జించిన మహనీయులకు నిలయం. జగద్గురువుగా ప్రఖ్యాతి పొందినప్పటికీ చండాలుడి బోధకు శిరసు వంచి ప్రణమిల్లిన ఆదిశంకరాచార్యుడి వైనం, బ్రహ్మర్షి అని పిలువలేదన్న అక్కసుతో తనను చంపడానికి వచ్చిన విశ్వామిత్రుడిపై వశిష్ఠుడు చూపించిన సహనగుణం ఆ మహనీయుల వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేవే. తల్లిదండ్రుల మీద భక్తి భావానికి ప్రతీకగా నిలిచిన శ్రవణ కుమారుడు, భార్యాభర్తల అన్యోన్యతను గొప్పగా చూపిన సీతారాములు, గురుశిష్య బంధానికి అర్థం చెప్పిన రామకృష్ణ పరమహంస-వివేకానందులు అందరూ ఉత్తమ వ్యక్తిత్వాన్ని ఆర్జించినవారే. మనందరం నడవాల్సిన సంస్కార మార్గాన్ని చూపించిన మహనీయులు వారు.

భూమి మీద నివసించే ఎనభై నాలుగు లక్షల జీవజాతిలో మనిషి గొప్పవాడైనప్పటికీ, మనుషులందరూ గొప్పవాళ్లు కాలేరు. సాటివారి వేదన చూసి కరిగి కన్నీరై తన దేశం విడిచి మనదేశం వచ్చి వ్యాధిగ్రస్తుల సేవలో తరించిన మదర్ థెరెసా, మహారాజు కుమారుడిగా పుట్టినప్పటికీ సుఖాలన్నింటిని విడిచిపెట్టి, జ్ఞానమార్గ అన్వేషణలో తపించిన గౌతమ బుద్ధుడు... ఈ విధంగా ఒక్కొక్కరు ఒక్కో రకమైన విలక్షణ వ్యక్తిత్వంతో మానవజాతికి తమ వంతు సహాయం అందించారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

ఏ ఎండకు ఆ గొడుగు పట్టే అల్పమైన వ్యక్తిత్వంగల వ్యక్తులవల్ల ఎవరికీ ఎటువంటి మంచీ జరగదు. అందరిలోనూ స్వార్థాన్ని మాత్రమే చూడటం అలవాటు చేసుకున్న వ్యక్తి. తాను స్వార్థపరుడిగానే మారతాడు. వాల్మీకి, వేమన, తులసీదాసు వంటి మహాపురుషులూ మొదట బలహీన వ్యక్తిత్వం కలవారే. కాలానుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకొని గొప్ప వ్యక్తిత్వాన్ని సంపాదించుకోగలిగారు. మనందరిలోనూ స్వార్థచింతన ఎంతో కొంత ఉంటుంది. గొంగళిపురుగు తన రూపాన్ని సీతాకోక చిలుకగా మారుతున్నట్లు, ప్రయత్నిస్తే అందరం వ్యక్తిత్వ శిఖరాలను అధిరోహించడం కష్టమేమీ కాదు. ◆

సంగీత - శిల్పకళలపై ముఖ్యాంశాలు

దేవాలయాల సముదాయాలు:ఘణపూర్

ఏకశాల లేదా ఏకకూట శైలికి గొప్ప తార్కాణం: రామప్ప దేవాలయం

త్రికూట శైలి: వేయిస్తంభాల దేవాలయం- హన్మకొండ

ఉద్యాననగరం: హన్మకొండ

చిత్రకళలు నెలకొన్న దేవాలయం: పిల్లలమర్రి (సూర్యాపేట)

నటులకు నిలయంగా ప్రసిద్ధి చెందింది: ఓరుగల్లు

నాగిని శిల్పాలు: రామప్ప దేవాలయంలోని మదనిక శిల్పాలు

ప్రసూతి వైద్యశాలలు: మల్కాపురంశాసనంలో వివరాలు ఉన్నాయి.

గణపతి దేవుని గురువు విశ్వేశ్వరశంబు నిర్మించాడు.

రజుఖండక సంగీత పరికరం: ధర్మసాగరం శాసనం

పేరణి నాట్యం: జాయపసేనాని

మాచల్దేవి: గొప్ప నాట్యకారిణి

## లలితకళలు

సాహిత్యంతోపాటు లలితకళలు కూడా అభివృద్ధి చెందాయి. నాట్యం-సంగీతం మంచి ప్రాచుర్యంలో వున్నాయి. దేవాలయాలు, రాజులు సంగీత విద్వాంసులను, నటీనటులను, నాట్యకత్తెలను పోషించారు. వారు వివిధ వాయిద్యాలతో పాటలు పాడుతూ ఉంటే దేవదాసీలు నాట్యం చేస్తూ ఉండేవారు. కేతన దశకుమారచరిత్ర, తిక్కన నిర్వచనోత్తర రామాయణం, గోన బుద్ధారెడ్డి రంగనాథరామాయణం, జాయపసేనాని నృత్యరత్నావళి మొదలైన అనేక గ్రంథాలు ఆ కాలంలో వాడుకలో ఉన్న నాట్య, గీత వినోదాలను తంత్రి వాద్య విశేషాలను వివరిస్తుంది. జయాపసేనాని నృత్యంలోని మెళకువలను, శైవధర్మ సూత్రాలను సమన్వయం చేస్తూ 'నృత్యరత్నావళి' ని రచించాడు. రామప్ప దేవాలయం నాట్య భంగిమలు 'నృత్యరత్నావళి' లోనివే. మల్కాపురం శాసనంలో నాట్యకత్తెల ప్రస్తావన ఉన్నది. ◆

> కేంద్ర మరియు రాష్ట్ర స్థాయిలో కేవలం కొంత మంది కూర్చోని శాసించే పద్ధతి అసలైన ప్రజాస్వామ్యం కాదు.
>
> ప్రతి గ్రామంలోను ప్రజలు దిగువ స్థాయిలో ఆలోచించి నిర్ణయించబడినదే నిజమైన ప్రజాస్వామ్యం.
>
> – మహాత్మా గాంధీ

# పంచాయితీరాజ్ సంస్థల ఆవిర్భావం

**కేంద్రస్థాయిలో మొట్టమొదట పంచాయితీరాజ్ చట్టం 1959 సెక్షన్ 60ని అనుసరించి బల్వంతరాయ్ మెహతా కమిటీ సిపారుల మేరకు అప్పటికి అమలులో ఉన్న జిల్లా బోర్డులను రద్దు చేసి వాటి స్థానంలో 01.12.1959 న 22 జిల్లా పరిషత్‌లను మరియు 330 పంచాయితీ సమితీలను ఏర్పాటు చేయడం జరిగింది.**

ఈ రోజున అప్పటి భారత ప్రదాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గారు షాద్‌నగర్ పంచాయితీ సమితీని ప్రారంభించారు. విభిన్న జాతులు, మతాలు, భాషలు, ఆచారాలు మరియు సంస్కృతులు వున్నటువంటి మనదేశంలో మెజారిటీ ప్రజల అభిప్రాయాలకి అణుగుణంగా పరిపాలన సాగించలనే ఉద్దేశ్యంతో స్థానిక ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా గ్రామం యూనిట్‌గా గ్రామ పంచాయితీలు, కొన్ని గ్రామాలు కలిపి పంచాయితీ సమితీ అలాగే కొన్ని పంచాయితీ సమితీలు కలిపి జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. ఆశోక్ మెహతా కమిటీ సిఫారసుల మేరకు 1986 వ సంవత్సరంలో పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా 1959 చట్టం స్థానంలో జిల్లా ప్రణాళిక అభివృద్ధి సమీక్షా మండలి రూపుదిద్దుకుంది. ఈ మేరకు పంచాయితీ సమితీల స్థానంలో మండల వ్యవస్థ ఏర్పడింది.

## పంచాయితీ సంస్థల పరిణామక్రమంలో వివిధ దశలు

***1వ దశ (1959-1966)***

పంచాయితీరాజ్ సంస్థలకు ఈ కాలం స్వర్ణయుగం. ఈ సంస్థలు పటిష్టం చేయడానికి అనేక చర్యలు తీసుకోవడం జరిగింది. మూడవ పంచవర్ష ప్రణాళిక కాలంలో ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు, అధికార బదలాయింపుకు ప్రాధాన్యమివ్వడం జరిగింది.

***2వ దశ (1967-1976)***

ఈ కాలంలో అభివృద్ధి వ్యూహం మారింది. వ్యవసాయాభివృద్ధికి అనేక కార్యక్రమలు చేపట్టడం జరిగింది. కాని పంచాయితీరాజ్ సంస్థల ఎదుగుదలలో స్తబ్ధత ఏర్పడింది.

***3వ దశ (1977-1991)***

పశ్చిమబెంగాల్, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ మొదలైన రాష్ట్రాలలో పంచాయితీరాజ్ సంస్థలను పటిష్టపరచడానికి ప్రయత్నాలు జరిగాయి. కాని ఆప్రయత్నాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

***4వ దశ (1992 నుండి)***

73వ రాజ్యాంగ సవరణ తరువాత అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాన్ని తీసుకురావడం కాని, లేదా ఉన్న చట్టాన్ని రాజ్యాంగ సవరణకు అనుగుణంగా మార్పుచేయడం గాని జరిగింది. అయితే ఎక్కువ రాష్ట్రాలలో నిర్ధేశించిన అధికారాల బదలాయింపు జరగలేదు.

*ఈ సంస్థల పటిష్టతకు ఏర్పటుచేసిన కమిటీలు, సిఫారసులు మరియు చర్యలు :*

1. బలవంతరాయ్ మెహతా కమిటి (కేంద్ర ప్రభుత్వం)-1957
2. టి.వి. క్రిష్ణమాచారి కమిటి -1960
3. కె.సంతానం కమిటి -1963
4. అశోక్ మెహతా కమిటి ( కేంద్ర ప్రభుత్వం) - 1977
5. జి.వి.కె రావు కమిటీ (రాష్ట్ర ప్రభుత్వం) - 1985
6. సర్కారియా కమిషన్ - 1986
7. ఎల్.ఎమ్ సింఘ్వి కమిటి - 1987
8. జె.వెంగల్‌రావు కమిటి
9. సి.నర్సింహం మెహతా కమిటీ (రాష్ట్ర ప్రభుత్వం)

*ఎన్ని మార్పులు చేసినా, పంచాయితీరాజ్ సంస్థలు బలపడలేకపోయాయి పోగా ఇంకా బలహీనపడిపోయాయి కారణం :*

* ఈ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి లేకపోవడం వల్ల నిర్లక్ష్యానికి గురయ్యాయి.
* ప్రజలందరికి, ముఖ్యంగా బలహీన వర్గాల వారికి, వెనుకబడిన వారికి, స్త్రీలకు ఈ సంస్థలలో సరైన ప్రాతినిధ్యం లేకపోవడం.
* ఈ సంస్థలకు ఎన్నికలు సక్రమంగా జరిపించకపోవడం.
* విధులను స్పష్టంగా నిర్దేశించకపోవడం.

* బాధ్యతలు నిర్వర్తించడానికి కావలసిన నిధులను, అధికారులను ఇవ్వకపోవడం.

* ఈ సంస్థల పట్ల ప్రజలకు సరైన దృక్పధం కల్పించకపోవడం.

* పై స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు తమ అధిపత్యానికి పంచాయితీరాజ్ సంస్థల ఎదుగుదల గండికొడుతుందని భావించడం.

* ఈ సంస్థలను సమర్ధవంతంగా నడిపించడానికి స్థానిక నాయకత్వానికి సరైన శిక్షణ లేకపోవడం.

## 73వ రాజ్యాంగ సవరణ - ముఖ్యంశాలు

1992వ సంవత్సరం అమోదించబడిన రాజ్యాంగ సవరణ చట్టం 24.04.1993 నాడు దేశం అంతా అమలులోకి వచ్చింది. తద్వారా పంచాయితీరాజ్ సంస్థలకు రాజ్యాంగ పరమైన హోదా కల్పించబడింది.

*చట్టంలోని ప్రధాన అంశాలు :*

* దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో మూడు స్థాయిలలో పంచాయితీరాజ్ వ్యవస్థను ఏర్పరచాలి.

* 243 ఎ అధికరణ ప్రకారం గ్రామ పంచాయితీలలో గ్రామసభలను ఏర్పాటు చేసి, ప్రతి సంవత్సరం కనీసం రెండుసార్లు తప్పనిసరిగా గ్రామసభ జరిపించాలి. ప్రస్తుతం సంవత్సరానికి 4 సార్లు గ్రామసభ జరుపవలసినదిగా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల సంఖ్య 791 ద్వారా ఆదేశాలు జారీ చేయడమైనది.

* 243 ఇ అధికరణ ప్రకారం ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు తప్పనిసరిగా జరపాలి. మధ్యంతర ఎన్నిలకలు అవసరమైతే 6 నెలల్లోనే నిర్వహించాలి.

* 243 డి అధికరణ ప్రకారం గ్రామ పంచాయితీ నుండి, జిల్లా పరిషత్ వరకు అన్ని స్థాయిలలోను మూడవ వంతు స్థానాలను మహిళలకు కేటాయించాలి.

* 243 ఐ అధికరణ ప్రకారం రాష్ట్ర స్థాయిలో చట్టపరంగా రాష్ట్ర ఆర్థిక కమీషన్ ఏర్పాటు చేయాలి.

* 243 కె అధికరణ ప్రకారం రాష్ట్రస్థాయిలో ఎన్నికల సంఘం ఏర్పాటు చేయాలి.

* 243 డి అధికరణలో నిర్దేశించిన విధంగా జనాభా ప్రాతిపదికన షెడ్యూల్డు కులాల, తెగల వారిని అన్ని స్థాయిలలో రిజర్వేషన్ కల్పించాలి. ఇందులో కూడా మూడవ వంతు మహిళలు ఉండాలి.

* అన్ని స్థాయిలలోను సభ్యుల ఎన్నిక ప్రత్యక్షంగా జరగాలి. మండల, జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్ష ఎన్నికలు మాత్రం పరోక్షంగా జరగాలి.గ్రామ పంచాయితీ సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జరగాలనే విషయం రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలివేయాలని నిర్ణయించారు. మన రాష్ట్రంలో ఈ ఎన్నిక ప్రత్యక్షంగా జరిగింది.

* వెనుకబడిన వర్గాల వారికి ఎంతవరకు రిజర్వేషన్ కల్పించవచ్చు అనే విషయాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చూసుకుంటాయి. ప్రస్తుతము వెనకబడిన తరగతులకు 34 శాతంరిజర్వేషన్లు అమలు జరుగుచున్నాయి.

* 243 జి అధికరణమునకు 11వ షెడ్యూలును జతపరచి దాని ప్రకారం 29 రకాల కార్యక్రమాలను కేటాయించవచ్చునని సూచించారు.

* 74వ రాజ్యాంగ సవరణ 243-జడ్ డి ప్రకారం ప్రతి జిల్లాకు జిల్లా ప్రణాళికా కమిటీ ఏర్పాటు చేయాలి.

* ముఖ్యంగా రాజ్యాంగంలోని 243-జి అధికరణమునకు 11 వ షెడ్యూల్డ్‌ను జతపరచి ఆ ప్రకారం ఈక్రింద తెలిపిన 29 అంశాలను పంచాయతీరాజ్ సంస్థలకు బదిలీ చేయవచ్చునని సూచించబడింది.

1. వ్యవసాయం,వ్యవసాయ విస్తరణతో సహా
2. భూమి అభివృద్ధి భూసంస్కరణల అమలు, భూమి ఏకీకరణ భూసార పరిరక్షణ.
3. చిన్న తరహా సాగు నీరు-నీటి నిర్వహణ వాటర్‌షెడ్ అభివృద్ధి
4. పశుసంవర్ధన-పాడి పరిశ్రమ,కోళ్ళ పరిశ్రమ
5. మత్స్య పరిశ్రమ
6. సామాజిక అటవీ పెంపకం తోటల పెంపకం
7. చిన్నతరహా అటవీ ఉత్పత్తి
8. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలతో సహా చిన్న తరహా పరిశ్రమలు
9. ఖాదీ మరియు గ్రామీణ కుటీర పరిశ్రమలు
10. గ్రామీణ గృహ నిర్మాణం
11. త్రాగు నీరు
12. ఇంధనము- పశుగ్రాసం
13. రోడ్లు, కల్వర్టులు, వంతెనలు, కాల్వలు,జల మార్గాలు, ఇతర కమ్యూనికేషన్ విధానాలు
14 గ్రామీణ విద్యుదీకరణ, విద్యుచ్ఛక్తి పంపిణీతో సహా
15. సాంప్రదాయేతర ఇంధన వనరులు
16. దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాలు
17. విద్య-ప్రాధమిక, సెకండరీ పాఠశాలలతో సహా
18. సాంకేతిక శిక్షణ- వృత్తి పరమైన విద్య
19. వయోజన విద్య-అనియత విద్య
20. గ్రంధాలయాలు
21. సాంస్కృతిక కార్యక్రమాలు
22. మార్కెట్లు-సేవలు
23. ఆసుపత్రులు-ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు, డిస్పెన్సరీలతో సహా ఆరోగ్యం, పారిశుధ్యం
24. కుటుంబ సంక్షేమం
25. స్త్రీ, శిశు అభ్యుదయం
26. సాంఘిక సంక్షేమం- వికలాంగుల సంక్షేమం

# ప్రభుత్వ పథకాలు భేష్

## జమ్ముకశ్మీర్ ఎమ్మెల్సీల కితాబు



*జమ్ము కాశ్మీర్ బృందాన్ని సన్మానిస్తున్న జడ్పీ అధ్యక్షురాలు రాజమణి, చిత్రంలో మురళీయాదవ్ తదితరులు*

**తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, వాటి అమలతీరు బాగుందని జమ్ముకాశ్మీర్ ఎమ్మెల్సీలు కితాబిచ్చారు. స్థానిక సంస్థల పాలనా వ్యవహారాలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్రానికి వచ్చిన జమ్ముకశ్మీర్ ప్రజాప్రతినిధుల బృందం సంగారెడ్డి, రామచంద్రాపురంలో పర్యటించింది.**

జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ అధ్యక్షురాలు రాజమణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన వారిని జిల్లా అధికారులు, జడ్పీటీసీ సభ్యులు ఆహ్వానించారు. జడ్పీ ఎన్నికల తీరు, నిధుల సమీకరణ, ఖర్చు వ్యవహారాలను జడ్పీ సీఈవో ఒ.జె.మధు వారికి వివరించారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల వారీగా అమలవుతున్న పథకాలను వివరించారు.

ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ.. మిషన్ కాకతీయ, తెలంగాణ తాగునీటి సరఫరా ప్రాజెక్టు, హరితహారం, షాదీముబారక్, పంచాయతీరాజ్ వ్యవస్థ తరహా విధానాలను తమ రాష్ట్రంలోనూ అమలు చేస్తామని పేర్కొన్నారు. త్వరలో తెలంగాణ ముఖ్యమంత్రిని, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను తమ రాష్ట్రానికి ఆహ్వానించి తీసుకెళ్తామని చెప్పారు.

◆

27. బలహీనవర్గాల సంక్షేమం -ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమంతో సహా
28. ప్రజా పంపిణీ వ్యవస్థ
29. సామాజిక ఆస్తుల నిర్వహణ

*రాష్ట్రాల స్వయం నిర్ణయాలకు వదిలివేసిన అంశాలు :*

* సర్పంచ్ పదవులకు నేరుగా ఎన్నికలు
* 30.05.1995 తరువాత ఇద్దరు పిల్లలకు మించి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయటానికి లేదా పదవిలో కొనసాగటానికి అనర్హులు.
* వెనకబడిన వర్గాలకు కనీసం 34 శాతం రిజర్వేషన్లు
* ఉపసర్పంచ్ మండల, జిల్లా అధ్యక్షలు మరియు ఉపాధ్యక్షులపై రెండు సంవత్సరాల వరకు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టకుండా చట్టంలో పొందపర్చారు. అయితే 2009 లో పంచాయితీరాజ్ చట్టానికి చేయబడిన సవరణ ద్వారా సదరు కాలాన్ని 4 సంవత్సరాలకు పెంచడం జరిగింది.
* గ్రామ పంచాయితీ ఎన్నికలు పార్టీ రహితంగా, మండల జిల్లా ప్రజాపరిషత్‌లలో పార్టీ పరంగా ఎన్నికలు జరుగుతాయి.

## పంచాయితీరాజ్ చట్టం 1994

రాజ్యాంగం 73వ సవరణ చట్టానికి అనుగుణంగా దేశం అంతా ఒకేరకమైన పంచాయితీ పాలన ఏర్పాటు కావాలి. కనుక మన రాష్ట్రంలో కూడా పాత చట్టాన్ని మార్పు చేశారు. ఇంతకు ముందు మన రాష్ట్రంలో గ్రామ పంచాయితీలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయితీల చట్టం 1964, మండల పరిషత్తులకు, జిల్లా పరిషత్తులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ మండల ప్రజా పరిషత్తులు, జిల్లా ప్రజా పరిషత్తులు మరియు జిల్లా ప్రణాళిక, అభివృద్ధి సమీక్ష మండలాల చట్టం 1986, ఎన్నికలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల సంస్కరణల చట్టం 1989 అమలులో ఉండేవి.

అయితే రాజ్యాంగం 73వ సవరణ తర్వాత ఈ మూడు చట్టాల స్థానంలో క్రొత్తగా ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 30.05.1994 నుండి అమలులోనికి వచ్చింది.

వీటి పరిపాలన విధానం ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టంలో ఎనిమిది భాగాలుగా, సెక్షన్లుగా విభజించడం జరిగింది.

*– జి. జయపాల్‌రెడ్డి,*
*సి.ఇ.ఓ.జడ్.పి (రిటైర్డ్) & సలహాదారుడు,*
*టిసిపార్డ్*

# పీసా చట్టం అనుసరించి నిర్వహించే గ్రామసభ

**షెడ్యూలు ప్రాంతాలు భౌగోళిక నేపథ్యాన్ని, గిరిజనుల ప్రత్యేక జీవన విధానాన్ని దృష్టిలో ఉంచుకొని పీసా చట్టం 1996లో అమలులోనికి వచ్చింది. ఈ చట్టం అనుసరించి గిరిజన ప్రాంతాల గ్రామపంచాయతీలలో గ్రామసభలను నిర్వహించవలసి ఉంటుంది.**

### గ్రామసభ నిర్వహణ - తీసుకోవలసిన జాగ్రత్తలు

* గ్రామంలోని ప్రజల ఆచార, సాంప్రదాయాలను, వారి సాంస్కృతిక విలక్షణతను, సామాజిక వనరులను కాపాడటానికి, సంరక్షించటానికి వారి ఆచారాలను అనుసరించి వివాదాలను పరిష్కరించటానికి గ్రామసభలను ఏర్పాటు చేయాలి.
* ఈ గ్రామాలు సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రణాళికలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులు అమలు చేయడానికి ముందస్తుగా గ్రామసభ అనుమతి పొందాల్సి ఉంటుంది.
* పేదరిక నిర్మూలన, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో లబ్ధిదారులను గుర్తించి, ఎంపిక చేయడానికి గ్రామసభ నిర్వహించాలి.
* పీసా చట్టం క్రింద అమలువుతున్న ప్రణాళికలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులకు గ్రామస్థాయిలో ఖర్చు చేసిన నిధులకు వినియోగ ధృవీకరణ పత్రాలను గ్రామసభ ఆమోదించాలి.
* ఆయా ప్రాంతాలలో ఈ క్రింది అంశాల విషయంగా గ్రామసభకు అధికారాలు కల్పించారు.
  - ❑ మత్తు పదార్థాల వినియోగంపై నిషేధం లేదా మత్తుపదార్థాల అమ్మకం, వినియోగంపై నియంత్రణ లేదా క్రమబద్దీకరణ చేయటానికి అధికారం.
  - ❑ చిన్న తరహా అటవీ ఉత్పత్తులపై యాజమాన్య హక్కులు
  - ❑ షెడ్యూల్డు ప్రాంతాల్లో భూమి అన్యాక్రాంతం కాకుండా చూపే అధికారం, చట్ట విరుద్ధంగా అన్యాక్రాంతం అయిన భూములను తిరిగి స్వాధీనపర్చటానికి అధికారం.
  - ❑ గ్రామీణ మార్కెట్టు (సంత)ల నిర్వహణకు అధికారం.
  - ❑ గిరిజన ప్రజలకు రుణం ఇస్తున్న సంస్థలు, వ్యక్తులపై నియంత్రణ అధికారం.
  - ❑ స్థానిక ప్రణాళికలు, వాటికి కావాల్సిన వనరులపై నియంత్రణ అధికారం.



### గ్రామపంచాయతీ సమావేశాలు

ప్రజల సమస్యలు, అవసరాలు, గ్రామాభివృద్ధి గురించి గ్రామ పంచాయతీ మరియు కార్యాచరణ కమిటీల సమావేశాలలో ప్రజా ప్రతినిధులు చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలి. కనీసం నెలకొకసారైనా సభ్యులను సమావేశపరచి ఎజెండా అంశాలను చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి. మెజారిటీ సభ్యుల నిర్ణయాలను అమలు చేయాలి. జి.ఓ.యం. ఎస్.నెం. 227 - పంచాయతీలు - 2 తేదీ 13.04.1995 ద్వారా గ్రామ పంచాయతీ మరియు వాటి కమిటీల ప్రొసీడింగులకు సంబంధించిన నియమావళిని ప్రభుత్వం జారీ చేసింది.

*గ్రామపంచాయతీ సమావేశాలు 4 రకాలు*

1. సాధారణ సమావేశం
2. అభ్యర్థన సమావేశం
3. అత్యవసర సమావేశం
4. ప్రత్యేక సమావేశం

**1. సాధారణ సమావేశం :**

సర్పంచ్ ప్రతి నెలా తప్పనిసరిగా ఒక సాధారణ సమావేశం నిర్వహించాలి. సమావేశపు తేదీకి స్పష్టంగా మూడు రోజులు ముందుగా (నోటీసు అందినరోజు, సమావేశం రోజు మినహా) ఎజెండాతో కూడిన నోటీసు సభ్యులకు అందజేసిన తరువాత మాత్రమే సాధారణ సమావేశం నిర్వహించాలి. గ్రామపంచాయతీలో గల సభ్యులు 1/3 వంతు సభ్యులు హాజరైతే కానీ ఈ సమావేశం నిర్వహించరాదు.

సమావేశం నిర్వహించటానికి తేదీని/అజెండా/సమయం/నిర్ణయించటానికి కార్యదర్శి, సర్పంచ్‌గా లిఖితపూర్వక నోటు సమర్పించాలి. సర్పంచ్ సమావేశం తేదీని నిర్ణయించిన, నిర్ణయించకపోయినా సమావేశం 90 రోజులలోపు నిర్వహించనట్లయితే పంచాయతీ కార్యదర్శి సెక్షన్ (31) ఆంధ్రప్రదేశ్ పంచాయతీ చట్టం - 1994 ప్రకారం క్రమశిక్షణ చర్యకు గురిఅగును.

చర్చనీయాంశాలు ఎక్కువగా ఉన్నపుడు సమయం చాలనప్పుడు సమావేశాలను వాయిదా వేయవచ్చు. అలా వాయిదాపడిన సమావేశాలకు తిరిగి నోటీసు పంపనవసరం లేదు. కానీ కొత్త అంశాలు చర్చించరాదు. అయితే హాజరుకాని సభ్యులకు మాత్రం అట్టి సమావేశం ఏ తేదీకి వాయిదా పడిందో నోటీసు ద్వారా తెలియజేయవచ్చు.

**2. అభ్యర్థన సమావేశం :**

గ్రామ పంచాయతీ సమావేశాన్ని గ్రామ పంచాయతీ మొత్తం సభ్యులలో కనీసం మూడవ వంతు సభ్యులు వ్రాతపూర్వకంగా సమావేశం నిర్వహించమని కోరితే సర్పంచ్ గ్రామ పంచాయతీ సమావేశం ఏర్పాటు చేయాలి. అయితే ఆ సమావేశాన్ని ఎప్పటిలోగా ఎందు నిమిత్తం ఏర్పాటు చేయాలని కోరుతున్నారో స్పష్టంగా తెలియజేస్తూ సమావేశానికి 10 రోజుల ముందు సర్పంచ్‌కు గానీ, పంచాయతీ కార్యదర్శికి గానీ అప్పటికి కార్యాలయం నడిపిస్తున్న మరొక వ్యక్తికి గానీ నోటీసు అందజేయాలి. నోటీసు అందిన 5 రోజులలోగా సర్పంచ్ నోటీసులో తెలపబడిన అంశాలను చర్చించే నిమిత్తం సమావేశం ఏర్పాటు చేయాలి.

ఇట్టి సమావేశం ఏర్పాటు చేయడంలో సర్పంచ్ విఫలమైతే నోటీసులో సంతకం చేసిన సభ్యులే కనీస 3 రోజుల వ్యవధిలో సభ్యులకు నోటీసు ఇచ్చి గడువు లోపల వారే సమావేశం నిర్వహించవచ్చు.

**3. అత్యవసర సమావేశం :**

ఏదైనా ఒక అంశంపై అత్యవసరంగా నిర్ణయం తీసుకోవలసి వచ్చినపుడు సభ్యులకు ఒక్కరోజు వ్యవధిలో అజెండాతో కూడిన నోటీసు అందజేసి సమావేశం నిర్వహించవచ్చు. ఆ సమావేశంలో అత్యవసరమైన విషయాలను మాత్రమే చర్చకు తీసుకొని రావాలి. సాధారణ విషయాలు చర్చించరాదు. గ్రామ పంచాయతీలో గల సభ్యులలె 1/3వంతు సభ్యులు హాజరైతే కానీ ఈ సమావేశం నిర్వహించరాదు.

*ఉదా :*

1. మంచినీటి సరఫరా, పారిశుధ్య సంబంధిత అంశాల
2. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవలసిన తక్షణ చర్యలు
3. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అత్యవసరంగా పంపవలసిన తీర్మానాలు మొదలైనవి.

**4. ప్రత్యేక సమావేశం :**

ఏదైనా ఒక ప్రత్యేక విషయంపై నిర్ణయం తీసుకోవటానికి మూడు స్పష్టమైన రోజుల వ్యవధితోనూ లేదా అంతకంటే తక్కువ వ్యవధితోనూ ఎజెండాతో కూడిన నోటీసును సభ్యులకు పంపి సమావేశం నిర్వహించాలి. ఈ సమావేశంలో చేయబడిన తీర్మానాలను మొత్తం సభ్యులలో కనీసం సగం మంది ఆమోదించాలి.

*ఉదా :*

* మూడు మాసాలలోపు ఏదైనా తీర్మానం రద్దు చేయడం లేదా మార్పు చేయడం
* ఉప సర్పంచ్ ఎన్నిక
* ఉప సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం
* ఇంటి పన్నులపై ప్రత్యేక పన్ను
* ప్రత్యేక ప్రయోజనం కోసం వ్యవసాయ భూములపై పన్ను
* ఖాళీ స్థలాలపై పన్ను

## నిర్వహించవలసిన రిజిష్టర్లు

1) ఎజెండా రిజిష్టర్
2) సభ్యుల హాజరు రిజిష్టరు
3) మినిట్స్ పుస్తకం

## సభాధ్యక్షత

* సర్పంచ్ సభకు అధ్యక్షత వహించాలి
* సర్పంచ్ హాజరు కానిచో ఉప సర్పంచ్ అధ్యక్షత వహించాలి
* ఉప సర్పంచ్ కూడా హాజరుకానిచో సభ్యులలో ఒకరిని ఎన్నుకొని సభకు తాత్కాలిక అధ్యక్షుడుగా నియమించవచ్చు.

## సమావేశాలలో పాల్గొనే సభ్యులు

* గ్రామ పంచాయతీ వార్డుసభ్యులు – వీరికి సమావేశపు తీర్మాణాల పై, ఉపసర్పంచ్ ఎన్నిక, అవిశ్వాస తీర్మానాలపై ఓటు వేసే అధికారం కలిగి ఉంటారు.
* సర్పంచ్ సభకు అధ్యక్షత వహించాలిఎమ్.పి.టిసి. సభ్యులు (శాశ్వత ఆహ్వానితులు) – సమావేశపు చర్చలో పాల్గొని సూచనలు, సలహా ఇవ్వవచ్చు. కానీ తీర్మానంపై ఓటు వేసే అధికారం లేదు.
* గ్రామ పంచాయతీ కో–ఆప్షన్ సభ్యులు
* ప్రజలు (అధ్యక్షుని అనుమతితో)

## సమావేశం అజెండా

సమావేశంలో చర్చించే అంశాలను అజెండా అంటారు. అజెండాలో అంశాలను ఈ క్రింద క్రమంలో చేర్చాలి.

* గత సమావేశపు తీర్మానాలను చదివి వినిపించటం, ధృవీకరించటం
* గత సమావేశం నుండి ఇప్పటివరకు గల జమాఖర్చులు, జనన మరణాల నమోదు, డిమాండు కలెక్షన్ బ్యాలెన్సు మొదలైన వివరాలు.
* గత సమావేశం నుండి ఇప్పటివరకు వివిధ రకాల మంజూరీ కోసం స్వీకరించబడిన దరఖాస్తులు
* గత సమావేశం నుండి ఇప్పటి వరకు నిర్వహించబడిన పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, మంచినీటి సరఫరా అంశాలపై సమీక్ష.
* అభివృద్ధి పనులు
* ఇతర ముఖ్య అంశాలు ఏమైనా ఉంటే సర్పంచ్‌తో చర్చించి పంచాయతీ కార్యదర్శి వాటిని కూడా అజెండాలో చేర్చాలి.
* 'ఇతర విషయాలు అధ్యక్షుని అనుమతిత' అని అజెండా అంశాలలో చేర్చరాదు.

## సమావేశం నోటీసు జారీచేసే విధానం

* ఎజెండాతో కూడిన నోటీసుపై పంచాయతీ కార్యదర్శి సంతకం చేసి సభ్యులకు పంపించాలి.



* నోటీసు జారీ చేసే కాలంలో సభ్యుడు ఇంటిలో కానీ, గ్రామంలోకానీ లేనట్లైతే అటి ఓటీసును వారి కుటుంబంలో పెద్దలకు ఎవరికైనా అందచేసి ఆ యక్తి సంతకం పొందాలి. కుటుంబ సభ్యులు ఎవరూ లేనియెడల నౌకరు ఉన్నచో ఇచ్చి వారి నుండి రశీదు పొందాలి.
* సభ్యుడు తాత్కాలికంగా గ్రామం విడిచి వెళ్ళి యెడల వారి అడ్రసు తెలుసుకొని అటి అడ్రసుకు రిజిష్టరు పోస్టు ద్వారా సదరు నోటీసు పంపాలి.
* సభ్యుని అడ్రసు తెలియపోయినా లేక వారి ఇంటిలో సభ్యులు నోటీసు తీసుకోటానికి నిరాకరించనా నోటీసు ప్రతిని సభ్యుని ఇంటి తలుపుకు అంటించి ఇద్దరు పెద్దల సాక్షి సంతకాన్ని ఆఫీసు ప్రతిపై పొందాలి.

## హాజరు

హాజరుపట్టీలో సమావేశానికి హాజరైన సభ్యుల సంతకం/వేలిముద్రలు సమావేశ ప్రారంభంలోనే తీసుకోవాలి. సమావేశం చివరలో సర్పంచ్ హాజరు రిజిష్టరులో తనతోపాటు హాజరైప సభ్యుల సమయం, సంఖ్యను వివరిస్తూ సంతకం చేయాలి. మధ్యలో ఎవరైనా వెళ్ళిపోయినట్లయితే ఆ విషయాన్ని నమోదు చేయాలి.

## మినిట్సు

గ్రామ పంచాయతీ ప్రతి సమావేశం చర్యలను మినిట్సు పుస్తకంలో వ్రాసి సమావేశం చివరిలో అధ్యక్షుడు సంతకం చేయాలి. తదుపరి సమావేశంలో మినిట్సు చదివి, చదివిన విషయాన్ని రికార్డు చేయాలి. ఎజెండా ప్రతిపాదించిన క్రమంలోనే సమావేశం ప్రొసీడింగ్స్‌ను పారంభించాలి.

## మినిట్సు వ్రాసే పద్ధతి

* ఎజెండా అంశాలను చదివి సభ్యుల చర్చల తర్వాత మెజారిటీ నిర్ణయం ప్రకారం తీర్మానాలను అంశాలకు ఎదురుగా రికార్డు చేయాలి.
* ఏదైనా అంశం లేదా తీర్మానం ఓటింగ్ ద్వారా నిర్ణయించబడినపుడు ఎవరెవరు అనుకూలంగా, ఎవరెవరు ప్రతికూలంగా ఓటు చేసినది రికార్డు చేయాలి.
* ఓటింగ్‌లో ఇరుపక్షాలకు సరిసమానమైన ఓట్లు వస్తే సభాధ్యక్షునకు నిర్ణయాత్మక ఓటు (కాస్టింగ్ ఓటు) ఉన్నది. అధ్యక్షుడు తన నిర్ణాయక ఓటును వినియోగించుకోవచ్చు.
* ఆమోదించిన తీర్మానం 3 నెలలోపు రద్దు చేయరాదు.

## సర్పంచ్ లేక సభ్యులకు స్వప్రయోజనాలు ఉన్నట్లయితే

గ్రామ పంచాయతీ పరిశీలిస్తున్న అంశం ఆర్థిక లావాదేవీలతో ముడిపడి ఉన్నట్లయితే, అటువంటి ఆర్థిక లావాదేవీలతో స్వయంగా కానీ, సదరు ఆర్థిక లావాదేవీలతో సంబంధం కలిగి ఉన్న కంపెనీలో భాగస్వామిగా ఉన్న సభ్యుడు అట్టి సమావేశంలో పాల్గొనడం గానీ ఓటు చేయడం కానీ చేయకూడదు.

ఏ సభ్యునికైనా చర్చ విషయంలో స్వప్రయోజనం ఉన్నదని సర్పంచ్ భావించినట్లయితే అట్టి సభ్యుడు/సభ్యురాలును సమావేశానికి హాజరు కాకుండా చేయవచ్చు.

ఏ సభ్యులైనా తమను సమావేశంలో పాల్గొననీయని ఉత్తర్వులను సవాలు చేయవచ్చు. అట్టి సవాలును సభ్యుల ముందు ఉంచితే సమావేశం తుది నిర్ణయం తీసుకుంటుంది.

సభ ముందున్న ఏ విషయంలోనైనా సర్పంచ్‌కు స్వప్రయోజనం ఉందని ఎవరైనా సభ్యుడు అభిప్రాయపడినట్లయితే సర్పంచ్ తనకు తానుగా సభ నుండి బయటకు వెళ్ళిపోవాలి.

## సమావేశాలకు గైరు హాజరు - పరిణామాలు

* ఎవరైనా సభ్యులు తన పదవీకాలం ప్రారంభమైన తేదీ నుండి లేదా తాను హాజరైన కడపటి సమావేశం నుండి 90 దినాలలో గ్రామపంచాయతీ సమావేశాలకు హాజరుకాక పోయిన లేదా వరుసగా నిర్వహించిన మూడు సాధారణ సమావేశాలకు హాజరు కాకపోయినా సభ్యునిగా అర్హత కోల్పోతారు.

సభ్యులు సమావేశాలకు బుద్ధిపూర్వకంగా లేదా తన అదుపులో లేని కారణాల వల్ల హాజరు కాకపోయినా అనర్హత ప్రాప్తిస్తుంది.

మహిళా సభ్యురాలి విషయంలో నెలలు నిండినందున కల్గిన శారీరక అశక్తత వల్ల తాను ఏ తేదీ నుండి హాజరు కాలేకపోతున్నారో తెలపుతూ సర్పంచ్ లేదా కార్యదర్శికి తెలియపరచాలి. అలాంటపుడు పై 90 రోజుల గడువును లెక్కించేటప్పుడు ఆ సభ్యురాలి విషయంలో 4 నెలల కాలాన్ని తీసివేయాలి. (సెక్షన్ 20 (బి).

సెక్షన్-2 (బి) ప్రకారం ఎవరైనా సభ్యుడు/సభ్యురాలు అనర్హత పొందితే సర్పంచ్ లేదా కార్యదర్శి ఈ విషయాన్ని వెంటనే జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేయాలి.

జిల్లా పంచాయతీ అధికారి నుండి నోటీసు అందిన 30 రోజులలో అనర్హత పొందిన సభ్యుడు / సభ్యురాలు గ్రామ పంచాయతీకి దరఖాస్తు చేసుకొనినచో తిరిగి సభ్యత్వం పొందును. అయితే రెండవసారి ఇదే కారణం చేత అనర్హత పొందినట్లయితే వారిని తిరిగి సభ్యుడు/ సభ్యురాలిగా పదవి పునరుద్ధరణ చేయు విషయం గ్రామ పంచాయతీ నిర్ణయంపై ఆధారపడి ఉండును.

# పర్యావరణ పరిరక్షణ - మన బాధ్యత



**మన చుట్టు ఉండే మన పరిసరాలే మన పర్యావరణం. జీవజలాన్ని ప్రభావితం చేసే బాహ్య పరిస్థితులు, వాటి ప్రభావాల మొత్తం కలుయికనే పర్యావరణం. పర్యావరణాన్ని జీవరహిత, సజీవ భాగాలుగా విభజించవచ్చు.ఈ పర్యావరణ భాగాలు కలిసి సమిష్టిగా ప్రభావాన్ని చూపిస్తాయి.**

మార్పు అనేది పర్యావరణ ప్రాథమిక లక్షణం. కొన్ని మార్పులు వేగవంతంగానూ, కొన్ని మార్పులు ఆలస్యంగానూ జరుగుతూ ఉంటాయి.

ప్రస్తుతం ఉన్న పర్యావరణ సమస్యలకు 'పర్యావరణ విద్య' దానికి తగినట్టుగా కార్యాచరణ చేయడం చాలా ముఖ్యం. దీనివలన పర్యావరణ నాశనాన్ని, నష్టాన్ని అదుపు చేసేందుకు, పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు దోహదపడుతుంది.

* వృక్ష సమూహం శబ్ద కాలుష్యాన్ని తగ్గిస్తాయి. 30 చదరపు మీటర్ల మేర వున్న వృక్షాలు 6-8 డెసిబెల్స్ వరకు శబ్దాన్ని తగ్గిస్తాయి.

పరిసరాలు, మన చుట్టూ ఉండే ప్రాంతాలు పచ్చగా ఉండాలని అందరం కోరుకుంటాం. పచ్చగా ఉండటం అంటే కేవలం చెట్లు మాత్రమే నాటడం కాదు. పొదలు, తీగలు, గడ్డి, కూరగాయలు, మూలికా మొక్కలు ఇలా ఎన్నో రకాల మొక్కలు పచ్చదనంలో భాగమే. మొక్కల ఆకారం, పరిణామం ఎలా ఉన్నా వాటి ప్రయోజనాలు మాత్రమే ఒకే రకంగా ఉంటాయి.

## ఎకో క్యాలెండర్

* 14 -30 జనవరి - జంతు పరిరక్షణ పక్షోత్సవం
* 2 ఫిబ్రవరి -వరల్డ్ వెట్‌ల్యాండ్స్ డే (ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం)
* 21 మార్చి - వరల్డ్ ఫారెస్ట్ డే
* 22 మార్చి - వరల్డ్ డే ఫర్ వాటర్
* 23 మార్చి - వరల్డ్ మెట్రోలాజికల్ డే
* 22 ఏప్రిల్ - ఎర్త్‌డే, వాటర్ రిసోర్స్ డే
* 5 జూన్ - వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డే
* 17 జూన్ - వరల్డ్ డే టు కాంబాట్ డిసర్టిఫికేషన్ - అండ్ డ్రాట్
* 1 జూలై - వనమహోత్సవం డే
* 6 ఆగష్టు - హిరోషిమా డే
* 5 అక్టోబర్ - వరల్డ్ హేబిటేషన్ డే
* 2 అక్టోబర్ - ఇంటర్‌నేషనల్ నేచురల్ డిసాస్టర్ ప్రివెన్షన్ డే
* 4 అక్టోబర్ - వరల్డ్ యానిమల్ వెల్ఫేర్ డే
* 11 అక్టోబర్ - ఇంటర్ నేషనల్ డే ఫర్ నేచరల్ డిసాస్టర్ రిడక్షన్
* 16 అక్టోబర్ - వరల్డ్ ఫుడ్ డే
* 24 నవంబర్ - వరల్డ్ బయోడైవర్సిటీ కన్వెన్షన్ డే
* 2 డిసెంబర్ - భోపాల్ గ్యాస్ ట్రాజెడీ డే
* 3 డిసెంబర్ - వరల్డ్ కన్వెన్షన్ డే
* 29 డిసెంబర్ - ఇంటర్ నేషనల్ డే ఫర్ బయాలజికల్ డైవర్సిటి

పర్యావరణాన్ని రక్షించే కార్యక్రమాలు ఎవరికివారు తమ ఇళ్ళ నుండే ప్రారంభించాలి, పిల్లలైతే స్కూళ్లలో కార్యక్రమాలు చేపట్టే విధంగా ప్రోత్సహించాలి. పిల్లలు, పెద్దలు పర్యావరణ పరిరక్షణకు చేసే కార్యక్రమాల వల్ల ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ప్రత్యక్షంగా తెలుసుకోగల్గుతారు.

గ్రామాల్లో, పట్టణాల్లో, మురికి వాడల్లో ఇలా ఎక్కడ నివసిస్తున్నప్పటికి పర్యావరణ పరిరక్షణ మెరుగుపరిచే కార్యక్రమాలు చేయవచ్చు. ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని తమ చేతల ద్వారా ఎంతో ప్రభావితం చేయగల రని గ్రహించాలి, వారు చేసే పనుల వలన పర్యావరణంపై ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తున్నాయో అర్థం చేసుకోగలగాలి.

ముఖ్యంగా పర్యావరణానికి ఏ ప్రమాదం కలిగించని ఎన్నో సాంప్రదాయ పద్ధతులు ఉన్నాయి. వాటిని చేయకుండా అవగాహనను పెంచుకుంటూ వాటిని జాగ్రత్తగా అమలుచేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత జరుపుతుంది.

## గ్రీన్ ఫ్యూచర్

* పూర్తిగా ఎదిగిన చెట్టు ఒక వ్యక్తి వదిలే కార్బన్‌డైఆక్సైడ్‌ను ఆక్సిజన్‌గా మారుస్తుంది.
* 20-40 చదరపు మీటర్ల పచ్చని ప్రాంతం నుండి ఒక్కరోజులో ఉత్పత్తి అయ్యే ఆక్సిజన్ ఒక వ్యక్తికి ఒక్క రోజు సరిపోతుంది.
* 25000 కిలోమీటర్ల దూరం ప్రయాణించడం ద్వారా ఒక కారు విడుదల చేసిన కాలుష్యాన్ని పూర్తిగా ఎదిగిన చెట్టు పూర్తిగా తేల్చుకుంటుంది.
* చెట్లు, మొక్కలు ఉన్న ప్రాంతంలో ఉష్ణోగ్రతను 10 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు తగ్గిస్తాయి.

**- ఆర్. ఝాన్సీరాణి**
*ఫ్యాకల్టీ, టిసిపార్డ్*

# ఆప్తమిత్రుని ఆర్తి



**నే నొక చిన్న, సున్నితమైన అల్పజీవిని. అన్నదాత రైతన్న నా ఆప్తమిత్రుడు . నా ప్రాణమిత్రునికి అత్యంత ప్రయోజనాన్ని అందిస్తూ ఎల్లవేళల అతని మేలుకోరుకునే అభాగ్యురాలిని. అతని సహకారంతో జీవితాన్ని గడపాలనే ఆకాంక్ష కలిగిన అల్పజీవిని.**

నా నివాసం నేలలో 15-30 సెం.మీ. దిగువన, ఒక మోస్తరు తడినేల 40-50% పదును. నేను అధిక ఉష్ణోగ్రతను తట్టుకోలేను. నా ప్రధాన వృత్తి నేలను సారవంతం చేయడం.

నేను, చిన్న సున్నితమయిన జీవినయిప్పటికీ, నా జీర్ణవ్యవస్థ బలీయంగా ఉంటుంది. ఎన్నో ఎంజైములు జీర్ణవ్యవస్థలో స్రవించడం వలన ఎంతటి క్రొవ్వు పదార్థాలయినా, ప్రొటీనులు, పిండి పదార్థాలయినా జీర్ణించుకోగల శక్తి నాకుంది.

నా ఆహారం కేవలం మట్టి పశువుల పేడ, ఎండిన ఆకులు, కలుపు, కుళ్ళిన సేంద్రీయ వ్యర్థ పదార్థాలు, పచ్చిరొట్ట మొదలైనవి మాత్రమే.

ఈ మిశ్రమాన్ని నేను ఆహారంగా తీసుకుని అన్నవాహికలో బాగా నమిలి కొంత భాగం జీర్ణించుకుని మిగతా దానిని, రోజుకు ఇంచుమించు నా శరీర బరువుకు సమానమయిన వ్యర్థ పదార్థాన్ని రవ్వలుగా, గుళికల ుగా విసర్జిస్తాను. శాస్త్రీయంగా దీనిని 'వర్మీకాస్టింగ్' అంటారని విన్నాను.

నా జీవన ప్రక్రియకు అవసరమైన, అనుకూలమైన ఉష్ణోగ్రత, తేమ, ఉదజని, సూచిక, ఆమ్లజని సాంద్రత ఉన్నప్పుడు, నా పొట్టలో వేల సంఖ్యలో సూక్ష్మాంగజీవులు వుంటాయి. ఇవి ప్రకృతిలోని సహజ, కుళ్లుతున్న జంతు, వృక్ష సంబంధమయిన వ్యర్థ పదార్థాలను ఆహారంగా తీసుకుని బాగా పెరిగి ఎక్కువ ఉత్పత్తి అయ్యి ఎక్కువ చెత్తను ఎరువుగా మారుస్తాయి. దీనినే 'వర్మీకంపోస్ట్' గా పిలుస్తారు.



నా ఈ వర్మికంపోస్టు, నల్లగా ఉంటుంది. తేలికగా ఉటుంది. ఏ రకమయిన వాసన ఉండదు.

నా మిత్రుడు అన్నదాతకు నేను చెప్పేది, నా ఈ వర్మికంపోస్టులో, నత్రజని, భాస్వరం, పొటాస్‌లతో పాటు జింక్, బోరాన్, ఐరన్, కాల్షియమ్, మెగ్నీషియం వంటి సూక్ష్మపోషకాలతో పాటు మొక్కల పెరుగుదలకు హార్మోనులు, ఎంజైములు మరియు మొక్కలలో రోగనిరోధక శక్తిని ఎంచే పోషకాలు అధికంగా ఉంటాయి.

తరతరాలుగా నా ప్రాణ స్నేహితునిగా ఉన్న అన్నదాత, గత కొన్ని దశాబ్దాలుగా అధిక దిగుబడి పొందాలన్న ఆశతో, పోటీపడి అవసరం ఉన్నా, లేకపోయినా రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు విచక్షణారహితంగా వాడుతున్నాడు.

ఫలితంగా భూసారం తగ్గి పురుగుల రోగ నిరోధక శక్తి పెరిగి, పంట నష్టంతో పాటు నా నేస్తం అప్పులపాలవుతున్నాడు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు.

అంతేకాదు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వల్ల, నా జాతి సమూలంగా నాశనమవుతున్న విషయాన్ని విస్మరించాడు. అంతకూ నా పేరు 'వానపాము' అని మీకు మీరే చెప్పనవసరం లేదనుకుంటాను.

ఓ ప్రియ నేస్తామా ! తరతరాలుగా ఉన్న మన అనుబంధాన్ని తెంచుకోకు, లేనిపోని ఆశలకు, దురాశకు పోయి అవగాహన లేమితో ముప్పు కొని తెచ్చుకోకు.

- కె. యాదయ్య,
సీనియర్ ఫ్యాకల్టీ, సంయుక్త సంచాలకులు (పరిపాలన)

# డయాకేర్ - బితో షుగర్‌కి చెక్

**టైప్-1, టైప్-2 రకాల మధుమేహంలోనూ డయాకేర్ వాడవచ్చు. అతిమూత్రం, అలసట, ధాతుక్షయం, అరికాలి మంటలు, తిమ్మిర్లు రావడం. అధిక దాహం, ఎక్కువ ఆకలి, ఒళ్లునొప్పులు మొదలైన లక్షణాలను తక్షణమే నివారించగల శక్తి డయాకేర్-బికి ఉంది.**

**మధుమేహం ఉన్నవారికి లైంగిక శక్తిని పెంచగలిగే ఔషధం కేవలం డయాకేర్ -బి ఒక్కటే. ఈ ఔషధం వాడటంతోపాటు 15-20 నిమిషాల పాటు వ్యాయామం/యోగా/ ప్రాణాయామం లేదా 2 కి.మీ. నడవడం. రాత్రిపూట అల్పాహారం తీసుకోవడం చేస్తే సత్ఫలితాలు పొందవచ్చు.**

ప్రస్తుత కాలంలో శారీరక శ్రమ తక్కువగా ఉండడం, మానసిక ఒత్తిడి అధికంగా ఉండడం వలన శరీరంలో తక్కువ మోతాదులో ఇన్సులిన్ ఉత్పత్తి అయ్యే ఇన్సులిన్‌ను శరీరంలోని కణజాలం సంపూర్ణంగా ఉపయోగించుకోకపోవడం వల్ల, బిఎంఐ 30 కంటే ఎక్కువగా ఉన్నవారిలో మధుమేహం వచ్చే అవకాశాలు ఎక్కువ.

## కొత్త ఔషధం

మధుమేహ నివారణలో ఎటువంటి ప్రమాదం లేకుండా సంపూర్ణంగా శరీరంలో గ్లూకోజ్ శాతాన్ని తగ్గించే మొట్టమొదటి ఔషధం డయాకేర్-బి. ఈ ఔషధంలో వాడిన దాల్చిన చెక్కపై అంతర్జాతీయ స్థాయిలో విశేష పరిశోధనలు జరిగాయి. ఇది ముఖ్యంగా రక్తంలో గల చక్కెరను జీవకణాలకు అందించడంలో అద్భుతమైన ప్రతిభను చూపుతుంది. డయాకేర్-బి శరీరంలో ఇన్సులిన్‌లా పనిచేస్తుంది.

## ప్రత్యేకతలు

* ఇది మధుమేహ నివారణ కోసమే తయారుచేసిన ఔషధం.
* టైప్-2 ఉన్నవారు ఈ డయాకేర్-బి వాడటం వల్ల తమ సామాన్య జీవితాన్ని తిరిగి పొందగలరు. వీరిలో 90 శాతం మందికి సంపూర్ణ ఉపశమనం కలుగుతుంది.
* డయాకేర్- బి హెర్బల్ ప్రొడక్ట్ కావడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవు.
* డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ వారు ఆమోదించిన జీఎంపీ సర్టిఫైడ్ ప్రొడక్ట్ ఇది. క్యాప్సూల్ రూపంలో అన్ని మెడికల్ షాపులలో లభిస్తుంది.
* టైప్-1 ఉన్నవారికి ఈ డయాకేర్-బి వాడుతూనే క్రమేపీ ఇన్సులిన్ మోతాదును తగ్గించుకుంటూ కేవలం డయాకేర్-బి మీద ఆధారపడి ఉపశమనం పొందవచ్చు.




## ఎలా వాడాలి?

* టైప్-1 (ఇన్సులిన్ డిపెండెంట్) ఉదయం, రాత్రి అల్పాహారానికి 15-30 నిమిషాల ముందు 1 క్యాపుల్స్ తీసుకోవాలి.
* టైప్-2 (నాన్ ఇన్సులిన్ డిపెండెంట్) ఉదయం, ముందు 1 క్యాప్సూల్ తీసుకోవాలి. ఒకవేళ మధుమేహం రాకుండా ఉండేందుకు తీసుకోవాలనుకుంటే రోజూ ఉదయం, రాత్రి ఒక క్యాప్సూల్ చొప్పున 3 నెలలు వాడితే మధుమేహం రాకుండా నివారించవచ్చు.
* పిల్లలకు- తినడానికి అరగంట ముందు ప్రతిరోజూ ఒక క్యాప్సుల్ వాడవచ్చు. అయితే డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది.

*గమనిక:* నివారణ కోసం మెడిసిన్ వాడేవారు 15-30 రోజులకోసారి షుగర్ లెవల్స్ పరీక్ష చేయించుకుంటూ ఉంటే మంచి పరిష్కారం దొరుకుతుంది.

*పుత్తూరు తైలం :* కీళ్లు, కండరాలు, ఎముకలు, బెణుకు, నరం, నడుము, మెడ మొదలైన అన్ని రకాల నొప్పులకు పుత్తూరు తైలం, పుత్తూరు బామ్ చక్కగా పనిచేస్తాయి.

*గురక నివారిణి:* గురక పెట్టడానికి ప్రధానంగా ఆరోగ్యపరమైన సమస్యలే కారణమని చెప్పవచ్చు. స్థూలకాయం, సైనసైటిస్, మలబద్ధకం, అస్తమా, వాతావరణ మార్పులు, మానసిక ఒత్తిళ్ల వంటివి ఉన్నప్పుడు గురక పెడతారు. అలాగే మద్యపానం, ధూమపానం చేసేవారిలో కూడా ఈ అలవాటు ఎక్కువే. గురకతో పక్కవారికి ఇబ్బంది మాటెలా ఉన్నా దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు కూడా తలెత్తే అవకాశం ఉంది. అందుకే డీస్నోర్-గురక నివారిణి సిరప్ 10 మి.లీ. లేదా రెండు టీ స్పూన్లు తాగితే అది శరీరంలో ఉన్న చెడు కొలెస్ట్రాల్‌ను విరేచనాల ద్వారా బయటికి పంపిస్తుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ నిర్మూలనకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది.

*క్లీన్ టీ:* నోటి దుర్వాసన, పళ్లు పుచ్చుకుండా ఉండేందుకు ఇది తోడ్పడుతుంది. ఎనామిట్ కోటింగ్ పోకుండా చూస్తుంది. పళ్లపై మరకలను పోగొడుతుంది. దంతక్షయానికి చక్కటి పరిష్కారం చూపుతుంది. అన్ని అపోలో మెడికల్ షాపులలో లభించును.

*- సి.పి.ఎస్. భూపాలవర్మ*
*సి.ఎం.డి. వర్మ ఇండస్ట్రీస్*
*9550138527, 9849659087*

# ప్రాణాంతక వాయువుల నుండి కాపాడుకుందాం

**కాలుష్య నివారణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణయోగ్యంకాని విధానాలతో ప్రయోగాలు చేస్తూ సమస్యను రోజురోజుకు మరింత జటిలం చేస్తున్నాయి. ఫలితంగా దేశరాజధానితో సహా అనేక నగరాల్లో, పట్టణాల్లో పర్యావరణం విషతుల్యంగా మారుతున్నది. లక్షలాదిమంది పౌరులు అనేక వ్యాధులకు లోనవుతున్నారు. అధికారులు మారినప్పుడు ఎవరికి తోచిన సలహాలు వారు అమలు చేసేందుకు ప్రయత్నాలు చేయడం అపహాస్యం పాలుకావడం జరుగుతున్నది.**

ఒక నిర్దిష్టమైన విధానం లేకపోవడం వల్ల కాలుష్యం పౌరులను ముంచివేస్తున్నది. సగటు మనిషి తినే తిండితోపాటు పీల్చేగాలి, ప్రాణాంతకంగా మారడం ఆందోళన కలిగిస్తున్నది. ముఖ్యంగా వాయు కాలుష్యభూతం కోరలు చాచి ఉదరకోశ, ఊపిరితిత్తులు, క్యాన్సర్ లాంటి కేసులు అదుపు లేకుండా పెరిగిపోతున్నాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ నిపుణులు అధికారికంగా వెల్లడించారు.

కలుషితమైన గాలి కారణంగా గుండె, ఊపిరితిత్తులు, క్యాన్సర్ లాంటి కేసులు అదుపు లేకుండా పెరిగిపోతున్నాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ నిపుణులు అధికారికంగా వెల్లడించారు. కలుషితమైన గాలి కారణంగా గుండె, ఊపిరితిత్తుల వ్యాధితోపాటు అనేక వ్యాధులు సోకుతున్నట్లు ఇప్పటికే పలు పరిశోధనల్లో వెల్లడైంది. వాయుకాలుష్యం క్యాన్సర్ రోగాన్ని మోసుకొస్తున్నట్లు దీనిపై సమగ్ర నియంత్రణ లేకపోవడంతో మానవ మనుగడే ప్రశ్నార్థకమైన దుర్భరపరిస్థితులు దాపురించబోతున్నాయని వైద్యరంగ నిపుణులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీల్చే గాలితోపాటు మనిషి శరీరంలోకి ప్రవేశించే సల్ఫేట్, నైట్రేట్స్, అమోనియా, సోడియం క్లోరైడ్, కార్బన్, ఖనిజ ధూళి, కాడ్మియం, నికిల్, పాదరస రేణువులు క్యాన్సర్ మహ్మారిని విస్తరింపచేస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా పట్టణప్రాంతాల్లో వాయుకాలుష్యంతో దాదాపు ఏటా 15 లక్షల మందిని పైగా కబళిస్తుంది. అందులో నాల్గోవంతుపైగా ఊపిరితిత్తుల క్యాన్సర్లేనని వెల్లడవుతున్నది. పట్టణనగర వాయుకాలుష్యంలో బెంగళూరు, పుణే, హైదరాబాద్, ముంబాయి, నాగపూర్ తదితర చోట్ల పరిస్థితి దారుణంగా ఉందని అధ్యయనాల్లో వెల్లడైంది. దేశవ్యాప్తంగా 90 శాతం పైగా నగరాల్లో పట్టణాల్లో వాయుకాలుష్యం అదుపు తప్పిపోయిందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలే అంగీకరించింది. అయితే ఇప్పటికీ ఈ వాయుకాలుష్యం నియంత్రణకు పటిష్టమైన చర్య తీసుకోలేకపోతున్నారు. అసలు వాయుకాలుష్యానికి మూలాల్లో ప్రధానమైన ఇంధనం కల్తీపై చర్యలు తీసుకొనే ధైర్యం లేకపోవడంతో విషవాయువులా నగరాలను, పట్టణాలను ఈ కాలుష్యం కమ్మేస్తున్నది. వాయుకాలుష్య నివారణకు జరుగుతున్న చర్యలు దాదాపు శూన్యమే.

ఈ విషయంలో తాము తీసుకుంటున్న నిర్ణయాలు ఆచరణయోగ్యం కాదని తెలిసినా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు తాము ఏదో పని చేస్తున్నామనని చెప్పేందుకు మధ్యతరగతి పౌరులను ఇబ్బంది పెడుతున్నారు.

మన రాష్ట్రానికి సంబంధించి 1989 మెటార్ వాహనాల చట్టంలోని రూల్ 115 ప్రకారం నిర్ధారిత ప్రమాణాలకు మించి పొగవదిలే వాహనాలపై జరిమానా విధించాలి. ఇప్పటికే అదుపుకాకపోతే ఏకంగా వాహనాలను స్వాధీనం చేసుకోవాలి. పర్యావరణాన్ని కలుషితం చేస్తూ మోతాదుకు మించి పొగ వదులుతున్న ఏ వాహనమైన ఈ చట్టపరిధిలోకి వస్తుంది. వాస్తవంగా చూస్తే ఈ చట్టాన్ని కచ్చితంగా అమలుచేస్తే అధికశాతం ప్రభుత్వ వాహనాలు, రోడ్లపై తిరిగే అవకాశం ఉండదు.

అనేక తర్జనభర్జనల అనంతరం 1993లో మొదటిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వాహనకాలుష్య నియంత్రణ కోసం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి)ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఛైర్మన్‌గా బోర్డు కార్యదర్శి కన్వీనర్‌గా ఉండే ఈ కమిటీ వాహనాలకు పి.యు.సి. సర్టిఫికేట్ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసం ఎయిర్ యాక్ట్ 1987 సెక్షన్ 31(ఎ) కింద హైదరాబాద్‌లోని పెట్రోల్ పంపుల్లో దాదాపు 20 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిబంధనలను అతిక్రమించే వారికి జరిమానాలతో పాటు జైలుశిక్ష కూడా విధిస్తామని హెచ్చరించారు.

జంట నగరాల్లో నిబంధనలను అతిక్రమించే వారికి జరిమానాలతో పాటు జైలుశిక్ష కూడా విధిస్తామని హెచ్చరించారు. జంట నగరాల్లో తిరిగే ప్రతివాహనం విధిగా పరీక్షించుకోవాలని నిబంధనలు పెట్టారు. ఆర్టిఏ అధికారులు ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో దాదాపు నాలుగేళ్లపాటు ఈ కార్యక్రమం జరిగింది. అయితే జంటనగరాల్లోని ఆరోవంతు వాహనాలు కూడా సర్టిఫికెట్ పొందలేదు. అధికారులు మళ్లీ అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాల జోలికి పోకుండా పి.యు.సి సర్టిఫికేట్ ఉన్న వాహనాలకు మాత్రమే ఇంధనం పోయాలన్న కొత్త నిబంధనలను విధించారు.

ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీచేశారు. ఇది ఆచరణసాధ్యం కాదని అధికారులకు ఆనాటి పాలకులకు స్పష్టంగా తెలిసినా అయినా ఒక ప్రయోగంచేసి ఘోరంగా విఫలమయ్యారు. ఇలా ఎప్పటికప్పుడు నిబంధనలు మార్చుకున్నా అధికారులు తనిఖీలు చేస్తున్నా ఏమాత్రం ఫలితం లేకుండా పోయింది. విపరీత కాలుష్యాన్ని వెదజల్లుతూ అటు ప్రభుత్వ వాహనాలు, ఇటు ప్రైవేటు వాహనాలు నిరాటంకంగా తిరుగుతున్నాయి.

1960 నాటి ముందు తయారైన లారీలు నేటికీ ఇసుక, మట్టిలోడ్లతో రోడ్లపై తిరుగుతూ తీవ్రస్థాయిలో ధూమాన్ని వదులుతున్నా పట్టించుకోవడం లేదు. తీవ్రస్థాయిల్లో వెలువడుతున్న విషవాయువుల వల్ల జంటనగరాల్లోని పౌరులు అనేక వ్యాధులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. సమస్య తీవ్రతను గుర్తించి నివారణకు ఆచరణయోగ్యమైన విధానాలు ప్రకటించి అమలు చేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా పర్యావరణంపట్ల సాధారణ ప్రజలలో కూడా అవగాహన పెంచేందుకు కృషి చేయాలి.

**- ఎస్.పి.ఆర్**

# థైరాయిడ్ సమస్యలకు చక్కని చికిత్స

**మన శరీరంలోని వినాళ వ్యవస్థలో థైరాయిడ్ ముఖ్యమైన గ్రంథి. దీని ప్రభావం అన్ని జీవక్రియలపైనా ఉంటుంది. ఈ గ్రంథి గొంతు భాగంలో థైరాయిడ్ కార్టిలేజ్ అనే మృదులాస్థి పైన ఉంటుంది.**

థైరాయిడ్ గ్రంథి టి3, టి4 (టి3-ట్రై అమెడక్ష థైరాక్సిన్, టి4 -థైరాక్సిన్) అని రెండు హార్మోన్‌లు ఉత్పత్తి చేయాలంటే హైపోథాలమస్ పిట్యూటరి గ్రంథి నుంచి వచ్చే థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (టీఎస్‌హెచ్) థైరాయిడ్ గ్రంథిని ఉత్తేజ పరచాలి. థైరాయిడ్ హార్మోన్ అన్ని జీవక్రియల మీద ప్రభావాన్ని చూపుతుంది. ఎదుగుదల, కార్బోహైడ్రేట్, కొవ్వు పదార్థాల సంశ్లేషణ, బేసల్ మెటబాలిక్ రేట్, శ్వాస వ్యవస్థ, గుండె, నాడీ, జీర్ణ వ్యవస్థ, సంతాన సాఫల్యం వంటి అనేక వ్యవస్థల మీద దీని ప్రభావం ఉంటుంది. పిండ దశలో, పుట్టిన తర్వాత మొదటి 4,5 నెలల్లో దీని ఆవశ్యకత చాలా కీలకమైనది. హైపోథాలమస్ పిట్యూటరి థైరాయిడ్ వ్యవస్థలలో మార్పు రావడం వల్ల థైరాయిడ్ గ్రంథి ప్రక్రియలో మార్పులు వచ్చి థైరాక్సిన్ ఉత్పత్తి స్థాయిలో తేడాలు వస్తాయి.

***కారణాలు:*** ప్రస్తుత జీవన విధానం వేగవంతం కావడం, ఒత్తిడి పెరిగిపోవడం, శారీరక శ్రమ తగినంత లేకపోవడం, పౌష్టికాహార లోపం వల్ల థైరాయిడ్ వ్యవస్థలో మార్పులు రావడం వల్ల థైరాయిడ్ సమస్యలు మొదలవుతాయి.

- కుటుంబ చరిత్రలో సమస్యలు ఉన్నపుడు కూడా తర్వాత తరంలో వారికి రావచ్చు.
- అయోడిన్ లోపం వల్ల కూడా థైరాయిడ్ సమస్యలు వస్తాయి.
- పార్శియల్ థైరాయిడెక్టమి వల్ల
- పిట్యుటరీ గ్రంధిలో వచ్చే వ్యాధుల వల్ల కూడా థైరాయిడ్ సమస్యలు వస్తాయి.

***రకాలు :*** హైపోథారాయిడిజం - ఇది సర్వసాధారణంగా కనిపించే థైరాయిడ్ వ్యాధి. శరీరంలో అవసరమైనంత థైరాక్సిన్ ఉత్పత్తి జరగదు. ఏ వయసు వారికైనా ఈ సమస్య రావచ్చు కానీ పిల్లలు, స్త్రీలలో పిల్లలకు ఎక్కువగా కనిపిస్తుంది.

***లక్షణాలు :*** పిల్లల్లో - బుద్ధిమాంద్యం, ఎదుగుదల లోపం, జ్ఞాపక శక్తి లేకపోవడం, మల బద్ధకం, చురుకుదనం కోల్పోవడం, అధిక బరువు.




యుక్తవయసు వారిలో - ఒంట్లో నీరు చేరి బరువు పెరగడం, బీఎంఆర్ తగ్గిపోవడం, నెలసరులు ఆలస్యంగా ప్రారంభం కావడం, నెలసరులు క్రమం తప్పడం, అమెనోరియా, అధిక రక్తస్రావం, సంతానలేమి, చర్మం పొడిబారడం, జుట్టు రాలిపోవడం, బద్ధకంగా ఉండడం, చలి తట్టుకోలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి.

## హైపర్ థైరాయిడిజం

థైరాక్సిన్ ఎక్కువ మోతాదులో థైరాక్సిన్‌ను విడుదల చేయడం వల్ల వచ్చే సమస్యను హైపర్ థైరాయిడిజం అంటారు.

లక్షణాల్ ఆహారం సరైన మోతాదులో తీసుకున్నా బరువు తగ్గడం, నిద్రలేమి, గుండెదడ, అధిక చమటలు, విరేచనాలు, చేతులు వణకడం, నీరసంగా ఉండడం, నెలసరులు త్వరత్వరగా రావడం, అధిక రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

## హషిమోటోస్ థైరాయిడైటిస్

ఇది జీవన క్రియల అసమతుల్యత వల్ల వచ్చే థైరాయిడిజం దీనిలో థైరాయిడ్ గ్రంథికి వ్యతిరేకంగా యాంటిబాడిస్ ఉత్పన్నం అయి థైరాయిడ్ గ్రంథిని సక్రమంగా పనిచెయ్యనివ్వవు. ఇందులో హైపో, హైపర్ థైరాయిడ్ లక్షణాలు ఉండే అవకాశం ఉంది.

## గాయిటర్

థైరాయిడ్ గ్రంథిలో వాపు రావడాన్ని గాయిటర్ అంటారు. కొన్ని సందర్భాలలో దీని పరిమాణం కంటే రెండింతలు పరిమాణం వాపు వచ్చి స్వరపేటికపైన ఒత్తిడి పెరగడం వల్ల వాయిస్‌లో మార్పు వస్తుంది. గాయిటర్ సమస్య ఉన్నపుడు టీ 3, టీ 4 సాధారణ స్థితిలో ఉన్నప్పటికీ గాయిటర్ ప్రభావం లేదని భావించలేం.

***కారణాలు :*** గాయిటర్ ఏర్పడడానికి ముఖ్యకారణం అయోడిన్ లోపం. గ్రేవ్స్ డిజీజ్, పిట్యూటరీ గ్రంథి ట్యూమర్, థైరాయిడ్ క్యాన్సర్.

***లక్షణాలు :*** గొంతు కింద వాపు వచ్చి మింగడానికి కష్టంగా ఉంటుంది. స్వరంలో మార్పులు రావడం, ఎక్సాఅప్తల్మిక్ గాయిటర్ అనగా కనుగుడ్లు బయటు పొడుచుకు వచ్చినట్టుగా ఉండడం.

***నిర్ధారణ:*** థైరాయిడ్ ప్రొఫైల్ టి3,టి4, టీఎస్‌హెచ్, యాంటి థైరాయిడ్ యాంటీ బాడీస్; యూఎస్‌జీ ఆఫ్ థైరాయిడ్ గ్రంథి; గొంతు సీటీ స్కాన్

***హోమియో చికిత్స:*** చాలా మంది జీవితమంతా థైరాక్సిన్ మందులు వేసుకోవడం మినహా మరో మార్గం లేదు అనుకుంటారు. చాలా మందికి హోమియో వైద్యం పై సరైన అవగాహన లేకపోవడంవల్ల అలా అనుకుంటారు. చాలా మందికి వారు తీసుకునే థైరాక్సిన్ అనేది చికిత్స కాదు సప్లిమెంట్ అని తెలియదు. హోమియో వైద్యంలో రోగి శరీర తత్వాన్ని బట్టి సరైన చికిత్స ఇస్తే థైరాయిడ్ సమస్యలను పూర్తిగా నయం చెయ్యవచ్చు.

- ఎన్.పి.ఆర్

# జలియన్ వాలాబాగ్ దురంతం

**భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మరుపురాని దుర్ఘటన జలియన్ వాలాబాగ్ దురంతం. భారత రక్షణ చట్టం పేరుతో దేశ పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు నాటి బ్రిటిష్ ప్రభుత్వం తీవ్రంగా భంగం కలిగించింది. యూరప్ ఖండంలోని రాజ్యాల సామ్రాజ్య విస్తరణ కాంక్ష ఫలితంగా 1914 జూలై 18 మొదలు 1918 నవంబరు 11 వరకూ కేంద్ర రాజ్యాలు, మిత్ర రాజ్యాలు రెండు పక్షాలుగా పాల్గొని పోరాడాయి. ఇది మొదటి ప్రపంచ యుద్ధం.**



నేలమీద ట్యాంకులు, సముద్రంలో యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, వాయుతలంలో విమానాలు, బాంబర్ల వంటి కొత్త యుద్ధ సామాగ్రి సహాయంతో ప్రపంచ యుద్ధం భీషణంగా జరిగింది. యుద్ధం ముగియగానే యూరప్ దేశపటంలో సరిహద్దుల రూపురేఖలు మారిపోయాయి. మరణించిన వారి సంఖ్య 79,40,000 కాగా, అందులో బ్రిటన్ కోసం పోరాడి మృతి చెందిన భారతీయ సైనికులు 43,000 కు పైగా వున్నారు. అపారమైన ప్రాణనష్టం, ధన నష్టం జరిగింది. భారత ప్రజల కష్టాలను మరింత పెంచింది యుద్ధం.

యుద్ధం తరువాత కూడా అణచివేత వైఖరిని కొనసాగించటానికి బ్రిటిష్ ప్రభుత్వం రౌలత్ చట్టాన్ని అమలు పరిచింది. బ్రిటిష్ ప్రభుత్వాన్ని కూలతోయటానికి ప్రయత్నిస్తున్నాడని అనుమానించిన ఏ వ్యక్తినైనా అరెస్టు చేసి - ప్రత్యేక కోర్టులో విచారణ జరిపి కఠినంగా శిక్షించే ఆయుధం రౌలత్ చట్టం. పరాయి పాలన నుంచి దేశాన్ని విముక్తం చేసే లక్ష్యంతో ఉద్యమాలు కొనసాగిస్తున్న జాతీయ నాయకుల కార్యకలాపాలను రౌలత్ చట్టాన్ని ప్రయోగించి నిరోధించటమే పాలకుల ప్రధానమైన ఉద్దేశ్యం. ఈ చట్టం దేశమంతటా కలకలం రేకెత్తించింది.

చిరకాలంగా బ్రిటిష్ సామ్రాజ్యం కిరీటంలో మణిగా (జ్యూయల్ ఇన్ ద క్రౌన్) కొనియాడబడుతూ వచ్చిన భారతదేశంలో ప్రజలు స్వాతంత్ర్యం కోసం తపించసాగారు. భారతీయ సైనికులు బ్రిటిష్‌వారితో పోరాడటానికి ఆయుధాలను దిగుమతి చేసుకోసాగారు. యుద్ధం తరువాత జాతీయ కాంగ్రెస్‌లోని అతివాద, మితవాద, బేధాలు తొలగిపోయి ఒక లక్ష్యం కోసం ఏకమయ్యారు. రష్యా ప్రజా విప్లవం భారతీయుల్ని ప్రభావితం చేయసాగింది.

1857 సిపాయిల తిరుగుబాటు తరువాత దేశంలో ఎప్పుడైనా తమపై కుట్రలు, తిరుగుబాటు జరిగే ప్రమాదం ఉందని - పైకి అమాయకంగా కనిపిస్తున్న ప్రజలంతా అనుమానాస్పదులని బ్రిటిష్ అధికారులు భయపడుతుండేవారు.

గుజరాత్‌లోని సబర్మతిలో గాంధీజీ రౌలత్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ సత్యాగ్రహం ప్రారంభించారు. గాంధీజీ పిలుపునందుకున్న ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించసాగారు. ఊహించని పరిణామాలు, అశాంతి, ఆందోళనలు, నిరసనలు వెల్లువెత్తాయి. దేశవ్యాప్తంగా హర్తాళ్ళులు, నిరసన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. పంజాబ్‌లో పరిస్థితి వేగంగా ఉద్రిక్తం కాసాగింది. ఈ నేపథ్యంలో రౌలత్ సత్యాగ్రహం జరుగుతున్నప్పుడే పంజాబ్ గవర్నర్ డయ్యార్ కఠినమైన ఉత్తర్వులు విడుదల చేశాడు. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి జాతీయ భావాలు, రాజద్రోహాన్ని ప్రేరేపించే సిద్ధాంతాలు పంజాబ్ రాష్ట్రంలో ప్రవేశించకుండా నిరోధించటమే ఈ ఉత్తర్వుల లక్ష్యం. నాటి బ్రిటిష్ ఇండియన్ రక్షణ సేనలో అధిక సంఖ్యాకులు పంజాబీలే అయి వుండటం దీనికి కారణం. వారిలో తీవ్రమైన జాతీయ భావాలు ప్రేరేపించకుండా చేయాలన్నది ఆ గవర్నర్ ఉద్దేశ్యం.

భారతీయులను సైన్యంలోకి చేర్చుకునే విషయంలో గవర్నరు కఠినమైన నియమావళిని ప్రవేశపెట్టాడు. తత్ఫలితంగా పంజాబ్ ప్రజలలో అలజడి, ఆందోళన తల ఎత్తాయి. దీనికి తోడు సత్యపాల్, సైఫుద్దీన్ కిచ్లూ వంటి జాతీయ నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఏప్రిల్ 10, 1919న అమృతసర్ డిప్యూటీ కమిషనర్ నివాసం వద్ద నిర్బంధించబడిన నాయకులు సత్యపాల్, సైఫుద్దీన్ కిచ్లూలను విడుదల చేయాలని కోరుతూ నిరసన జరిపారు. వీరిద్దరూ మహాత్మాగాంధీ సత్యాగ్రహ ప్రముఖులు. నిరసనకారుల మీద మిలటరీ పికెటింగ్ జరిగింది. 8 నుండి 20 మంది ప్రజలు, కార్యకర్తలు మరణించారు. రోజులో ఎన్నోసార్లు ప్రజల మీద మిలటరీ చార్జ్ జరిగింది. దీనికి ప్రతిగా ఉద్యమకారులు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంక్‌లు, రైల్వే స్టేషన్‌లపై దాడిచేసి నిప్పు పెట్టారు. తీవ్రమైన క్రోధ జ్వాలలకు 5 గురు బ్రిటిష్ ఉన్నతాధికారులు కార్యాలయంలోనే చంపివేయబడ్డారు. ఈ సంఘటనలో ఇద్దరు బ్రిటిష్ మహిళలు తీవ్రంగా గాయపడ్డారు.

మిస్ మార్సెల్లా షేర్ ఉడ్ అనే ఇంగ్లీషు మిషనరీ టీచర్‌ని కుచ్చా కురిచ్చాన్ అనే మార్గంలో అటకాయించి తీవ్రంగా గాయపరిచారు. జనరల్ డయ్యార్ ఆ మార్గంలో వెళ్ళే భారతీయులందరు నేలపై తలలు వంచి కాళ్ళు, చేతుల పై పాకుతూ వెళ్ళాలని ఆజ్ఞలు జారీచేస్తాడు. భారతీయులు దేవుని విగ్రహం ముందు నేలమీద తలలు వంచి నమస్కరించడం చూశాను. ఒక బ్రిటిష్ మహిళ హిందూ దేవుని కంటే పవిత్రమైనదని వాళ్ళకు తెలియచేయటానికే ఆమె ముందు క్రాల్ చెయ్యాలి అని జనరల్ డయ్యార్ తరువాత ఒక బ్రిటిష్

ఇన్‌స్పెక్టర్‌కి చెప్పాడు. పంజాబ్ ప్రాంతమంతా మార్షల్‌లా విధించబడింది. ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలపై నియంత్రణ విధించి పట్టణంలో బహిరంగ సభలు, సమావేశాలు జరపరాదని నిషేధాజ్ఞలు విధించబడ్డాయి.

1919 ఏప్రిల్ 13న ఉత్తర భారతదేశంలో వైశాఖ సంవత్సరాది పండుగ. ఆ ఉత్సవ సందర్భంగా ఆ రోజు 20,000 మంది సిక్కులు, మహమ్మదీయులు, హిందువులు అమృతసర్‌లోని హర్‌మందిర్ సాహిబ్ సమీపంలో ఉన్న జలియన్‌వాలాబాగ్ అనే చోట ఏర్పాటు చేయబడిన బహిరంగ సభలో పాల్గొనటానికి హాజరయ్యారు. ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించి అక్కడ సమావేశమయిన స్త్రీ, పురుషులకు గట్టిగా గుణపాఠం చెప్పాలని సభ ప్రారంభమయిన గంటకు డయ్యర్ సేనాని హుటాహుటిన తన సైనిక బలగంతో - 65 గూర్ఖా, 25 బెలూచి సైనిక బలగంత్ అక్కడకు చేరుకున్నారు.

సైనికులు 50 మంది 303 లీ ఎన్‌ఫీల్డ్ బోల్టు యాక్షన్ రైఫిల్స్‌తో వున్నారు. మెషీన్‌గన్స్‌తో నిండి వున్న రెండు సైనిక శకటాలను కూడా డయ్యర్ తెచ్చాడు. అయితే బాగ్‌లోకి చేరే మార్గం సన్నగా ఉండటం వలన ఆ సాయుధ శకటాలను బయటి ద్వారం ముందు ఉంచారు. జలియన్ వాలాబాగ్ పరిసర ప్రాంతమంతా నివాస స్థలాలు, భవనాలతో నిండి ఉండి లోపలికి చాలా ఇరుకైన మార్గాలు అవి కూడా మూసివేయబడి ఉన్నాయి. ప్రధాన మార్గం కాస్త వెడల్పుగా ఉన్నప్పటికీ ఆ మార్గం సైనిక శకటాలను వెనక వుంచుకొని మోహరించియున్న సిపాయి మూకలు మూసి వేశాయి. ఏ విధమైన ముందు హెచ్చరిక లేకుండానే బయటకు పోయే మార్గాలు మూసివేసి డయ్యర్ కాల్పులు జరిపించాడు. గుంపుగా ఎక్కువ మంది కూడి వున్న ప్రజల మీద కాల్పులకు ఆదేశాలు ఇచ్చాడు.

ఆ బాగ్ నుండి పారిపోవాలంటే ఒక వైపు మాత్రమే దారి ఉంది. మూడు వైపులా ఎత్తైన గోడలు పది నిమిషాల పాటు కాల్పులు నిర్విరామంగా జరిగాయి. దాదాపు- 1650 రౌండ్‌ల కాల్పులు జరిగాక మందుగుండు సామాగ్రి అంతా అయిపోయాకే కాల్పుల విరమణకు ఆదేశించాడు డయ్యర్. సుమారు 1000 మంది ప్రజలు అక్కడికక్కడే మరణానికి గురయ్యారు. చాలా మంది ప్రజలు తొక్కిసలాటలో మృతి చెందారు. కొందరు ప్రాణాల ను రక్షించుకోవాలని పాడు పడిన బావిలోకి దూకి మరణించారు.

స్వాతంత్ర్యం అనంతరం అక్కడ ఉంచిన శిలా ఫలాకం మీద 120 మృత దేహాలు బావిలో నుంచి వెలికి తీశారని రాయబడి ఉంది. అనేక వేల మంది తీవ్రంగా గాయపడి కదలలేక నిస్సహాయంగా అక్కడే పడి ప్రాణాలు విడిచారు. కర్ఫ్యూ విధించి ఉండటం వలన రాత్రి సమయంలో సహాయక చర్యలు ఏమీ అందక వేల మంది ప్రజలు మృతి చెందారు. 'ఇది గుంపును



చెదరగొట్టే ప్రయత్నం కాదు హిందువుల అవిధేయతకు తగిన శిక్ష ఇంకా మందుగుండు సామాగ్రి ఉంటే ఇంకా ఎక్కువ మందిని చంపి ఉండే వాడినని డయ్యర్ తర్వాత విచారణలో ప్రగల్భాలు పలికాడు.

ఈ దుర్ఘటనలో ఎంత మంది చనిపోయారన్న లెక్కలు సరిగా అంచనా వేయలేకపోయారు. సిటీలో నివసిస్తున్న పౌరులను ఎంక్వయిరీ చేసి వారి ద్వారా చనిపోయిన వారి వివరాలను సేకరించాలని అధికారులు ప్రయత్నించారు. తమను కూడా దోషుల కింద భావిస్తారన్న, భయంతో చాలా మంది ముందుకు రాకపోవటంతో విషయ సేకరణ అసమగ్రంగా ఉండిపోయింది. జరిపిన కాల్పులను బట్టి సమావేశానికి హాజరయిన ప్రజల సంఖ్యను బట్టి భారత జాతీయ కాంగ్రెస్ 1500 మంది తీవ్రంగా గాయపడ్డారని, 1000 మంది మరణించారని నిర్ధారించింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 379 మంది మాత్రమే మరణించినట్టు చూపబడింది. భారత దేశ చరిత్రలో అత్యంత దారుణమైన సంఘటన ఇది.

1919లో బ్రిటిష్ ప్రభుత్వం డయ్యర్‌పై విచారణకు హంటర్ కమీషన్‌ను నియమించింది. ఉద్యమకారులను భయభ్రాంతులను చేసి వారి నైతిక శక్తిని క్షీణింప చేయటానికే జలియన్‌వాలాబాగ్ కాల్పులు జరిపానని వాదించాడు డయ్యర్.

1940 మార్చి 13 లండన్ కాక్స్టన్ హాలులో భారత స్వాతంత్ర్య ఉద్యమకారుడు అమృతసర్ దురంతంలో స్వయంగా గాయపడిన ఉద్ధంసింగ్ మైఖేల్ ఒ-డయ్యర్‌ని కాల్చి చంపాడు. విచారణ సమయంలో అతని మీద కక్షతో నేను ఈ పని చేశాను. ఈ శిక్షకు అతను అర్హుడు. నిజమైన దోషి అతను నా భారత ప్రజల జీవాన్ని అణగదొక్కాలని ప్రయత్నించాడు. అందుకే నేను అతన్ని అణిచేశాను.

21 సంవత్సరాలుగా ప్రతీకారాన్ని తీర్చుకోవటానికి నేను ఎదురు చూస్తున్నాను. ఇప్పటికి నా కర్తవ్యం నెరవేర్చినందుకు ఆనందిస్తున్నాను. నేను చావుకు భయపడను. నేను నా దేశం కోసం మరణిస్తున్నాను. బ్రిటిష్ పాలనలో నా దేశ ప్రజలు ఆకలితో అలమటించటం చూశాను. ఆ దురాగతాన్ని ఎదిరించటం నా విధి. మాతృదేశం కోసం మరణించటం కన్నా గొప్ప గౌరవం ఇంకేముంటుంది. ఓ ఉద్ధంసింగ్ చర్యను సామాన్య భారత ప్రజానీకం అంతా ప్రశంసించింది.

"ఛిద్రమైన ప్రజల ఆక్రందన తుపాకి మోతలో ప్రతిధ్వనించింది. భారతదేశంలో బ్రిటిష్ పాలనను ఎవరో కాదు బ్రిటిష్ ఉన్నతాధికారుల చర్యలే పతనం చేశాయి" అని చరిత్రకారులు విశ్లేషించారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆనాడు ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఒక స్మృతి చిహ్నాన్ని అమృతసర్‌లోని ఆ జలియన్ వాలాబాగ్‌లో నిర్మించారు. అమెరికన్ శిల్పకారుడు బెంజిమిన్. పోక్ ఈ స్మృతి మందిరానికి రూపకల్పన చేశాడు.

రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ 1961 ఏప్రిల్ 13న మందిరాన్ని ఆవిష్కరించారు. తరువాత మందిరంలో అమరజ్యోతిని ఏర్పాటు చేశారు. జలియన్ వాలాబాగ్ పరిసరాలలో వున్న భవనాల గోడల మీద తుపాకి గుళ్ళ ముద్రలు నేటికి కనిపిస్తాయి. అనేక మంది ప్రజలు ప్రాణ రక్షణార్థం దూకి మునిగిపోయి మరణించిన ఆ బావి బాగ్‌లో పరిరక్షించబడి ఉంది. అక్కడ Do not leave your foot prints here - take the memories with you అని రాసి ఉంటుంది.

- యర్రమిల్లి విజయలక్ష్మి
ఫ్రీలాన్స్ జర్నలిస్టు



# పరిశుభ్రతను పాటిద్దాం-స్వచ్ఛభారత్

**'మన ఇంటిని, మన వీధులను మనమే శుభ్రంగా ఉంచుకోవాలి. పక్కవారు వచ్చి శుభ్రం చేయరు. అసాధ్యమనుకొన్న తెలంగాణ రాష్ట్రాన్నే తెచ్చుకున్నాం. ఇంటిని, వీధులను శుభ్రం చేసుకోలేమా? మన వీధిని, మన ఊరిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎవరో వచ్చి చెప్పాలా? పదండి నేను కూడా వస్తా. అందరం కలిసి రాష్ట్రాన్ని స్వచ్ఛ తెలంగాణగా మార్చుకొందాం. స్వచ్ఛ తెలంగాణ కోసం ఉద్యమం చేద్దాం' ఇది రాష్ట్ర ప్రజలకు దిశానిర్దేశం చేస్తూ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు చేసిన ప్రకటన.**

కొత్త రాష్ట్రంలో స్వచ్ఛత ఆవశ్యకతను ఇది చాటి చెబుతోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఏడు దశాబ్దాలు అవుతున్నప్పటికీ, ఎక్కడి చెత్తా అక్కడే అన్నట్లుంది పరిస్థితి. వలస పాలన కాలపు వాసనలు ఇప్పుడు లేకపోయినా, చెత్త తాలూకూ దుర్వాసనలు మాత్రం ఊపిరిడకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసి, ఆర్థికంగానూ దేశానికి నష్టం కలిగిస్తున్న సమస్య ఇది. పోగుపడే చెత్త, కొండల్లా పేరుకుపోకుండా చూడటం ఎంత ముఖ్యమో-దాన్ని సురక్షితంగా, జాగ్రత్తగా వదలించుకోవడమూ అంతే ప్రధానం. ఇందుకోసం సరైన ప్రణాళికలు, వ్యూహాలు అవసరం.

ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే ప్రయత్నాలైనా జరగలేదు. ఇలాంటి కారణాలవల్లే పరిస్థితి విషమించి దారుణంగా దుర్భరంగా తయారైంది. రాజకీయ ప్రయోజనాలు చేకూర్చే పథకాలు కార్యక్రమాలకు సంబంధించి ఆర్భాటపు ప్రకటనలతోనే కాలం వెల్లదీస్తూ వచ్చిన గత పాలకులు గ్రామాలు, నగరాల్లో పరిశ్రుభతను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అందువల్లే వీధి వీధి నాదే అన్నట్లు ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి గాలి, నీరు, నేల అన్ని విషకలుషితమైపోయాయి. గ్రామాల నుంచి నగరాల దాక జనవాసాలన్నీ కాలుష్యకాసారాలయ్యాయి. ఇది చెత్త భారతం అనే ముద్ర బలంగా పడుతున్న దశలో అధికార పగ్గాలు చేపట్టిన నరేంద్రమోదీ స్వచ్ఛభారత్ దేశాన్ని ఆవిష్కరించడానికి నడుం కట్టడంతో దేశవ్యాప్తంగా ఒక్కసారిగా గొప్ప కదలిక వచ్చింది.

వివిధ బృందాలు, నగరాలు, సంస్థలు, వ్యవస్థలు ఒక్కుమడిగా స్వచ్ఛభారత్ ఉద్యమంలోకి ఉరికిరావడంతో పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. స్వచ్ఛభారత్ అనేది కేవలం నినాదం కాదు నేడిదీ ప్రభుత్వ విధానం. దీని స్ఫూర్తిని అందిపుచ్చుకున్న ముఖ్యమంత్రి కేసిఆర్ స్వచ్ఛ తెలంగాణ కోసం సమగ్ర కార్యాచరణతో ముందుకు వచ్చారిప్పుడు. ఉద్యమాల పోతుగడ్డ అయిన తెలంగాణ స్వచ్ఛత శుభ్రతల కోసం కొత్త యుద్ధ రంగంలోకి దిగుతోందీనాడు!

తూతూ మంత్రంగా ఏ కార్యక్రమం చేపట్టినా ఆశించిన ఫలితం రాదు. ప్రణాళిక రచించడంతో సరిపెడితే ఉపయోగం ఉండదు. ఏ పనైనా చిత్తశుద్ధితో చేస్తేనే ప్రయోజనం. అపరిశుభ్రమైన పరిసరాలు, శుచి శుభ్రత లేకపోవడం వ్యర్థాల నిర్వహణ అస్తవ్యస్థంగా ఉండడం వల్లే అత్యధిక వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ వ్యాధులు చికిత్సకు చేస్తున్న ఖర్చు స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో 6% అని ప్రపంచ బ్యాంకు ఒక నివేదికలో పేర్కొంది. పరిస్థితి తీవ్రతకు ఇది నిలువుటద్దం.

2011 జనాభా లెక్కల ప్రకారం దేశావ్యాప్తంగా నగరాలు, పట్టణాలల్లో 17%మంది మురికి వాడల్లోనే జీవిస్తున్నారు. ఒక హైదరాబాద్ నగరంలోనే 1,466 మురికివాడల్లో 18.5 లక్షల మంది బతుకుతున్నారు. తాజా గణంకాల ప్రకారం హైదరాబాద్ నగర జనాభా 77 లక్షలకు పైమాటే. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోనే మిగిలిన 67 పురపాలక సంఘాల్లో 1.37 కోట్ల జనాభా నివసిస్తోంది. దేశంలో పట్టణీకరణ అత్యంత వేగంగా జరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రభాగంలో ఉంది. హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలు, నగరాల్లో ప్రతిరోజు 6,628 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ వ్యర్థాలే ప్రభుత్వాలకు పెనుసవాళ్లు విసరిస్తున్నాయి. దీనిపై సమగ్ర కార్యాచరణ అవసరము. అది ఆరంభ శూరత్వం కాకూడదు.

స్వచ్ఛ తెలంగాణ అంటే ఊర్లల్లో ఉన్న చెత్తను, వ్యర్థాలను తీసుకువెళ్లి ఊరి పొలిమేరల్లో వేయడం కాదు. చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో శుద్ధి చేసి పునరుపయోగం కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. చెత్తపై జరిగే సమరంలో ప్రజల భాగస్వామ్యమే కీలకం. చెత్తవల్ల అన్ని కాలుష్యమవుతున్నాయి. ముఖ్యంగా జల, వాయు కాలుష్యం పెరుగుతోంది. హైదరాబాద్ నగరంలో మూసీ నది జల కాలుష్యానికి ప్రత్యేక ఉదాహరణ. పరిస్థితి దిగజారక ముందే వ్యర్థాలను శుద్ధి చేసే ప్రక్రియ చేపట్టాలి.

తెలంగాణ ప్రభుత్వం మార్చి మొదటి వారంలో జాతీయ హరిత ట్రిబ్యునల్ కు ఇచ్చిన నివేదికను యథాతథంగా అమలు చేయాల్సిన అవశ్యకత ఉంది. 2016 జూన్ నాటికి రోడ్లపై చెత్త వేయడాన్ని నిషేధిస్తామని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తామని, గృహాలు, పాఠశాలలు, ప్రార్థన మందిరాలు, పార్కులు, వీధుల్లో బహిరంగ చెత్త నిల్వ కేంద్రాల ను నిషేధిస్తామని, చెత్తవేసే వారి నుంచి వసూలు చేసే 'యూజర్ ఛార్జస్' లను తగ్గిస్తామని సర్కార్ హామీ ఇచ్చింది. అవి మాటకు కట్టుబడాలి. బయోమెడికల్, ఎలక్ట్రానిక్ చెత్తపై రాష్ట్రంలో ఇప్పటివరకు సమగ్ర విధానం రూపొందించలేదు. దీనిని తక్షణం పట్టాలకు ఎక్కించాలి. ఆస్పత్రులు, మార్కెట్లు, రైతుబజార్లు, వాణిజ్య సముదాయాలు, కూడళ్లు, బస్టాండ్లు...

ఇలా జన బాహుళ్య ప్రాంతాల్లో చెత్త పారేసేవారిపై కఠిన చర్యలకు ఉపక్రమించవల్సిన అవసరం ఉంది. ఇదే సమయంలో చెత్త, వ్యర్థాల సేకరణ పనిలో ఉన్న కార్మికుల స్థితిగతులను మెరుగుపరచడం పైన దృష్టిసారించాలి. కేంద్రం ప్రభుత్వం మానవ హక్కుల సంఘాలు ఎన్నిసార్లు హెచ్చరిస్తున్న మురికినీటి ప్రవాహాల్లో మనుషులతోనే పనులు చేయిస్తున్నారు. ఈ విధానానికి స్వస్తి పలకకపోతే స్వచ్ఛ తెలంగాణ సాధ్యం కాదు. వ్యర్థాల నిర్వహణకు నిధుల పరంగా సమస్య ఎదురుకాదు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో వ్యర్థాల నిర్వహణ కోసమే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 65 కోట్లు కేటాయించబోతున్నాయి.

పద్నాలుగో ఆర్థిక సంఘం సైతం రూ. 131 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చింది. 'స్వచ్ఛ తెలంగాణ - స్వచ్ఛ హైదరాబాద్' లో మరో కీలకాంశం మరుగుదొడ్ల నిర్మాణం. అధికారిక నివేదిక ప్రకారం - జాతీయస్థాయిలో పట్టణాల్లో 81.1% మందికి మరుగుదొడ్లు ఉంటే తెలంగాణాల్లోనే 91.12% ఆ వసతి ఉంది. వ్యక్తిగత మరుగుదొడ్ల పథకం పేరుతో గత ప్రభుత్వాలు ఇచ్చిన బొటాబొటీ నిధులను స్థానిక నాయకులే స్వాహా చేశారు. ఇంట్లో మరుగుదొడ్డి కట్టుకోవాలన్నా పేదవాడి కల కళగానే మిగిలింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించిన తీరు ఆదర్శనీయమైనది.

కేంద్రప్రభుత్వం పట్టణాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి 4000 మాత్రమే ఇస్తుండగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దమనసు చేసుకొని తన వంతు వాటాగా ఒక్కు మరుగుదొడ్డికి 8000 అదనంగా జోడించి లబ్ధిదారుడికి మొత్తం రూ.12000 ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేసింది.రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని పట్టణాలు, నగరాల్లో సుమారు 3.5 లక్షల ఇళ్లల్లో మరుగుదొడ్లు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించింది. ఇది పూర్తయితే 'స్వచ్ఛ తెలంగాణ' దాదాపు సాకారం అయినట్లే!

## జన చైతన్యమే కీలకం

ప్రభుత్వం ఎన్ని పథకాలు, కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, జన చైతన్యం కొరవడితే అనుకున్న లక్ష్యాన్ని సాధించలేరు. 'స్వచ్ఛ తెలంగాణ - స్వచ్ఛ హైదరాబాద్' వైపు ప్రజలను కదిలించే నిర్దిష్ట కార్యక్రమాలకు రూప కల్పన జరగాలి. ఒకరోజు చీపురు పట్టుకొని వీధులను ఊడిస్తే సరిపోదు. ఈ ప్రక్రియ నిరంతర యజ్ఞంగా సాగాలి. ఎవరికివారు శుభ్రతను తమ బాధ్యతగా గుర్తెరగాలి.

మహాత్మాగాంధీ 150 వ జయంతి (2019 అక్టోబర్2) నాటికి స్వచ్ఛ తెలంగాణ సాధించాలంటే- ప్రభుత్వం ఒకటై పనిచేస్తే సరిపోదు. విశేష జన బాహుళ్యంతో ముడిపడిన కార్యక్రమం ఇది. ఒక క్రమ పద్ధతి ప్రకారం ప్రజాభాగస్వామ్యం ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటిదశలో 'స్వచ్ఛ హైదరాబాద్'కు ప్రణాళిక రచించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా రూపొందించాలంటే, పరిశుభ్రత, పచ్చదనం విషయంలో ప్రపంచంలోనే మేటి నగరాలకు ధీటుగా తీర్చిదిద్దాలి.

ప్రస్తుత కార్యక్రమం ఆ దిశలో పడిన తొలి అడుగు.ఈ బృహత్ కార్యక్రమాన్ని అనుసరించి నగరాన్ని 400 భాగాలుగా విభజిస్తున్నారు. ప్రతి భాగానికి ప్రత్యేకంగా ఓ బాధ్యతని నియమిస్తున్నారు. 15 మంది స్థానికులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నారు. వీరితో స్థానిక ప్రజలకు పరి శుభ్రతపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. హైదరాబాద్‌లోనే ప్రారంభమయ్యే స్వచ్ఛత కార్యక్రమం అవిరళ గంగా ప్రవాహంలా సాగాలి. స్వచ్ఛత దీక్షా బూని ప్రజలు ఉద్యమస్థాయిలో కదలాలి. వ్యక్తిగత పరి శుభ్రతకు ఎంతటి ప్రాధాన్యమిస్తారో, పరిసరాలు శుభ్రతకు అదేవిధంగా తోడ్పాటునందించాలి. పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే మాత్రమే కాదు... ప్రజలందరి కర్తవ్యం!

*- టి.ఐ& పి.ఆర్*



# 14వ ఆర్థిక సంఘు నిధులు రూ. 580.34 కోట్లు గ్రామాలకు కేటాయింపు

గ్రామాల అభివృద్ధిలో పలు ఒడుదుడుకులుంటాయి. వాటిని చూచి నిరుత్సాహపడకుండా కనీసం కొన్ని కుటుంబాలనైనా బాగు చేయించేందుకు ప్రయత్నించాలని టిసిపార్డు కమీషనర్ శ్రీమతి అనిత రామచంద్రన్, ఐఎస్, పిలుపునిచ్చారు. ఆమె మే 26న టిసిపార్డులో గ్రామపంచాయతీ సెక్రటరీల రెండు వారాల శిక్షణ కార్యక్రమంలో ముగింపు పాల్గొని ప్రసంగించారు.



## 6 జిల్లాల పంచాయతీ సెక్రటరీల శిక్షణ ముగింపు

గ్రామ కార్యదర్శులు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేసి గ్రామపాలనను ముందుకు సమర్థవంతంగా నడిపించాలని అనిత రామచంద్రన్ అన్నారు. గ్రామ పంచాయతీలలో సర్పంచులతో కలిసి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు.

ఈ రెండు వారాల శిక్షణా కార్యక్రమంలో ఆరు జిల్లాల నుండి 187 మంది గ్రామపంచాయతీ సెక్రటరీలు రెసిడెన్సియల్ ఫౌండేషన్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆ జిల్లాలు మెదక్ 31 మంది, నల్గొండ 41, రంగారెడ్డి 44 ఖమ్మం 11 మంది, మహబూబ్‌నగర్ నుండి 41 మంది నిజామాబాద్ నుండి 19 మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫౌండేషన్ శిక్షణా కోర్సులో అనేక విషయాలు తెలుసుకొన్నామని, వాటర్ మేనేజ్‌మెంట్ తదితర కేష్ వ్యవహారాలు కోర్సులో చేర్చవలసి ఉందని అభిప్రాయపడ్డారు. సర్పంచ్‌లు-జి.పిలను మరింత సమన్వయంగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమానికి జాయింట్ కె. యాదయ్య అధ్యక్షత వహించారు. కోర్సు డైరెక్టర్ శ్రీ లింబగిరి స్వామి ఆంజనేయులు తదితర అధికారులు పాల్గొన్నారు.

\- సిఎంపి



# పిల్లల సంరక్షణ ఎదుగుదల

'పి'ల్లల సంరక్షణ, ఎదుగుదల' ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చలో ప్రముఖమైన అంశం. ఎందుకు ఈ విషయంగా ఇంత దృష్టి పెట్టవలసి వచ్చింది అంటే, 21 వ శతాబ్దంలో కూడా -

* నవ జాత శిశువుల మరణాలు (28 రోజుల లోపు శిశువులు)
* శిశు మరణాలు (సంవత్సరం లోపు శిశువులు)
* ఐదు సంవత్సరాలలోపు చిన్నారుల మరణాలు (1 నుండి 5 సంవత్సరాల లోపు)
* మాతృ మరణాలు (ప్రసవ సంబంధిత) సంభవిస్తున్నాయి.
* తల్లులు, పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు



ఐరన్, ఫోలిక్ ఆసిడ్, కాల్షియం, అయోడిన్ సూక్ష్మ పోషకాలు ప్రొటీన్ వినియోగం, మలేరియా నిరోధక చర్యలు, నులిపురుగుల తొలగింపు, స్థూల కాయ నిరోధం, గర్భిణీ దశలో కనీసం 4 సార్లు వైద్యులచే ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహా ప్రకారం టీటీ ఇంజక్షన్లు తీసుకోవటం.

ఆస్పత్రి / ఆరోగ్య కేంద్రంలో ప్రసవం జరగటం.

**అవసరాన్ని బట్టి పోషక ఆహారం :** 20 సంవత్సరాల కంటే తక్కువ వయసులో గర్భధారణ, ప్రసవాల మధ్య తగినంత వ్యవధి లేకపోవడం వల్ల బిడ్డ తక్కువ బరువుతో పుట్టే అవకాశాలు, ప్రసవంలో సమస్యలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

మాతృమరణాల నిష్పత్తి కూడా అటువంటి స్త్రీలలో రెండు రెట్లు అధికంగా ఉండటం జరుగుతుంది. ఐరన్, కాల్షియం లోపాలు మాతృమరణాలలో ప్రముఖ పాత్ర వహిస్తాయని తెలిసింది.

తల్లిలో ఐరన్ లోపానికి బిడ్డ తక్కువ బరువుతో పుట్టటానికి సంబంధముందని తెలిసింది. మాతృ స్థూలకాయానికి, ముందస్తు ప్రసవానికి, మాతృ మరణానికి సంబంధముందని తెలిసింది.

గర్భస్థదశలో తల్లి పోషకాహార లోపం బిడ్డ ఎదుగుదల లోపానికి బిడ్డ స్థూలకాయం బారిన పడటానికి పెద్దైన అవకాశాలకు దారి తీస్తుందని కూడా తెలిసింది.

భారతదేశంలో మాతృమరణాలకు ముఖ్యకారణాలు రక్తపోటు సమస్యలు, రక్తస్రావం, సెప్సిస్, గర్భస్రావ సమస్యలు, గర్భస్థ దశలో ఆరోగ్య జాగ్రత్తలతో పాటు ప్రసవాలు ఆసుపత్రిలలో లేదా ఆరోగ్య కేంద్రాలలో జరిగితే ఈ మరణాలు చాలావరకు నివారించవచ్చును.

'కాల్ టుయాక్షన్' పేరిట ప్రపంచ దేశాలన్నీ పిల్లల సంరక్షణ, అభివృద్ధికి అవసరమయ్యే చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా మన భారత ప్రభుత్వం కూడా మహిళా శిశు సంక్షేమ శాఖ, జాతీయ గ్రామీణ వైద్య ఆరోగ్య సంస్థ గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖలను అప్రమత్తం చేసింది. ఈ శాఖల ద్వారా అందిస్తున్న సేవలను పూర్తి స్థాయిలో అవసరమయ్యే లబ్ధిదారులకు చేర్చగలిగితే మన పిల్లల మనుగడకు, అభివృద్ధికి భరోసా ఇచ్చిన వారమవుతాం.

### పిల్లల ఎదుగుదలకు తీసుకోవలసిన జాగ్రత్తలు

గర్భధారణకు పూర్వం

**అవసరమైన జాగ్రత్తలు :** 1. కనీస గర్భధారణ వయస్సు 2. గర్భాల మధ్య వ్యవధి 3. గర్భస్రావ జాగ్రత్తలు 4. పూర్తి ఆరోగ్యం

### నవజాత శిశువు

*అవసరమైన జాగ్రత్తలు :*

* మొదటిగంట సేపు తల్లి శరీరంతో సన్నిహిత స్పర్శ
* బిడ్డను వెచ్చగా ఉంచే ఏర్పాటు
* సాధ్యమైనంత త్వరగా చనుబాలు ఇచ్చే ప్రయత్నం ప్రారంభించటం (ముర్రుపాలు)
* బిడ్డకు విటమిన్-కె అందజేయడం.
* అవసరాన్ని బట్టి తక్కువ బరువున్న శిశువలకు విటమిన్-ఎ అందివ్వటం.
* 'కంగారు' జంతువు బిడ్డను ఎలా పెట్టుకుంటుందో, నవజాతి శిశువు కూడా అలాగే పెట్టుకోవాలి.
* అవసరాన్ని బట్టి అంటువ్యాధి నిరోధక మందులు బిడ్డకు తల్లికి అందివ్వటం.
* బొడ్డు కోయడానికి సక్రమమైన క్రిమిరహిత పద్ధతి టించడం.
* అవసరాన్ని బట్టి శిశువు సక్రమంగా ఊపిరి తీసుకునేందుకు సాయపడటం.



***అవసరాన్ని బలపరచే ఆధారం*** : క్రొత్త శిశువు విషయంలో ఈ జాగ్రత్తలు పాటించకపోవడమే మొత్తం శిశు మరణాలలో సగానికి పైగా ఈ దశలో జరుగుతాయని తేలింది. ఈ మరణాలకు కారణాలు.

| | |
|---|---|
| 25% – అంటువ్యాధులు | 23% – ఊపిరాడక పోవటం |
| 35% – ముందస్తు ప్రసవాలు | 17 – ఇతర కారణాలు |

భారతదేశంలో 1 సంవత్సరానికి 3 లక్షల శిశువులు మొదటిరోజునే మరణిస్తున్నారు. ఈ టీకాల కార్యక్రమం వ్యాధుల నుండి (క్షయ, పోలియో, ధనుర్వాతం, కోరింతదగ్గు, తట్టు, హెపటైటిస్ బి) రక్షణనిస్తుంది.

### 5 సంవత్సరాల వయసు పూర్తయేంత వరకు

*అవసరమైన జాగ్రత్తలు :*

* మొదటి 6 నెలలు బిడ్డకు కేవలం చనుబాలే మాత్రమే ఇవ్వటం.
* 6 నెలలు దాటాక చనుబాలతో పాటు అనుబంధ పోషకాహారం కూడా ఇవ్వాలి. చనుబాలు పిల్లలకు కనీసం 2 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు ఇవ్వాలి.
* 6 నెలలు దాటాక చనుబాలతో పాటు అనుబంధ పోషకాహారం కూడా ఇవ్వాలి.



* సూక్ష్మ పోషకాలను (ముఖ్యంగా విటమిన్ ఏ, ఐరన్ జింక్) ఆహారం ద్వారా కానీ, ఇతరత్రాకాని తప్పకుండా అందివ్వాలి.
* సంవత్సరం లోపున వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని పూర్తిగా పాటించడం (బిసిజి, డిపిటి, ఓపివి, తట్టు).
* బిడ్డలు అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు పోషకాహారం మానకూడదు. (ద్రవాహారం రూపంలో) చనుబాలివ్వటం ఆపకూడదు.
* మలేరియా విస్తృతంగా ఉన్న ప్రాంతాలలో క్రిమి సంహార మందుతో ఉన్న దోమ తెరల వాడకం.
* సమస్యాత్మకం కాని చిన్న జబ్బులకు సరైన చికిత్సను ఇంట్లోనే ఇవ్వటం (ముఖ్యంగా విరేచనాలక ఓఆర్‌టి ద్రావణం ఇవ్వటం).
* అవసరమొచ్చినపుడు తాత్సారం చేయకుండా పిల్లలకు వైద్య సహాయం అందచేయటం.
* పిల్లలకు ఉత్తేజకరమైన వాతావరణాన్ని అందించి వారి అవసరాలకు స్పందించడం ద్వారా వారి సాంఘిక ఎదుగుదలను పెంచాలి.
* సరైన పారిశుద్ధ్యం, వ్యక్తిగత శుభ్రతా అలవాట్లు ముఖ్యంగా మొదటి 6 నెలల చనుబాలతో పెరిగిన బిడ్డల విషయంలో శారీరక, మానసిక ఎదుగుదల బాగా ఉంటుందని శాస్త్రీయ పరిశీలనలో తేలింది. పైగా ఇతర బిడ్డలతో పోలిస్తే వ్యాధులు వచ్చే అవకాశం 6 రెట్లు తక్కువగా ఉంటుందని నిరూపితమయింది.
* 6 నెలల తరువాత కేవలం చనుపాలు చాలదు కాబట్టి అనుబంధకాహారం అవసరం.
* ఈ దశలో జింక్ ఎదుగుదలకు తోడ్పడుతుందని, న్యుమోనియా విరేచనాల అవకాశాన్ని తగ్గిస్తుందని తేలింది.
* విటమిన్-ఏ వ్యాధి నిరోధక శక్తి పెంచుతుందని ఐరన్ కూడా ఎదుగుదలకు తోడ్పడుతుందని తేలింది. ఇది ముఖ్యంగా విరేచనాలతో బాధపడుతున్న పిల్లల శక్తి పెంచుతుందని, విరేచనాలను పెంచదని తేలింది.
* ఓఆర్‌టి విరేచన సంబంధిత పిల్లల మరణాలను 41% మేకు

తగ్గించినట్లు తేలింది.

* ఈ రకంగా పెరిగిన పిల్లల్లో విద్యా విషయక విజయాలే. కాకుండా, సరైన సాంఘిక దృక్పథం కూడా ఉంటుందని తేలింది.

*అవసరాన్ని బలపరచే ఆధారం :*

* మొదటి 6 నెలలు చనుబాలతో పెరిగిన బిడ్డల విషయంలో శారీరక, మానసిక ఎదరుగుదల బాగా ఉంటుందని శాస్త్రీయ పరిశీలనలో తేలింది. పైగా ఇతర బిడ్డలతో పోలిస్తే వ్యాధులు వచ్చే అవకాశం 6 రెట్లు తక్కువగా ఉంటుందని నిరూపితమయింది.

* 6 నెలల తరువాత కేవలం చనుపాలు చాలదు కాబట్టి, అనుబంధకాహారం అవసరం.

* ఈ దశలో జింక్ ఎదుగుదలకు తోడ్పడుతుందని, న్యుమోనియా విరేచనాల అవకాశాన్ని తగ్గిస్తుందని తేలింది.

* విటమిన్-ఏ వ్యాధి నిరోధక శక్తి పెంచుతుందని ఐరన్ కూడా ఎదుగుదలకు తోడ్పడుతుందని తేలింది. ఇది ముఖ్యంగా విరేచనాలతో బాధపడుతున్న పిల్లల శక్తి పెంచుతుందని, విరేచనాలను పెంచదని తేలింది.

* ఓఆర్‌టి విరేచన సంబంధిత పిల్లల మరణాలను 41% మేరకు తగ్గించినట్లు తేలింది.

* ఈ రకంగా పెరిగే పిల్లల్లో విద్యా విషయక విజయాలే కాకుండా, సరైన సాంఘిక దృక్పథం కూడా ఉంటుందని తేలింది.

## ఈ బృహత్కార్యంలో పంచాయతీరాజ్ సంస్థల పాత్ర

ఇంతటి జాతీయ ప్రాముఖ్యత కలిగిన కార్యచరణలో గ్రామ పంచాయతీలకు ఎన్నుకోబడిన సర్పంచ్‌లు, సభ్యుల పాత్ర కూడా చాలా ముఖ్యమైనది. పిల్లల మనుగడ, ఎదుగుదల కార్యక్రమాల రకింద రూపటి పౌరుల శారీరక, మానసిక పటుత్వానికి మంచి పునాదులు వేసి మరింత మెరుగైె ఫలితాలను త్వరితగతిన సాధించే దిశలో





మన రాష్ట్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (యస్.ఆర్. హెచ్.యం) లక్ష్యాలకు అనుగుణంగా వివిధ స్థాయిలలో చేయవలసిన కార్యక్రమాలలో భాగంగా గ్రామ పంచాయతీ స్థాయిలో కూడా చేయవల సిన కార్యక్రమాల గురించి మార్గదర్శకాలను ప్రకటించడమయింది. దీని కోసం నిర్దేశించబడిన గ్రామస్థాయి కార్యచరణ కమిటీలో సభ్యులుగా వ్యవహరిస్తూ గ్రామ పంచాయితీలు, సభ్యులు ఈ మార్గదర్శకాల ప్రకారం చేయవలసిన పనులలో కొన్ని ఇలా ఉన్నాయి.

* గ్రామంలో త్రాగునీరు, పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తూ అవసరమైన మరమ్మత్తులు, నిర్వహణ చేపట్టడం.

* ఈ రకంగా పెరిగ్రామ పంచాయతీ సభ్యులు, ఆరోగ్య, పారిశుద్ధ్య, పోషకాహార కమిటీ సభ్యులు ప్రతి నెల జాతీయ ఆరోగ్య పరిరక్షణా దినముల నాడు నిర్దేశించబడిన ఆరోగ్య పోషకాహార కార్యక్రమాలు విజయంతంగా అమలు అయ్యేటట్లు తమ సహకారాన్ని అందివ్వటమే కాకుండా, వాటి పర్యవేక్షణలో కూడా పాలు పంచుకోవడం.

* ఈ రకంగా పెరిపోషకాహారలోపంతో బాధపడే పిల్లల తల్లిదండ్రులకు గర్భిణీస్త్రీల భర్తలకు తగు సూచనలు అందేట్టుగా అశా వర్కర్లు, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లకు సహాయ సహకారాలు అందివ్వటం.

* ఈ రకంగా పెరిగామాలలో ప్రతినెలా జరిగే జాతీయ ఆరోగ్య పరిరక్షణా దిన కార్యక్రమాలు సరిగా జరిగేందుకు గాను త్రాగునీరు మరియు పరి శుద్ధ్య ఏర్పాట్లు, అనువైన ఏర్పాట్లు గావించటం. ఈ కార్యక్రమాలు సరిగా జరిగేట్టు చూడటం. (సిబ్బంది హాజరు, కావలసిన వసతులు, లబ్ధిదారులందరూ హాజరవటం మొదలైనవి)

* ఈ రకంగా పెరిజాతీయ ఆరోగ్య పరిరోణా దిన కార్యక్రమాలలో తప్పకుండా హాజరుపట్టీ తయారు, మాతా శిశువుల బరువు రికార్డు చేయటం, టీకాల కార్యక్రమాలు మరియు పోషకాహారం, ఆరోగ్య పరి రక్షణపై ప్రజలకు సరైన అవగాహన కల్పించే కార్యక్రమాలు యం.పి. హెచ్.ఏ, ఏ.డబ్ల్యు.టిలు జరిపేట్టుగా చూడటం.

* ఈ రకంగా పెరిసంవత్సరంలో రెండుసార్లు అన్ని వనరులలో నుంచి లభించే త్రాగునీటి పరీక్షలు చేయించటం. నీరు కలుషితమయిందని రిపోర్టు వచ్చినప్పుడు పంచాయతీ కార్యదర్శి ద్వారా ట్యాంకును శుభ్రం చేయించి, క్లోరిన్ కలపడం.

* ఈ రకంగా పెరిఆర్.డబ్ల్యు.యస్ శాఖ వారికి పంచాయతీ కార్యదర్శి ద్వారా ఎప్పటికపుడు పైపు రిపేర్లు, ఇతర అవసరాల గురించి సమాచారమందివ్వటం. ◆

# ప్రపంచ రక్త దాతల దినోత్సవం

**WHO నిర్వహించే ఎనిమిది 'గ్లోబల్ పబ్లిక్ హెల్త్ కాంఫెయిన్స్' లో ఇది ఒకటి. ABO రక్త గ్రూప్స్ యొక్క సృష్టికర్త Sri Karl Land Steinar (14th June, 1868) ఇప్పటికి ఈ పద్ధతినే సురక్షితమైన రక్త మార్పిడి విధానంగా ఉపయోగిస్తున్నాం. అందుకే Sri Karl Land Steinar జన్మ దినాన్ని పునస్కరించుకునే ప్రతి సంవత్సరం జూన్ 14వ తేదీన 'ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా' జరుపుకుంటున్నాం.**

ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం "స్వచ్ఛంధ రక్త దానం అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించడం. ఎవరైతే స్వచ్ఛంధంగా రక్తదానం చేస్తున్నారో వారందరికి ఈ కార్యక్రమం ద్వారా ధన్యవాదాలు తెలియచేయడం".

ప్రపంచంలో అత్యంత విలువైనది ఏదైనా ఉంది అంటే అది జీవితం (ప్రాణం) అని చెప్పవచ్చు. ఎందుకంటే డబ్బు, నగలు ఆస్థిపాస్తులు ఇవన్నీ విలువైనవే. కాని ఒకసారి వీటిని పోగొట్టుకున్నా తిరిగి సంపాదించవచ్చు. కాని ప్రాణం మాత్రం తిరిగి తీసుకరాలేం. ఒకప్పుడు డాక్టర్స్‌కు మాత్రమే ప్రాణాలను కాపాడే అవకాశం ఉండేది. కాని ఇప్పుడు రక్తదానం వల్ల మనకు కూడా ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుంది. అందుకే ప్రాణాపాయంలో ఉన్నవారికి రక్తదానం చేసి, జీవితాన్ని నిలబెడదాం.

## రక్తం మార్పిడి ఎవరికి అవసరం

* తీవ్ర రక్త హీనతతో బాధ పడుతున్నవారికి.
* ప్రమాదాలలో గాయపడి తీవ్ర రక్త స్రావం అయినవారికి.
* గర్భవతులకు, ప్రసవ సమయంలో తీవ్ర రక్త స్రావం జరిగినవారికి.
* Major Operation చేసేటప్పుడు.
* తలసేమియా వ్యాధిగ్రస్తులకు.



జూన్ - 14

World Blood Donor Day

"Celebrating the Gift of Blood"

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజు ఎంతో మంది సరియైన సమయంలో రక్త మార్పిడి జరగక చనిపోతున్నారు. ఎన్ని అవగాహనా కార్యక్రమాలు జరిపిన, స్వచ్ఛంధ రక్త దానాన్ని ప్రోత్సహించిన కూడా ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికి కూడా అవసరానికి సరిపడినంతంగా రక్త నిల్వలను సేకరించలేకపోతున్నాం.

ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో రక్త నిధులు కొరత ఎక్కువగా ఉంటుంది. WHO అంచనాల ప్రకారం (2014) సుమారు 60 దేశాలలోనే 99% నుంచి 100% వరకు జాతీయ రక్త నిల్వలు అందుబాటులో ఉన్నాయి మిగిలిన 73 దేశాలలో రక్త నిల్వలు కొరత ఎక్కువగా ఉంది. ఇంకా వారు ఇలాగా కుటుంబ మరియు పెయిడ్ దాతల (Professional Donors) మీద ఆధారపడి ఉన్నారు.

WHO అంచనాల ప్రకారం ప్రతిరోజు దాదాపు 800 మంది గర్భిణీలు గర్భ సంబంధిత కారణాలు మరియు కష్టతరమైన ప్రసవంతో చనిపోతున్నారు. వీరిలో దాదాపుగా 34% మంది తీవ్ర రక్త స్రావంతోనే చనిపోతున్నారు.

## భారతదేశం - రక్త నిల్వలు

మన దేశంలో కూడా రక్త నిల్వల కొరత చాలా ఉన్నది. WHO అంచనాల ప్రకారం (2014) 12 మిలియన్ల యూనిట్ల రక్త నిల్వలు మనకు అవసరంఅయితే మనం కేవలం 9 మిలియన్ల యూనిట్ల రక్తాన్ని మాత్రమే సేకరించగలుగుతున్నాం. ఈ కొరతను తగ్గించడానికి ఎంతోమంది యువతి యువకులు స్వచ్ఛంద రక్త దానం చేయడానికి ముందుకురావల సిన అవసరం ఉంది. దీని ద్వారా మన దేశంలో స్వచ్ఛంధ రక్త దానం ఆవశ్యకత, అవగాహనాకార్యక్రమాలను ముమ్మరం చేయాలి. మనదేశంలో స్వచ్ఛంద రక్త దానం చేయడానికి యువత ముందుకు రాకపోవడానికి ఈ క్రింది అపోహలు కూడా కారణం కావచ్చు.

## రక్త దానం - కొన్ని అపోహలు

* రక్తాన్ని దానం చేయడం వలన బలహీనం అవతామేమో, తొందరగా అలసి పోతామెమో.
* నా శరీరంలో రక్తం తక్కువవుతుందేమో, కళ్లు తిరిగి పడిపోతానేమో.
* రక్తం దానం చేసేటప్పుడు నొప్పి ఎక్కువగా ఉంటుందేమో.



* సురక్షితమైన సిరంజులు ఉపయోగిస్తారో లేదో ఉపయోగించకపోతే నాకు హెచ్.ఐ.వి. వస్తుందేమో.

రక్త దానం చేయడం ఒక ఉన్నతమైన ప్రక్రియ. కాని మనం దానం 'రక్తం' చాలా 'సురక్షితమైనదిగా' ఉండాలి. అంటే ఏ విధమైన రక్త ఆధారితంగా సక్రమించే జబ్బులను కలిగి ఉండరాదు. అందుకే WHO సూచనల మెరకు తప్పని సరిగా దాతల నుంచి సేకరించిన రక్త నమూనాలకు ముందుగా ఈ క్రింది పరీక్షలను నిర్వహించి, ఏ విధమైన వ్యాధులు లేవని నిర్ధారణ అయితే రక్త మార్పిడి చేస్తారు.

* HIV
* Hepatitis B Virus
* Hepatitis C Virus
* STIs
* ఇతర రక్త అదారిత సంక్రమించిన జబ్బులు (Malaria, Typhoid etc.,)

రక్తం స్వీకరణకు ముందుగానే డాక్టర్లు దాతల సాధారణ ఆరోగ్య పరి స్థితి గమనించి పూర్తి ఆరోగ్యంగా ఉంటేనే రక్తం స్వీకరిస్తారు. అంతేకాక రక్త దాతల ప్రమాద స్థితిని అంచనా వేయడం కోసం కౌన్సిలింగ్ కూడా చేయడం జరుగుతుంది. 2020 నాటికి 'స్వచ్ఛంద -సురక్షిత' రక్త సేకరణ ముఖ్య లక్ష్యంగా WHO మరియు ఆయా దేశా ప్రభుత్వాలు పని చేస్తున్నాయి.

### రక్తం దానం ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎంత రక్తం దానం చేయాలి

* 18 నుండి 65 ఏండ్ల మధ్య వయసు ఉండి. 45 కేజిలకు మించి బరువున్న వ్యక్తులందరు రక్తదానం చేయవచ్చు.
* ప్రతి 3 నెలలకు ఒకసారి నిస్సంకోచంగా రక్తదానం చేయవచ్చు.
* గవర్నమెంట్ చేత గుర్తింపు పొందిన అన్ని రక్త నిధి కేంద్రాలలోని (Blood Bank) లో రక్త దానం చేయవచ్చు. వీటిపై అధికారుల నిరంతర పర్యవేక్షణ మరియు నియంత్రణ ఉంటుంది.
* రక్త దాతల నుంచి ప్రతి సారి 300ml - 500ml రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు.

### రక్త దానం - కొన్ని సూచనలు

* రక్త దానం చేమటానికి కనీసం 3 గంటల ముందుగా పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలి.
* రక్త దానం తరువాత దాతలు ఇచ్చిన ఫలహారాలతో పాటుగా మంచి ఆహారాన్ని స్వీకరించాలి.
* రక్త దానం చేయవలసిన ఒక రోజు ముందు నుంచే ధూమపానం (పొగ త్రాగడం) మాని వేయాలి. రక్త దానం చేసిన 3 గంటల తరువాత పొగ త్రాగవచ్చు.
* రక్త దానానికి 48 గంటలలోపు అల్కహాలు స్వీకరించరాదు. అల్కహాలు సేవించినట్లయితే మీరు రక్త దానం చేయడానికి అనర్హులు.

### రక్త దానం - కొన్ని వాస్తవాలు

* మీరు ఒకసారి చేసే రక్తదానం అపదలో ఉన్న నలుగురి ప్రాణాలను కాపాడుతుంది.
* సేకరించిన రక్తాన్ని 35 నుంచి 42 రోజుల లోపలే ఉపయోగించాలి. లేకపోతే అది నిరుపయోగనుమవుతుంది.
* రక్త దానం చేసిన కొద్ది రోజులలోనే మీ శరీరంలో రక్తం పునరుత్పత్తి అవుతుంది. (STRC, TSIPARD)

- ఎ. విజయలక్ష్మి
ట్రైనింగ్ ఆఫీసర్, ఎస్‌టిఆర్‌సి, టిసిపార్డ్

Printed & Published by: Anita Ramachandran, Commissioner, on behalf of TSIPARD, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. Telangana, Published at TSIPARD, Rajendranagar, Hyderabad-500 030 **Editor : Anita Ramachandran**





పంచాయతీ గ్రామ కార్యదర్శుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో టిసిపార్డ్ కమిషనర్ అనిత రామచంద్రన్, ఐ.ఏ.ఎస్., మాట్లాడుతున్న దృశ్యం.



హైదరాబాద్‌లోని శ్రీనివాస నగర్‌లో స్వచ్ఛభారత్ సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు కాలనీ వాసులనుండి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న దృశ్యం.



Regd. No. HSE/929/2014-2016 | Sthanika Palana | RNI No. APTEL/27888/2009
Published on 25-05-2015 | Date of posting May, 2015 | No. R&D/HSE/929/WPP/2014-15










తాజా సమాచారం కోసం www.apard.gov.in

మరియు YouTube facebook /amrapard

టోల్ ఫ్రీ నెం.: 1800 425 7070